PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 57 | విజయవాడ, శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 27 September 2024 | Rs

విశాఖ ఉక్కు ప్రైవేటీకరించబోం

- ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం : లోకేష్

3

క్లీన్‌స్వీప్‌పై టీమిండియా గురి

- నేటినుంచి బంగ్లాదేశ్‌తో రెండో, చివరి టెస్ట్

8

ఖరీఫ్ ఖేదం

- రైతు వెన్ను విరిచిన భారీ వర్షాలు, కరువు • పన్నెండున్నర లక్షల ఎకరాలు ఖాళీ
- చేతికిరాని సాగైన పంటలు • ఈ నెలాఖరుతో ముగుస్తున్న సీజన్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

సీజన్ ఆరంభంలో అనావృష్టి అనంతరం అతివృష్టి ఈ తడవ ఖరీఫ్ రైతును నిలువునా కుంగదీశాయి. ఒకే పంట కాలంలో రెండు రకాల విపత్తులను అన్నదాతలు తరచు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్ ఈ నెలాఖరుతో ముగుస్తోంది. సెప్టెంబర్ 25 వరకు కావాల్సిన సాధారణ సాగులో పన్నెండున్నర లక్షల ఎకరాలు విత్తు పడక బీడు పడ్డాయి. నార్మల్ సాగు విస్తీర్ణంలో ఇది 12 శాతం. ఇదిలా ఉండగా జులై, ఆగస్టులో తీవ్ర వర్షాభావం, ఆగస్టు, సెప్టెంబర్‌లో భారీ వర్షాలు, వరదలు వేసిన పంటలను నాశనం చేశాయి. వరదల వలన ఐదున్నర లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ప్రభుత్వమే ప్రకటించింది. వాస్తవ నష్టం ఇంకా ఎంతో ఉంటుందని బాధిత రైతులు వాపోతున్నారు. అటు వర్షాభావానికి ఇటు వర్షాలు, వరదలకు పోయింది పోగా మిగిలిన పంట చివరాఖరికి ఎంత చేతికొస్తుందో, అసలెంత దక్కుతుందో తెలీదు. భారీగా దిగుబడులు తగ్గుతాయని మాత్రం అంచనాలు కడుతున్నారు.

డ్రైస్పెల్స్..ఫ్లడ్స్

ఖరీఫ్‌లో సాంకేతికంగా ఇప్పటికి రాష్ట్రంలో సగటున సాధారణ వర్షం కంటే 21 శాతం అధికంగా పడింది. 18 జిల్లాల్లో నార్మల్ కంటే ఎక్కువ, 8 జిల్లాల్లో నార్మల్ స్థాయి వర్షం కురిసింది. కానీ జులైలో 113 మండలాల్లో డ్రైస్పెల్ నెలకొంది. ఆగస్టులో 234 మండలాల్లో సింగిల్ డ్రైస్పెల్, 10 మండలాల్లో డబుల్ డ్రైస్పెల్ తిష్ట వేసింది. ఉత్తరాంధ్ర, ప్రకాశం నుంచి రాయలసీమ వరకు తీవ్ర వర్షాభావం ఏర్పడటంతో సేద్యం స్తంభించగా అప్పటికే వేసిన పంటలు ఎండిపోయాయి. ఒక సమయంలో కృష్ణా డెల్టాకు నీటి కటకట ఏర్పడింది. ఎగువన ప్రాజెక్టుల్లో నీరు లేక కొన్ని రోజులు పట్టిసీమ నీటిపై ఆధారపడాల్సి వచ్చింది. ఇది కొనసాగుతుండగా కొన్ని ప్రాంతాల్లో జులైలో భారీ వర్షాలు పంటలను ముంచాయి. ఆగస్టు చివరన, సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన అసాధారణ వర్షాలకు, కృష్ణా, గోదావరి, బుడమేరు, ఒకటేమిటి అన్ని వాగులు, వంకలు, చెరువులు, నదులు ఉప్పొంగి పంటలను కబళించాయి. వర్షాభావం, అధిక వర్షాలు, వరదల వలన ఖరీఫ్ సేద్యం సాగలేదు. కరువు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలన్నా అంతగా సాగు కాలేదు.

నిరుటి కంటే తగ్గిన వేరుశనగ, పత్తి

ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 81 లక్షల ఎకరాలు కాగా 68.60 లక్షల ఎకరాల్లోనే సాగయ్యాయి. లోటు 12.40 లక్షల ఎకరాలు. చిరుధాన్యాలలో మొక్కజొన్న, సజ్జ, పప్పుధాన్యాలలో కందులు, మినుములు, నూనెగింజల్లో ఆముదాలు మాత్రమే నార్మల్ సాగును కొంత వరకు దాటాయి. తతిమ్మా పంటలన్నీ తగ్గాయి. సాగు బాగుందనుకున్నవి కూడా ప్రతికూల వాతావరణ పరిస్థితులను, తెగుళ్లను అధిగమించి ఎంత వరకు నిలబడతాయో అనుమానమే. వరి 10 శాతం తగ్గింది. వేరుశనగ దారుణంగా ఉంది. నార్మల్‌లో సగమే వేశారు. పత్తిదీ అదే వరస. సహజంగా వాణిజ్య పంటల్లో పత్తి కొన్నేళ్లగా ఊపులో సాగవుతోంది. నిరుడు, ఈ ఏట ఆ ధోరణిలో మార్పొచ్చింది. నిరుటి కంటే సైతం ఈ సంవత్సరం తగ్గింది. సాధారణ సాగులో 67 శాతమే పడింది.

సెప్టెంబర్ 25 నాటికి ఖరీఫ్ సాగు (లక్షల ఎకరాలు)

పంట	నార్మల్	సాగైంది	తగ్గుదల/పెరుగుదల
వరి	37.8	34.10	3.70
తృణధాన్యాలు	4.85	5.47	0.62
పప్పుధాన్యాలు	7.42	10.00	2.58
ఆహారధాన్యాలు	50.02	49.57	0.45
నూనెగింజలు	15.30	8.45	6.85
వేరుశనగ	13.87	7.17	6.70
పత్తి	14.47	9.72	4.75
మొత్తం పంటలు	81.00	68.69	12.40

డొల్ల మందులు !

- 50కి పైగా ఉత్పత్తుల్లో నాణ్యత కరువు
- అత్యధికం ప్రముఖ కంపెనీలవే
- సిడిఎస్‌సిఒ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ : మార్కెట్‌లో విరివిగా దొరికే 50కి పైగా మందులలో నాణ్యత లేదని తేలింది. సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ) తన తాజా సర్వేలో దీనిని గుర్తించింది. కొత్త మందులు, క్లినికల్ ట్రయల్స్ ఆమోదానికి బాధ్యత వహించే ఉన్నత సంస్థ సిడిఎస్‌సిఒ. నాణ్యత లేనివిగా గుర్తించిన మందులు ఇప్పటికే మార్కెట్‌లో విరివిగా అమ్ముడవుతున్నాయని సిడిఎస్‌సిఒ హెచ్చరించింది. వీటిలో అత్యధికం ప్రముఖ కంపెనీలు విక్రయించే మందులు కావడం గమనార్హం. హైబీపీ, యాసిడ్ రీఫ్లక్స్ వంటి సాధారణ పరిస్థితులలో వినియోగించే మందులు కూడా డొల్ల మందులుగా తేలాయి. ఉదాహరణకు, సన్ ఫార్మాస్యూటికల్స్ తయారు చేసిన పుల్మోసిల్ (సిల్డెనాఫిల్ ఇంజెక్షన్) నిర్దిష్ట బ్యాచ్ నాణ్యత లేనిదిగా నిర్ధారణయ్యింది. అయితే ఆ నాణ్యతలేని ఉత్పత్తిని తాము తయారు చేయలేదనీ, అది నకిలీదని సన్‌ఫార్మా పేర్కొంది. ఇదే కంపెనీ తయారు చేసిన యాసిడ్ రీఫ్లక్స్, అజీర్ణానికి సాధారణంగా ఉపయోగించే పాంటోసిడ్ నిర్దిష్ట బ్యాచ్ కూడా నకిలీదిగా తేలింది. దీంతో పాటు గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ ద్వారా తయారైన రక్తపోటును నియంత్రించటం కోసం ఉపయోగించే రెండు మెడిసిన్‌ల కలయిక అయిన టెల్మా హెచ్ (టెల్మిసర్తన్ 40 ఎంజీ, హైడ్రోక్లోరోతియాజైడ్ 12.5 ఎంజీ టాబ్లెట్స్ ఐపీ)లోనూ నాణ్యత లేదని వెల్లడైంది. గ్లెన్‌మార్క్ సైతం నిర్దిష్ట బ్యాచ్‌ను తాము తయారు చేయలేదని వివరణ ఇచ్చింది.

గాజాలో దాడులు ఆపాలి

పాలస్తీనా సంఘీభావ దినంగా అక్టోబరు 7

ఐదు వామపక్షాల పిలుపు

న్యూఢిల్లీ : అక్టోబరు7 గాజాలో ఇజ్రాయిల్ మారణహోమ యుద్ధానికి సంవత్సరం పూర్తవుతున్న రోజు. గత ఏడాది ఇదే రోజున ఇజ్రాయిల్‌లో హమాస్ దాడికి ప్రతీకారం పేరుతో ఇజ్రాయిల్ సైన్యం గాజాలో పాలస్తీనియన్లపై విచక్షణారహితంగా క్రూరమైన దాడులకు దిగింది. ఈ దాడుల ఫలితంగా దాదాపు 42వేల మందికి పైగా పాలస్తీనీయులు మరణించారు. వీరిలో మహిళలు, చిన్నారులు ఎక్కువగా వున్నారు. ఇంకా వేలాదిమంది శిథిలాల కింద సజీవ సమాధి అయ్యారు. నివాస భవనాలు, పాఠశాలలు, ఆస్పత్రులు వేటినీ ఇజ్రాయిల్ వదిలిపెట్టడం లేదు. వైమానిక, భూతల దాడులతో పెద్దయెత్తున విధ్వంసాన్ని సృష్టిస్తోంది. ఇజ్రాయిల్ కిరాతక, దురాక్రమణ చర్యల వల్ల మరణించిన వారి సంఖ్య ఆగస్టు 6 నాటికి 85 వేలకు పైనే వుండొచ్చునని ప్రముఖ మెడికల్ జర్నల్ లాన్సెట్ అంచనా వేసింది. వీటిలో ప్రత్యక్ష, పరోక్ష మరణాలు రెండూ వున్నాయి. ఇజ్రాయిల్ యుద్ధోన్మాద చర్యలు జాతి నిర్మూలనకు దారితీస్తోందని ఈ ఏడాది జనవరిలో అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) వ్యాఖ్యానించింది. గాజాలో తక్షణమే మిలటరీ చర్యలను నిలిపివేయాలని ఇజ్రాయిల్‌కు పిలుపునిచ్చింది. కాల్పుల విరమణ కోసం జరుగుతున్న అర్ధవంతమైన అన్ని చర్చలను ఇజ్రాయిల్ తొక్కేస్తూ వచ్చింది. అంతేకాదు, ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై ఏడాదిపొడవునా దాడులు సాగిస్తోంది. పేజర్లు ఇతర కమ్యూనికేషన్ సాధనాలను ఉపయోగించి పెద్ద ఎత్తున బాంబులను పేల్చుతూ ఈ దాడులను, ఘర్షణలను లెబనాన్‌కు విస్తరింపజేస్తోంది. గాజాల్లో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఈ ఊచకోత, రాక్షసత్వాన్ని నిరసిస్తూ ప్రపంచ వ్యాపితంగా లక్షలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. తక్షణమే యుద్ధాన్ని ఆపాలని వారు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. ఈ ఆటవిక దాడులు మొదలుపెట్టి ఏడాది అవుతున్న సందర్భంగా తక్షణమే ఈ యుద్ధాన్ని ఆపాలని శాంతి కాముకులైన భారత ప్రజలందరూ కోరుతున్నారు. తక్షణమే కాల్పుల విరమణ అమలు జరిపి, ఈ ఘర్షణలకు స్వస్తి పలకాలని కోరుతూ అక్టోబరు 7ను వామపక్షాలు సంఘీభావ దినంగా పాటిస్తాయని ఐదు వామపక్షాల నేతలు ప్రకాశ్ కరత్ (సిపిఎం), డి.రాజా (సిపిఐ), దీపాంకర్ భట్టాచార్య (సిపిఐ-ఎంఎల్ లిబరేషన్), మనోజ్ భట్టాచార్య (ఆర్‌ఎస్‌పి), జి.దేవరాజన్ (అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్)లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇజ్రాయిల్ కాల్పుల విరమణను అమలు చేయాలని కోరుతూ ఆ రోజున ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహించనున్నారు. ఇజ్రాయిల్‌కు అన్ని రకాల ఆయుధాల ఎగుమతులను ఆపాలని, స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడేలా రెండు దేశాల ఏర్పాటు పరిష్కారానికి కృషి చేయాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నారు.

దేవుడ్ని రాజకీయాల్లోకి లాగొద్దు

- సిట్ నివేదిక వచ్చే వరకుమౌనంగా ఉండండి
- వి.శ్రీనివాసరావు సూచన
- మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ యత్నం

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా)

అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడ్ని రాజకీయాల్లోకి లాగుతున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం జి కన్వెన్షన్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డు కల్తీ వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిట్ దర్యాప్తునకు ఆదేశించినందున, ఆ నివేదిక వచ్చే వరకు మౌనంగా ఉండటం మంచిదని వివిధ రాజకీయ పార్టీల నాయకులకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు సూచించారు. తప్పు చేసినవారు ఏ పార్టీ వారు అయినా, ఏ కులం వారు అయినా తప్పనిసరిగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ తయారీలో అక్రమాలు, అన్యాయం జరిగిందనే సాకుతో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు మత విద్వేషాలు రెచ్చగొట్టి రాష్ట్రంలో బలపడాలని చూస్తున్నాయని అన్నారు. దేవుడు అందరివాడని..ఏ దేవుడిని పూజించాలి అనేది రాజకీయ పార్టీలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మతం అనేది ప్రజల వ్యక్తిగత విశ్వాసమని చెప్పారు. లడ్డు కల్తీ పేరుతో ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందన్నారు.

హామీల అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం ఆ విషయమై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వాలు మారిన కార్మికులకు, ప్రజలకు ఇసుక అందుబాటులోకి రాలేదన్నారు. గత ప్రభుత్వం నాటి మాదిరిగానే ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలిపోతోందని, ఇక్కడ సరఫరా చేసే ఇసుక ధరలు కూడా గత ప్రభుత్వ హయాంలో కంటే ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక అందించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ నాలుగున సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా కార్యదర్శి. వై.నరసింహారావు, పట్టణ కార్యదర్శి బూర సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కొత్త క్రీడా పాలసీని రూపొందించండి

- అధికారులకు సిఎం ఆదేశం
- 2027లో రాష్ట్రంలో జాతీయ క్రీడల నిర్వహణ
- అమరావతిలో అతి పెద్ద స్టేడియం
- గ్రామాల్లో కబడ్డీకి ఆటస్థలాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువజన సర్వీసులు, క్రీడల శాఖలపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

రాష్ట్రంలో కొత్త క్రీడా పాలసీ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువజన, క్రీడా శాఖ అధికారులను ఆదేశించారు. యువజన సర్వీసులు, క్రీడల శాఖలపై సచివాలయంలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2017లో రూపొందించిన క్రీడా పాలసీ 2022లో ముగిసిందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం నూతన పాలసీని రూపొందించడంపై చొరవ చూపలేదన్నారు. క్రీడలంటే కేవలం పోటీల్లో పాల్గొనే వాళ్లకు సంబంధించిన విషయంగా చూడొద్దన్నారు. గతంలో గ్రామాల్లో కబడ్డీ, వాలీబాల్ వంటి ఆటలు ఆడేవారని, ఇప్పుడు టీవీలు, ఇతర మాధ్యమాల కారణంగా ఆ సంస్కృతి పోయిందని చెప్పారు. మళ్లీ గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తే ప్రజలు ఆటల వైపు మొగ్గుచూపుతారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలను క్రీడలు, వ్యాయామం వైపు మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. కబడ్డి వంటి ఆటలకు ఆటస్థలాలు అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ పనులు చేయవచ్చని తెలిపారు. ఎన్‌ఆర్‌ఐలు, పారిశ్రామిక వేత్తలు క్రీడా ప్రాంగణాల నిర్మాణానికి ముందుకొస్తే వారి పేర్లు పెట్టుకునే అవకాశం కల్పించాలని సూచించారు. తద్వారా ఆయా గ్రామాల్లో క్రీడా వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆటల ద్వారా ప్రజల ఆరోగ్యం బాగుంటుందని, ఐక్యత పెరిగి మంచి సంస్కృతి నిలుస్తుందని చెప్పారు. 2027లో జరిగే జాతీయ క్రీడలను రాష్ట్రంలో నిర్వహించాలనేది లక్ష్యంగా పెట్టుకుని అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిచేయాలని ఆదేశించారు. క్రీడా ప్రాంగణాల నిర్మాణంతో పాటు గత ఐదేళ్లల్లో నిర్లక్ష్యానికి గురైన వాటిని మళ్లీ నిర్వహణలోకి తీసుకురావాలని ఆదేశించారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన 35 క్రీడా వికాస కేంద్రాలను పూర్తిచేసేందుకు రూ.23కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మెడల్స్ సాధనలో రాష్ట్రం వెనుకబడి ఉందని, ఈ విషయంలో ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. తిరుపతి, అమరావతి, వైజాగ్‌లను క్రీడా హబ్‌లుగా మార్చాలని చెప్పారు. ఈ మూడు ప్రాంతాల్లో అన్ని క్రీడల నిర్వాహణకు సకల సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. గత ప్రభుత్వం నిలిపేసిన ప్రాజెక్టు గాండీవ, మిగతా 7లో

ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి

- జివిఎంసి కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, అందుకోసం విశాఖ మేయర్ ఆధ్వర్యంలో అఖిలపక్ష బృందం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామితో పాటు దేశ ప్రధాని నరేంద్ర మోడీని కలవాలని జివిఎంసి కౌన్సిల్ గురువారం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ వాణిని వినిపించేందుకు పార్టీల కతీతంగా కౌన్సిల్ సభ్యులందరూ ముక్తకంఠంతో అంగీకారం తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీ కరణను వ్యతిరేకించాలని, కర్మాగార పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు డాక్టర్ బి.గంగారావు, ఎజె.స్టాలిన్ అందించిన ప్రతిపాదనల మేరకు జివిఎంసి టేబుల్ అజెండాలో ఎనిమిదో అంశంగా స్టీల్‌ప్లాంట్ విషయాన్ని చేర్చి చర్చించారు. ఈ నెల 24న ప్రారంభమైన జివిఎంసి కౌన్సిల్ సమావేశం తొలి రెండు రోజులూ రసాభాసగా సాగినా మూడో రోజైన గురువారం మాత్రం పలు అజెండాలతో ముందుకు సాగింది. ఉక్కుపై తీర్మానం పట్ల సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు హర్షం వ్యక్తం చేశారు.

మద్యం అమ్మకాలు పెంచే విధానం వద్దు

నూతన పాలసీకి సవరణలు కోరుతూ అక్టోబరు 2న నిరసనలు

మహిళా సంఘాల ఐక్యవేదిక పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మద్యం అమ్మకాలను పెంచే విధానాన్ని ఉపసంహరించుకోవాలని మహిళా సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. అక్టోబరు ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలో అమలులోకి రానున్న నూతన మద్యం విధానాన్ని సవరించాలని, సమయం, షాపుల సంఖ్య కుదించాలని కోరింది. నూతన మద్యం పాలసీని నిరసిస్తూ అక్టోబర్ 2న రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలను చేపట్టాలని పిలుపునిచ్చింది. గురువారం విజయవాడలోని దాసరి భవన్‌లో మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నూతన మద్యం పాలసీపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హైకోర్టు సీనియర్ అడ్వకేట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి మద్యం అమ్మకాలతో వచ్చే ఆదాయంపై వున్న శ్రద్ధ ప్రజారోగ్యం మీద లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. రాష్ట్రంలో గంజాయి, మాదక ద్రవ్యాలు, మద్యం అమ్మకాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర ప్రధానకార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ మహిళల అభిప్రాయాలు తీసుకుని వాటికి అనుగుణంగా నూతన పాలసీ అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలను మరింతగా పెంచేలా వున్న 72వేల బెల్టు షాపులన్నీ రద్దు చేయాలన్నారు. ఎయిడ్స్, పొగత్రాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కలిగించినట్టే మద్యం వల్ల కలిగే నష్టాలపైనా ప్రచారం చేయాలన్నారు.

ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి దుర్గాభవాని మాట్లాడుతూ మద్యపానం వల్ల నేరాల సంఖ్య పెరుగుతుందని ఆందోళన మిగతా 7లో

సమావేశంలో మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్, రమాదేవి, దుర్గాభవాని, సుంకర పద్మశ్రీ తదితరులు

రష్యన్ అణు విధానంలో మార్పు

- పశ్చిమ దేశాలకు ఇది ఓ హెచ్చరిక అన్న పుతిన్



మాస్కో: ఉక్రెయిన్ ముసుగులో అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు, నాటో కలసి మాస్కోపై దురాక్రమణ కు యత్నిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని రష్యా హెచ్చరించింది. తనపై దాడికి అణు శక్తి దేశాలు మద్దతు ఇస్తే ఏం జరుగుతుందో ఒక హెచ్చరికగా సవరించిన ఈ అణు విధానం ఉంటుందని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కావ్ అన్నారు. అణు దేశాలు ఏదైనా అణుయేతర దేశం ద్వారా రష్యాపై దాడికి యత్నిస్తే దానిని దురాక్రమణగా పరిగణించి, అణు ఆప్షన్‌ను ఆశ్రయించే విషయం పరిశీలిస్తామని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ హెచ్చరించారు. రష్యన్ అణు సిద్ధాంతాన్ని తాజా పరచడం ద్వారా పుతిన్ పశ్చిమ దేశాల దూకుడుకు గట్టి చెక్ పెట్టారని పరిశీలకులు భావిస్తున్నారు.

నాగర్‌నార్‌కు 'ఉక్కు' ఉద్యోగులు

- విశాఖలో రహస్యంగా ఇంటర్వ్యూలు
- 'మ్యాన్‌పవర్' పై అడ్డంగా దొరికిన మోడీ సర్కారు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రం సాగిస్తున్న కుట్రలు తేటతెల్లమవుతున్నాయి. ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నాగర్‌నార్ నుంచి 30 మంది అధికారులను పంపించి గడిచిన రెండు రోజులుగా స్టీల్‌ప్లాంట్‌లోని ఉద్యోగులకు నగరంలోని కొన్ని హోటళ్లల్లో రహస్యంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. సుమారు 44 మందిని నాగర్‌నార్ పంపించేందుకు ఎంపిక చేసినట్టు స్పష్టమవుతోంది. మరికొద్ది రోజుల్లోనే 500 మందిని ఇంటర్వ్యూ చేసి ఇక్కడి నుంచి పట్టుకెళ్లే దిశగా అడుగులు వేస్తున్నారు.

ఎన్ని టన్నులకు ఎంతమంది కార్మికులుండాలి ?

కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం చూస్తే సెయిల్‌లో 19.63 మిలియన్ టన్నుల ఉత్పత్తి ఏటా జరుగుతోంది. సెయిల్‌లో 54,840 మంది ఉద్యోగులు ఉత్పత్తిలో భాగస్వామ్యం అవుతున్నారు. విశాఖ ఉక్కులో ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి గాను 20,393 మంది కార్మికులు ఉండాలి. కానీ 12,300 మంది మాత్రమే ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఢిల్లీ పెద్దలు విశాఖ ఉక్కులో అత్యధిక మంది ఉద్యోగులు ఉన్నారన్న వాదనను కూటమి సర్కారు అదేపనిగా ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. సెయిల్‌లో ఉద్యోగుల సంఖ్య, ఉత్పత్తి జరుగుతున్న తీరును బట్టి చూసినా ఒక మిలియన్ టన్నుకు 2793 మంది ఉండాలి. ఈ లెక్కన విశాఖ ఉక్కులో సుమారు ఎనిమిది వేల మంది కార్మికుల కొరత ఉంది. 2002 -2013 మధ్య కాలంలో సరిపడా ఉద్యోగులు సుమారు 20,393 మంది ఉన్నప్పుడు విశాఖ ఉక్కు అన్ని సంవత్సరాలూ నిరాటంకంగా ఏటా రూ.12 వేల కోట్లు నగదు లాభాలు ఆర్జించింది. 12,300 మంది ఉద్యోగుల్లో 2500 మందికి విఆర్‌ఎస్ ఇచ్చేయాలని, 500 మందిని నాగర్‌నార్‌కు పంపించేయాలనే కుట్రలను కేంద్రం సాగిస్తోంది. ఇంకొంతమందిని సెయిల్‌కు పంపనున్నట్టు సమాచారం.

ఇదంతా దేనికోసం? :

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

విశాఖ ఉక్కు నుంచి అందరినీ మిగతా 7లో

తిరుపతి జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 అమలు

- ఎస్‌పి సుబ్బారాయుడు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నెల 25 నుంచి అక్టోబర్ 24 వరకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్‌పి సుబ్బారాయుడు తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ముందస్తు అనుమతి లేనిదే ఎలాంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించ రాదన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు తిరుమలకు జగన్

తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో మాజీ సిఎం జగన్ శుక్రవారం సాయంత్రం తిరుమల పర్యటనకు రానున్నారు. శనివారం శ్రీవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. జగన్ పర్యటన నేపథ్యంలో అలిపిరిలోనే జగన్ డిక్లరేషన్ ఇవ్వాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు తిరుమల ప్రక్షాళన పేరుతో శుక్రవారం బిసివై వ్యవస్థాపకులు రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. పుంగనూరులో ప్రారంభమైన పాదయాత్ర 30న ఉదయం 9.15 గంటలకు అలిపిరి వద్దకు చేరుకుంటుంది.

జగన్‌వి కొత్త నాటకాలు

- టిడిపి నేతల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతి లడ్డూ విషయంలో తప్పు చేసి ఆ నష్టాన్ని భర్తీ చేసుకోవడానికి కొత్త నాటకాలు మొదలుపెట్టారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై పలువురు టిడిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపిఎస్‌ఆర్‌టిసి కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజ టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి నాయకులు రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చడంతోపాటు తిరుమలను కూడా అవినీతికి అడ్డాగా మార్చి ప్రతిష్టను దిగజార్చారని విమర్శించారు. టిటిడిని ఎటిఎం కార్డులా వాడుకున్నారని ఆరోపించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో నాణ్యత లేని నెయ్యికి టెండర్లు ఖరారు చేశారని పేర్కొన్నారు. తిరుమలలో జగన్ డిక్లరేషన్‌పై సంతకం చేయాలన్నారు. లడ్డూ గురించి మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సంతకం చేస్తేనే జగన్ గుడిలోకి..

- టిడిపి అధికార ప్రతినిధి విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటేశ్వరుడిపై నమ్మకం ఉందని రిజిస్టర్‌లో సంతకం చేసే.. లోపలికి వెళ్లాలని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. తిరుమల గుడి రిజిస్టర్‌లో సంతకం చెయ్యకుండా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నం చేస్తే హిందువులని అవమానించినట్టే, తిరుమల ఆలయ మర్యాదలు, సంప్రదాయాన్ని పాటించనట్టేనని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని, దేశవ్యాప్తంగా వచ్చిన చెడ్డ పేరును తొలగించుకోవటానికి జగన్ కొత్తగా తిరుమలకు కాలినడకన ప్రయాణం అని కొత్త నాటకం మొదలుపెట్టారని విమర్శించారు.

నందిగం బెయిల్ కేసుపై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి ఆఫీసుపై దాడి కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీ ఎంపి నందిగం సురేష్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ అక్టోబరు ఒకటికి వాయిదా పడింది. కౌంటర్ దాఖలుకు గడువు కావాలని పోలీసుల తరపున పిపి కోరడంతో అందుకు జస్టిస్ విఆర్ కృపాసాగర్ అనుమతినిచ్చారు. ఇదే కేసులో మరో నిందితుడు శ్రీనివాస్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై కూడా అదేరోజు విచారణ జరుపుతామన్నారు. కావాలనే వాయిదాలు కోరుతున్నారని నందిగం సురేష్ తరపున న్యాయవాది నాగిరెడ్డి అభ్యంతరం చెప్పారు. గత ప్రభుత్వం ఈ విధంగా చేయలేదన్నారు.

భద్రతను పునరుద్ధరించండి : బుగ్గన

ప్రజాశక్తి-అమరావతి

గతంలో ఉన్న వై ప్లస్ కేటగిరి భద్రత తొలగింపు అన్యాయమంటూ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించి విచారణను అక్టోబరు 16కు వాయిదా వేస్తూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్‌కు ప్రాణహాని ఉందని, ప్రభుత్వం వై ప్లస్ భద్రతను ఏకపక్షంగా రద్దు చేసిందని పిటిషనరు తరపున న్యాయవాది వాదించారు.

ప్రతి జిల్లాకూ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్

- మానవ అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా కఠిన చట్టాలు
- హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత

సదస్సును ప్రారంభిస్తున్న హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా, సైబర్ క్రైమ్‌లను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు కఠినమైన చట్టాలను రూపొందిస్తున్నామని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సైబర్ క్రైమ్ నివారణకు ప్రతి జిల్లాకూ ఒక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలను అరికట్టేందుకు మేధావులతో గురువారం విజయవాడలోని ఓ హోటల్‌లో జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సు అనంతరం మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. చిన్నారులు, మహిళల రక్షణే మొదటి ప్రాధాన్యతగా చట్టాలను తయారు చేస్తామన్నారు. టెక్నాలజీ, శిక్షణ కలిగిన వారిని నియమించి హ్యూమన్ ట్రాఫికింగ్‌పై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. ఇటీవల కాలంలో ఆకర్షించే సందేశాలతో వలేసి అమాయకుల నుండి డబ్బును కాజేస్తున్నారని, ఇటువంటి సైబర్ నేరాలను కూడా నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముంబయి నటి కాదంబరి జెత్వానీ కేసులో వేగంగా దర్యాప్తు జరుగుతోందని, ఈ కేసులో ఎంత పెద్దవారున్నా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు ఐపిఎస్‌లను సస్పెండ్ చేయడంతోపాటు విద్యాసాగర్‌ను అరెస్టు చేశామని తెలిపారు. ఈ కేసులో కొంతమంది పోలీసులను విచారిస్తున్నామని, అనంతరం కొంతమందిపై చర్యలు వుంటాయన్నారు. ఈ కేసును ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా సీరియస్‌గా తీసుకున్నారని తెలిపారు. మహిళల ఫొటోలను మార్ఫింగ్ చేసి డబ్బులు వసూలు చేసే మాఫియాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ హ్యూమన్ ట్రాఫికింగ్‌ను అరికట్టేందుకు రాష్ట్రంలోని ఎన్‌జిఒ సంస్థలు, సామాజిక సంస్థలు ఏకమవ్వాలని కోరారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌ను సకల వసతులతో ఫోరెన్సిక్ యూనివర్సిటీలా తీర్చిదిద్దుతామని తెలిపారు.

కేంద్ర ప్రాయోజిత పథకాల పనులు వేగవంతం

రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్ సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రాయోజిత పథకాల పనులు వేగవంతం చేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. రాష్ట్రంలో అమలవుతున్న వివిధ కేంద్ర ప్రయోజిత పథకాలపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, హోం, నైపుణ్యాభివృద్ధి, సాంఘిక, బిసి, గిరిజన, మహిళా శిశు సంక్షేమం, వికలాంగుల శాఖలతోపాటు గృహ నిర్మాణ, వ్యవసాయ, వైద్యారోగ్య, మత్స్యశాఖలపై ఆయా విభాగాల ఉన్నతాధికారులతో చర్చించారు. పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్‌లో మొత్తం 22 కేంద్ర ప్రాయోజిత పథకాలను అమలు చేస్తున్నామన్నారు. 2023-24కు రూ.13,363 కోట్లు, 2024-25కు ఇప్పటి వరకూ రూ.7,899 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.8,340 కోట్లను విడుదల చేసిందని అన్నారు. నైపుణ్య శిక్షణకు సంబంధించి కేంద్రం ఇచ్చిన నిధుల్లో కవర్ చేయనివి ఏమైనా ఉంటే వెంటనే అమలు చేయాలని సూచించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఔట్‌కమ్ బేస్ట్ కార్యక్రమాలు నిర్వహించాలని, శిక్షణ కార్యక్రమాలపై వివరణాత్మక నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

పోలీసు బలగాల ఆధునీకరణపై హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి విజయ్‌కుమార్ వివరించారు. రాష్ట్రంలో అన్ని సిసి కెమెరాలనూ ఆర్‌టిజిఎస్‌తో అనుసంధానించాలని విజయకుమార్‌కు సిఎస్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ కార్యదర్శి జానకి, హోంశాఖ ఐజి పిహెచ్‌డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎస్‌ఆర్‌టిసికి జాతీయస్థాయి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యాప్‌ల ద్వారా నగదు రహిత లావాదేవీలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఎపిఎస్‌ఆర్‌టిసికి 2024 సంవత్సరానికి గానూ గవర్నన్స్ నౌ 9వ పిఎస్‌యు ఐటి అవార్డు దక్కింది. ఎపిఎస్‌ఆర్‌టిసి బస్సుల్లో నగదు రహిత లావాదేవీలు, టికెట్ రహిత సేవలను విజయవంతంగా కొనసాగిస్తోంది. అలాగే బస్సులో డిజిటల్ టికెట్‌లను ఇవ్వడంతో ప్రతి బస్సు ఎక్కడ వుందో ప్రయాణికులు తెలుసుకునేందుకు ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడంతో వారి అభిమానాన్ని చూరగొంది. ఈ డిజిటల్ సేవలకు గానూ ప్రకటించిన గవర్నన్స్ నౌ 9వ పిఎస్‌యు ఐటి అవార్డును గురువారం ఢిల్లీలో ఎపిఎస్‌ఆర్‌టిసి అందుకుంది. ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తరపున ఈ అవార్డును ఎపిఎస్‌ఆర్‌టిసి ఐటి విభాగపు చీఫ్ ఇంజినీర్ వి సుధాకర్ అందుకున్నారు.

వైభవంగా దసరా సాంస్కృతికోత్సవాలు

- ఎంబివికెలో మూడు రోజులపాటు నిర్వహణ
- ఉత్సవాలను ప్రారంభించిన ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఉమామహేశ్వరి

సాంస్కృతికోత్సవాల్లో ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో 'దసరా సాంస్కృతికోత్సవాలు' గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. 'చెడును దునుమాడుదాం - మంచిని పెంచుదాం' అనే నినాదంతో సేఫ్, ఎంబివికెతోపాటు పలు సంస్థల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఎపి ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పి ఉమామహేశ్వరి ఈ ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో గొప్ప విశిష్టత ఉందని, కాలక్రమేనా యువత పెడదోవపడి మన సంస్కృతి, సంప్రదాయాలను మరచిపోతున్నారని తెలిపారు. వాటిని నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఇటువంటి తరుణంలో సేఫ్, ఎంబివికె సంస్థలు నేటి విద్యార్థులకు పండుగల విశిష్టతను, సంస్కృతిని తెలియజేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని తెలిపారు. దసరా సాంస్కృతికోత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు కె స్వరూపారాణి మాట్లాడుతూ పండుగల విశిష్టతలను, మన సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయాలన్న ఉద్దేశంతోనే ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్తును పాడుచేసుకోకుండా సరైన పద్ధతిలో నడుచుకుంటూ ఉన్నత విద్యనభ్యసించుకోవాలని సూచించారు. సిద్దార్థ మహిళా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ టి విజయలక్ష్మి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, కాబట్టి సరైన మార్గాన్ని ఎంచుకొని ముందుకు నడవాలని తెలిపారు. సేఫ్ అధ్యక్షులు జి.జ్యోత్స్న మాట్లాడుతూ దసరా సాంస్కృతిక ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూనియర్స్ విభాగంలో 7 నుండి 10వ తరగతి విద్యార్థులకు, సీనియర్స్ విభాగంలో కళాశాల విద్యార్థులకు, సూపర్ సీనియర్స్ విభాగంలో యువతకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో సిద్దార్థ ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత, దసరా సాంస్కృతికోత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు, ప్రముఖ రచయిత్రి కావూరి సత్యవతి, కామేశ్వరి, ఎ పూర్ణిమ, పి వాణి పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్సే ప్రత్యామ్నాయం

- బిజెపికి గులాంగిరీ చేస్తున్న బాబు, జగన్, పవన్
- పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

సదస్సులో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీయేనని, ప్రతిపక్షం తమదేనని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గ సమావేశం విజయవాడలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సి ఉందని, పార్టీ మనుగడ రాష్ట్రానికి ఎంతో అవసరమని అన్నారు. పార్టీని బలోపేతం చేసుకుని రాజకీయంగా నిలబడాలని చెప్పారు. మొత్తం 5 అంశాలను ప్రతిఒక్కరూ పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీ పునర్ నిర్మాణం జరగాలన్నారు. పాత, కొత్త నాయకులను కలుపుకుని వెళ్లాలని చెప్పారు. వార్డు, మండల, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు కావాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను అందరూ ఛాలెంజ్‌గా తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో పార్టీ గెలుపుపై అధిష్టానం సైతం దృష్టిసారించిందని అన్నారు. ఢిల్లీ స్థాయిలో రాష్ట్ర సమస్యలపై ఉద్యమాలు ఉంటాయని వెల్లడించారు. బిజెపికి చంద్రబాబు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పవన్‌కల్యాణ్ గులాంగిరీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే వీరు నోరు విప్పరని పేర్కొన్నారు. బిజెపి చేసిన అన్యాయంపై గాంధీ జయంతి అక్టోబరు 2న నిరసన చేపడతామని వెల్లడించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో జగన్‌పై వ్యతిరేకత వల్ల చంద్రబాబుకు ఓట్లు పడ్డాయని, బాబుపై ఉన్న వ్యతిరేకతతో గతంలో జగన్‌కు పడ్డాయని వివరించారు. మాజీ మంత్రి, ఆ పార్టీ సిడబ్ల్యుసి సభ్యులు ఎన్ రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. విభజన సమస్యలు, రాష్ట్ర సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఈ ఏడాది చివరి వరకు అన్ని కమిటీలు బలోపేతమవుతాయని చెప్పారు. జమిలి ఎన్నికలు బిజెపి సొంత ఎజెండా అని, దానిని రాష్ట్రంపై రుద్దాలని చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్కం ఠాగూర్, ఎఐసిసి కార్యదర్శి పాలక్ వర్మ, సీనియర్ నాయకులు కెవిపి రామచంద్రరావు, గిడుగు రుద్రరాజు, శైలజానాథ్, జెడి శీలం, తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా భూసేకరణ, అటవీ క్లియరెన్స్

- ఎన్‌హెచ్‌ఎఐ అధికారులకు మంత్రి సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ, అటవీ క్లియరెన్స్‌ల సమస్యలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి బిసి జనార్ధనరెడ్డి.. ఎన్‌హెచ్‌ఎఐ అధికారులకు సూచించారు. గురువారం విజయవాడలోని ఆర్‌అండ్‌బి ఇఎన్‌సి కార్యాలయంలో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జాతీయ రహదారులకు సంబంధించి రూ.58,817 కోట్ల విలువైన 105 ప్రాజెక్టుల్లో 2,594 కిలోమీటర్ల పొడవున రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు. వీటిల్లో కేంద్రం, ఆర్‌అండ్‌బి నియంత్రణలో ఉన్న 31 ప్రాజెక్టులు, జాతీయ రహదారుల విభాగంలో ఉన్న 28 ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ సమస్యలపై మంత్రి ఈ సమావేశంలో సమీక్షించారు. భూసేకరణ సమస్యలపై వెంటనే జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని, వాటిని జాతీయ రహదారుల విభాగం అధికారులకు అప్పగించాలని మంత్రి ఆదేశించారు. అలాగే 26 ప్రాజెక్టుల్లో అటవీ క్లియరెన్స్ సమస్యలనూ పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా భూసేకరణ, అటవీ క్లియరెన్స్‌ల సమస్యలపై కడప, ప్రకాశం, సత్యసాయి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతి బుధవారం జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బి ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, సిసిఎల్‌ఎ కమిషనర్ బాలాజి, జాతీయ రహదారుల విభాగం అధికారులు రామచంద్ర, రాకేష్‌కుమార్, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు మానవ వనరులు సమకూర్చండి

- సమీక్షంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నైపుణ్య శిక్షణ ద్వారా పరిశ్రమలకు అవసరమైన విధంగా మానవ వనరులు సమకూర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అంశంపై నైపుణ్య శిక్షణ, ఎంఎస్‌ఎంఇ, ఇండస్ట్రీస్, సెర్ప్ శాఖల అధికారులతో సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు.

ఐదేళ్లల్లో 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న ఎన్నికల హామీని నెరవేర్చే విధంగా ప్రణాళికలతో పనిచేయాలని సూచించారు. హైబ్రీడ్ విధానంలో ఇంటి నుంచే పనిచేసే కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బహుళజాతి కంపెనీలతో శిక్షణ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ చేపట్టాలని అన్నారు. విజయవాడ వరదల్లో మునిగి సర్వం కోల్పోయిన బాధితులు ఉపాధి చూపించాలని తనను కోరారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎటువంటి ఉపాధి కల్పన చేపట్టవచ్చునే అంశంపై పరిశీలన జరిపి కార్యాచరణ చేపట్టాలన్నారు. వివిధ కారణాలతో గ్రామాల్లో

ఉండిపోయిన వారికి పనిచేసేందుకు అవసరమైన అవకాశాలను కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు కలిసి ఈ పనిచేయాలని చెప్పారు.

ఉక్కు పరిరక్షణకు చిత్తశుద్ధితో పోరాడాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు చిత్తశుద్ధితో పోరాడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, శ్రీనివాస నాయుడు, ప్రసాద్, మహాలక్ష్మి నాయడు, పరంధామయ్య అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1323వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ జెఎంఎస్, డిఐటియు, విఎస్ఇయు, యూజ్, విఎస్‌పిఇయు, విఎస్‌ఎంఎస్ సంఘాల కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ లాభాల్లో ఉన్న ప్లాంట్‌ను కావాలనే రూ.5000 కోట్ల నష్టాల్లోకి నెట్టారన్నారు. ప్లాంట్‌ను కాపాడుతామని మాయమాటలు చెబుతూ నిర్వీర్యం చేసే దిశగా చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా టిడిపి కూటమి సర్కారు అలసత్వం వీడి రాష్ట్ర ప్రజల మద్దతుతో మోడీ సర్కారుపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చాలని కోరారు. ప్లాంట్‌లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌కుమార్, శ్రీనివాసరావు, డేవిడ్, సుధీర్ రాజు, జె.రామకృష్ణ, విల్లా రామ్మోహన్ కుమార్, గుమ్మడి నరేంద్ర పాల్గొన్నారు.

ఆక్వాలో వైరస్ నివారణకు పెద్దపీట

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లక్షలాది మందికి ఉపాధి లభిస్తున్న ఆక్వా రంగంలో వైరస్ సమస్యల బారి నుండి కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమెరికాలోని సైబస్ బయోటెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కంపెనీ ప్రతిపాదనల మేరకు కోస్తా ప్రాంతంలో వారి స్టార్టప్ ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పిస్తామని మంత్రి వారికి వివరించారు. హేచరీలు, ఫిష్‌పాండ్ల స్థాయిలోనూ వైరస్‌ను నివారించొచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సైబస్ సంస్థ ప్రతినిధులు రవీంద్రనాథ్, అనంత్‌నాగేష్, రమేష్ వెంకటరామన్, క్రైగ్ విలియం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై వేధింపులు తగవు

- ఎన్‌జిఒ సంఘం మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికలకు ముందు టిడిపి కూటమి ఉద్యోగులకు, రిటైర్డు ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా అధికారంలోకి వచ్చాక రెడ్‌బుక్ పేరుతో ఉద్యోగులను వేదింపులకు, బెదిరింపులకు గురిచేస్తుందని ఎపిఎన్‌జిఒ సంఘం మాజీ అధ్యక్షులు ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులపై తక్షణం వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పట్ల సిఎం చంద్రబాబు చాలా దారుణంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ఎమ్మెల్యేలు కూడా బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. మరోవైపు బదిలీల వేధింపులతోపాటు సీనియర్ అధికారులకు కనీసం పోస్టింగు ఇవ్వకుండా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మంత్రి నారా లోకేష్ పదేపదే రెడ్‌బుక్ పేరు చెప్పి ఉద్యోగులను బెదిరించడం మానుకోవాలన్నారు.

కస్టడీ కోసం పట్టుపట్టొద్దు

- విద్యాసాగర్ పిటిషన్‌పై పోలీసులకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

సినీనటి జెత్వానీ కేసులో ప్రధాన నిందితుడు, వ్యాపారవేత్త కె విద్యాసాగర్‌ను కస్టడీకి ఇవ్వాలని అక్టోబరు ఒకటి వరకు పట్టుపట్టరాదని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఇదే విషయాన్ని కింది కోర్టులో చెప్పాలని పోలీసులను ఆదేశించింది. సంబంధిత కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పిపి)కు తెలియజేయాలంది. పోలీసులు అరెస్టు, కింది కోర్టు రిమాండ్‌కు ఆదేశించడాన్ని సవాలు చేస్తూ విద్యాసాగర్ వేసిన పిటిషన్‌పై విచారణను అక్టోబరు ఒకటికి వాయిదా వేసింది.

ఈలోగా పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఆదేశించారు. జెత్వానీ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ విజయవాడ వెస్ట్‌జోన్ అప్పటి ఎసిపి హనుమంతరావు వేసిన పిటిషన్‌పై విచారణను అక్టోబరు ఒకటికి వాయిదా వేశారు.

'గజ్జల' మధ్యంతర పిటిషన్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పదవి నుంచి తనను ప్రభుత్వం అన్యాయంగా తొలగించిందంటూ గజ్జల వెంకట లక్ష్మి దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తన పదవీ కాలం 2026 మార్చి 16 వరకు ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఏకపక్షంగా, చట్ట వ్యతిరేకంగా పదవి నుంచి తొలగించిందని ఆమె పిటిషన్ తరపున జడా శ్రవణ్ కుమార్ వాదించారు. ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతివాదన చేస్తూ, వాసిరెడ్డి పద్మ స్థానంలో పిటిషనర్ మహిళా ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారని, చట్ట ప్రకారం ఆమె పదవీకాలం ముగిసిందన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, మధ్యంతర ఉత్తర్వుల అభ్యర్థనపై తీర్పును వాయిదా వేసింది.

ఉత్తరాంధ్రలో మోస్తరు వర్షం

- పిడుగుపాటుకు ఒకరు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం ఉత్తరాంధ్రలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. విశాఖలో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని కొత్తపెంట గ్రామస్తుడు సూరెడ్డి అప్పలనాయుడు (38) తన పొలం నుంచి తిరిగి ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా అతనికి సమీపంలో పిడుగుపడింది. ఆ శబ్దానికి ఆయన అక్కడికక్కడే మరణించారు. అనకాపల్లి మండలం తుమ్మపాలలో పిడుగుపాటుకు ఆవు మృతిచెందింది. అల్లూరి జిల్లాలోనూ వర్షం పడింది. విజయనగరంలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండగా, మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు గంటల వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. శ్రీకాకుళంలో మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు, పశ్చిమగోదావరి, గుంటూరు చిత్తూరులోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది.

చిరుతను పట్టుకునేందుకు రాజమండ్రి నుంచి నర్సరీలకు తరలించిన బోను

చిరుత కోసం గాలింపు

- రెండు ట్రాప్‌గేజ్‌లు, 20ట్రాప్ కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - కడియం(తూర్పు గోదావరి జిల్లా)

తూర్పు గోదావరి జిల్లా కడియం మండలంలోకి ప్రవేశించిన చిరుత కోసం అటవీశాఖ అధికారుల గాలింపు కొనసాగుతుంది. 20 రోజుల క్రితం రాజమహేంద్రవరం శివారు దివాన్‌చెరువు అటవీప్రాంతంలోకి వచ్చిన చిరుత ఈ నెల 24 రాత్రి జనావాసాల్లోకి ప్రవేశించింది. కడియం మండలం కడియపులంకలో చిరుత అడుగుజాడలను అటవీశాఖ అధికారులు గుర్తించి నిర్ధారించారు. ప్రస్తుతం చిరుత కడియపులంక గ్రామంలోని దాసాలమ్మ కాలనీలోని ఓ నర్సరీలో ఉన్నట్టు అనుమానిస్తున్నారు. 60 మంది సిబ్బంది చిరుత గాలింపు చర్యల్లో ఉన్నారని తూర్పుగోదావరి జిల్లా అటవీ శాఖ అధికారి భరణి, కోనసీమ జిల్లా అటవీశాఖ అధికారి ప్రసాద్ తెలిపారు. 20 ట్రాప్ కెమెరాలు, సోలార్‌తో పనిచేసే నాలుగు సిసి కెమెరాలను, రెండు ట్రాప్‌గేజ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. బోనులో చిక్కుకుంటే బంధించే అవకాశం ఉందని, లేదా మత్తు ఇంజక్షన్ ఇచ్చేందుకు కూడా ఏర్పాట్లు చేశామని, ఒకటి రెండు రోజుల్లో చిరుతను క్షేమంగా పట్టుకుంటామని తెలిపారు. ఒంటరిగా ఎవరూ బయట తిరగరాదని, అత్యవసరం అయితే ఇద్దరు, ముగ్గురు కలిసి వెళ్లాలని, చేతిలో కర్ర, టార్చ్‌లైట్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలని ప్రజలకు సూచించారు.

హోమ్‌లేన్ చేతికి డిజైన్ కేఫ్

న్యూఢిల్లీ : ఇంటీరియర్ డెకర్ సొల్యూషన్స్ సంస్థ హోమ్‌లేన్ తన పోటీ సంస్థ డిజైన్ కేఫ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. అదే విధంగా ఇన్వెస్టర్ల నుంచి కొత్తగా 30 మిలియన్ డాలర్లు (రూ.250 కోట్లు) నిధులు సమీకరించినట్లు హోమ్‌లేన్ తెలిపింది. ఈ నిధులను హీరో ఎంటర్‌ప్రైస్, వెస్ట్‌బ్రిడ్జ్ కాపిటల్ నుంచి పొందినట్లు తెలిపింది. ప్రస్తుతం ఈ రెండు సంస్థల రెవెన్యూ 108 మిలియన్ డాలర్లు (రూ.900 కోట్లు)గా ఉందని అంచనా వేసింది.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరించబోం

- ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం : లోకేష్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

విశాఖ ఉక్కును ప్రయివేటీకరించబోమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎచ్చెర్లలో ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించబోమని కేంద్ర ఉక్కు గనుల శాఖ మంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా చెప్పారన్నారు. విశాఖ ఉక్కును బతికించుకునేందుకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరగా.. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. తిరుమల వెంకటేశ్వరస్వామిని గత వైసిపి ప్రభుత్వం సామాన్య భక్తులకు దూరం చేసిందని, దాన్ని ప్రక్షాళన చేసే క్రమంలో తిరుమల లడ్డూలో కల్తీ విషయం బయట పడిందని చెప్పారు. నెయ్యి సరఫరా చేసే కంపెనీ టర్నోవర్ రూ.250 కోట్లు ఉండాలన్న నిబంధనను వైవి సుబ్బారెడ్డి రూ.150 కోట్లకు ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. తిరుమల దర్శనానికి వెళ్తానంటున్న జగన్ డిక్లరేషన్ ఇచ్చే సంప్రదాయాన్ని పాటిస్తే బాగుంటుందని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే మూడు హామీలను అమలు చేశామని, దీపావళి నుంచి మహిళలకు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు అందిస్తామని తెలిపారు. పథకాల అమలుపై తమకు చిత్తశుద్ధి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వైసిపి నేతలు, అధికారులను వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. రెడ్ బుక్ అమలు ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను భ్రష్టుపట్టించిందని, ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు తొమ్మిది లక్షల మంది విద్యార్థులు మానేశారని, వారిని తిరిగి పాఠశాలలకు రప్పించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే తమ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.2,500 కోట్లు, గుడ్లు, చిక్కీలకు రూ.200 కోట్లు బకాయిలు పెట్టిందన్నారు. జగన్ ధ్వంసం చేసిన విద్యా వ్యవస్థను పద్ధతి ప్రకారం బాగు చేస్తామన్నారు. అందులో భాగంగానే జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు ఒకరోజు పూర్తిగా పాఠశాలల పరిశీలనకు కేటాయిస్తున్నానని తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఉన్నారు.

జనసేన గూటికి బాలినేని, సామినేని, కిలారి

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన పవన్‌కల్యాణ్
- వేలాదిగా తరలివచ్చిన అనుచరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపికి ఇటీవల రాజీనామా చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, గత ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య జనసేనలో చేరారు. ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేలాది మంది వారి అనుచరులు మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. తాము ఎటువంటి షరతులూ లేకుండా పార్టీలో చేరామని వారు ప్రకటించారు. భారీ ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీనిపై పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. నిజాయతీపరులు, అంకితభావంతో పనిచేసే వారికి పార్టీలోకి ఎప్పటికీ ఆహ్వానం ఉంటుందని ప్రకటించారు. ప్రతి గ్రామంలోనూ జనసేనను బలోపేతం చేయాలని ఆయన కోరారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. జనసేనలో చేరినవారిలో విజయనగరం జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ అవనాపు భావన, విక్రమ్, ఒంగోలుకు చెందిన వ్యాపారవేత్త కంది రవిశంకర్, నెల్లూరుకు చెందిన సినీ నిర్మాత చిట్టూరి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం కార్యకర్తలకు పవన్‌కల్యాణ్ అభివాదం చేశారు. ఆయన్ను భారీ గజమాలతో నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు.

శాశ్వత శత్రువులు ఉండరు

పార్టీలో చేరిన అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి, ఉదయభాను మీడియాతో మాట్లాడారు. జనసేనను బలోపేతం చేసుకోవాలనే ఉద్దేశంతోనే తాము పార్టీ మారామని పేర్కొన్నారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని తెలిపారు. తాము వివాదాల జోలికిపోబోమని, ఇన్నాళ్లు రాజకీయాల్లో ఉన్నా వ్యక్తిగత వివాదాలేవీ లేవని పేర్కొన్నారు. తమ నియోజకవర్గాల్లో, జిల్లాలో కూటమి నాయకులను కలుపుకుని పోతామని తెలిపారు.

వాస్తవ సాగుదారులకు కౌలు గుర్తింపు కార్డులివ్వాలి

- కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉచిత పంటల భీమా అమలు చేయాలని, రూ.రెండు లక్షల వరకు రుణాలు మాఫీ చేయాలని, భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా వాస్తవ సాగు దారులకు కౌలుగుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విజయనగరం కలెక్టరేట్ ఎదుట కౌలు రైతులు, రైతులు ధర్నా చేపట్టారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన గురువారం ఈ ఆందోళన చేపట్టారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. రాంబాబు మాట్లాడుతూ.. రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ. 20వేలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు వద్దని, జిఒ 22ను రద్దు చేయాలని, ఈ క్రాప్‌లో సాగుదారులను నమోదు చేయాలని, అన్ని రకాల రైతు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, సహకార రంగంలో ఉన్న భీమసింగి సుగర్ ఫ్యాక్టరీకి నిధులిచ్చి తెరిపించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు తొత్తడి పైడిపునాయుడు, కార్యదర్శి రాకోటి రాములు, రైతు సంఘం నాయకులు, గంగు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

మాగుంట పార్వతమ్మకు కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ఒంగోలు మాజీ ఎంపి మాగుంట పార్వతమ్మకు కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రభుత్వ లాంఛనాలతో నెల్లూరు బోడిగాడి తోటలోని శ్మశానవాటిలో అంత్యక్రియలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. భౌతికకాయాన్ని చూసేందుకు ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి టిడిపి, వైసిపి, కాంగ్రెస్ నాయకులతోపాటు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గురువారం మధ్యాహ్నం నాలుగు గంటలకు సరస్వతి నగర్‌లోని ఆమె నివాసం నుంచి నెల్లూరు ట్రంకురోడ్డు, ఎస్-2, విజయ మహల్ గేట్ మీదుగా శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర సాగింది. పోలీసులు గౌరవ సూచికంగా గాలిల్లో మూడు రౌండ్లు కాల్పులు జరిపి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు భౌతికకాయాన్ని పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు, ప్రముఖులు నివాళులర్పించారు. వారిలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎంపి పనబాకలక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కరణం బలరాం, కంభంపాటి విజయరామిరెడ్డి, నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, పలువురు ప్రముఖులు ఉన్నారు.

పొలంలో ఏర్పడిన సొరంగం

చెట్లు తొలగిస్తుండగా బయటపడిన సొరంగం

ప్రజాశక్తి - బేతంచర్ల (నంద్యాల జిల్లా)

మామిడి చెట్లను తొలగిస్తుండగా ఓ సొరంగం బయటపడింది. ఈ సంఘటన నంద్యాల జిల్లా బేతంచర్ల మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంబాయి గ్రామానికి చెందిన రైతు కరుణాకరప్ప తన పొలంలో మామిడి పంట సాగు చేసేవారు. ప్రస్తుతం మామిడి చెట్లు తొలగించి వేరే పంట సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో జెసిబితో మామిడి చెట్లను తొలగిస్తుండగా ఓ పెద్ద సొరంగం బయటపడింది. ఆ సొరంగాన్ని పరీక్షించి చూడగా బేతంచర్ల మండలంలోని కనుమ కింది కొట్టాల గ్రామంలో ఏర్పడిన బిల్వ స్వర్గం గుహలను పోలి ఉంది. సొరంగాన్ని చూసేందుకు స్థానికులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. సంబంధిత అధికారులు విచ్చేసి పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొండపల్లి, రాయనపాడు ట్రాక్‌ల ముంపుపై

రైల్వే శాఖ ఆరా

- బుడమేరు వరద ముంపు అరుదైనదిగా అంచనా
- భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ట్రాక్‌లు
- వరద నియంత్రణతోనే ముంపు నుండి భరోసా

ముంపునకు గురైన కొండపల్లి రైల్వేస్టేషన్లో ట్రాక్‌పైకి వచ్చిన బుడమేరు వరద నీరు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

దేశంలోనే అత్యంత ఆదాయాన్ని సమకూర్చే విజయవాడ రైల్వే డివిజన్‌కు బుడమేరు వరద దెబ్బ బలంగానే తాకింది. విజయవాడ-హైదరాబాద్ రూట్లో కీలకంగా ఉన్న రాయనపాడు శాటిలైట్ స్టేషన్, కొండపల్లి స్టేషన్ల వద్ద రైల్వే ట్రాక్‌లు ముంపునకు గురవ్వడంతో రోజుల తరబడి రైల్వే ప్రయాణికులకు, గూడ్స్ రవాణాకు ఆటంకం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే రైల్వేశాఖ దీనిపై నివేదికలు సిద్ధం చేసింది. బుడమేరు వరద నియంత్రణతోనే ఈ రూట్లో భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా ఉంటుందని రైల్వే అధికారులు నిర్ధారించినట్లు తెలిసింది. భౌగోళిక పరిస్థితులు (జియో గ్రాఫికల్ కండిషన్) ఆధారంగానే రైల్వే లైన్లు ఏర్పాటై ఉంటాయి. ట్రాకులపై ఆగే రైళ్లలోకి ప్రయాణికులు ఎక్కేందుకు వీలుగా స్టేషన్లలో ప్లాట్‌ఫారాలు నిర్మిస్తారు. ఈ క్రమంలో ఈ ప్రాంతంలోని ట్రాక్‌లు, స్టేషన్లలో మార్పులు, చేర్పులు చేయడానికి వీలుపడదు. విజయవాడ రైల్వే స్టేషన్ మీదుగా రోజువారీ 450 రైళ్లు నడుస్తాయి. వీటిలో 300 ప్రయాణికుల రైళ్లు కాగా, మిగిలిన 150 గూడ్స్ రైళు.. ఏడాదికి రూ.5,580 కోట్ల మేర ఆదాయాన్ని ఆర్జిస్తూ దేశంలోనే అతిపెద్ద డివిజన్లలో ఒకటిగా నిలిచింది. బుడమేరు వరదతో దీని పరిధిలోని రెండు స్టేషన్లు ముంపునకు గురయ్యాయి. వారం రోజులపాటు వందలాది రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. కొండపల్లి, రాయనపాడు రైల్వేస్టేషన్లలో నిలిచిన రైళ్లలోని ప్రయాణికులను అక్కడే దించి వేసి బస్సుల్లో వారి గమ్యస్థానాలకు తరలించాల్సి వచ్చింది. గూడ్స్ రవాణా నిలిచిపోవడం కూడా వ్యాపార సంస్థలకు సమస్యగా మారింది. రైల్వే ఆదాయానికీ గండి పడింది. బుడమేరు వరదను అత్యంత అరుదుగా జరిగే ఘటనగా రైల్వేశాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో సాంకేతిక చర్యలకు వీలులేకపోతే సంబంధిత స్టేషన్లలో ట్రాక్‌లు, స్టేషన్ల ఎత్తుపెంచడానికి అవకాశం లేదని రైల్వే శాఖ నిర్ధారించినట్లు తెలిసింది.

ట్రాక్‌ల ముంపు నివారణకు రక్షణ గోడ!

భవిష్యత్తులో విజయవాడ నగరం బుడమేరు వరద ముంపునకు గురికాకుండా చూడటానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనిలో భాగంగా బుడమేరు కట్టల పటిష్టత, విస్తరణ, పూడికతీత, వరద మళ్లింపు కాల్వల ఏర్పాటు తదితరాలను పరిశీలిస్తోంది. రైల్వే ట్రాక్‌లు, స్టేషన్లు సైతం ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కొండపల్లి, రాయనపాడు ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లు, స్టేషన్లు బుడమేరుకు సమీపంగానే ఉన్నాయి. ఈ క్రమంలో వరద నియంత్రణ చర్యల్లో భాగంగా రైల్వేస్టేషన్లు, ట్రాక్‌ల ముంపు నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. రిటైనింగ్ వాల్ నిర్మించడం ద్వారా బుడమేరు వరదను నియంత్రించి ట్రాక్‌లు, స్టేషన్లు ముంపునకు గురవ్వకుండా రక్షించాల్సి ఉంది.

కేంద్రం అప్పుల వేట

- వచ్చే ఆరు నెలల్లో రూ.6.61 లక్షల కోట్లు లక్ష్యం
- సెక్యూరిటీల జారీతో సమీకరణ

న్యూఢిల్లీ : అప్పుల సమీకరణపై మోడీ సర్కార్ దృష్టి పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి మార్చి కాలం ద్వితీయార్థం (హెచ్2)లో రూ.6.31 లక్షల కోట్ల రుణాలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సెక్యూరిటీలను జారీ చేయడం ద్వారా అప్పులను పొందాలని నిర్దేశించుకుంది. దీంతో రెవెన్యూ లోటును పూడ్చుకోనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. "2024-25 బడ్జెట్‌లో రూ.14.01 లక్షల కోట్ల అప్పులను తీసుకోవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 47.2 శాతానికి సమానమయ్యే రూ.6.61 లక్షల కోట్లను ద్వితీయార్థంలో మార్కెట్ల నుంచి పొందాలని నిర్దేశించుకుంది. ఇందుకోసం డేటెడ్ సెక్యూరిటీలను జారీ చేయడంతో పాటుగా సావరిన్ గ్రీన్ బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.20,000 కోట్ల అప్పులను తీసుకోవాలని నిర్ణయించాం." అని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ అప్పులను 21 వారాల్లో వేలం ద్వారా పొందనున్నట్లు తెలిపింది. ఇందుకోసం 3,5,7,10,15,30,40,50 సంవత్సరాల కాలపరిమితి కలిగిన సెక్యూరిటీలను జారీ చేయనుంది. రూ.14.13 లక్షల కోట్ల రుణం తీసుకోనున్నట్లు 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.15.43 లక్షల కోట్ల అప్పులను సమీకరించారు.

మొండి బాకీల రికవరీకి వన్‌టైం సెటిల్‌మెంట్

- ఐడిబిఐ బ్యాంక్ వెల్లడి

న్యూఢిల్లీ : మొండి బాకీల పరిష్కారానికి రుణ గ్రహీతలకు వన్ టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఐడిబిఐ బ్యాంక్ తెలిపింది. "సుగమ్ రిన్ భుగ్తాన్ యోజన' పథకంలో భాగంగా 2021 మార్చి 31 ముందు నాటికి నిరర్థక ఆస్తులను సులభంగా పరిష్కరించనున్నట్లు తెలిపింది. కష్టాల్లో ఉన్న రుణగ్రహీతకు సంబంధించిన రూ.10 లక్షల నుంచి రూ.10 కోట్ల వరకు రుణాలను అర్హత ప్రమాణాలకు లోబడి పరిష్కరించుకోవచ్చని పేర్కొంది. రుణగ్రహీతలకు సంబంధిత శాఖలో సంప్రదింపులకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆ బ్యాంక్ తెలిపింది.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR
ANANTHAPURAMU - 515 002 (A.P.) INDIA
e-Procurement Tender Notice

1	Repair to Ellora Boys Hostel at JNTUA College of Engineering, Ananthapuramu. With Tender ID No. 753185
2	Renovation and repairs to Shilpa Girls Hostel at JNTUA College of Engineering, Ananthapuramu. With Tender ID No. 754240
3	Laying of new water pipeline for Polytechnic College in Old Campus in JNTUA, Ananthapuramu. With Tender ID No. 753188
4	Painting to footpath side walls (kerb) at JNTUA College of Engineering, Ananthapuramu. With Tender ID No. 754244

Further Details can be seen at e-procurement market place i.e., www. tender.apeprocurement.gov.in.
Sd/-REGISTRAR

ఫారం-A
బహిరంగ ప్రకటన
(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రెజల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 6 క్రింద)
M/s. సుదలగుంట షుగర్స్ లిమిటెడ్ క్రెడిటార్స్ గమనిక కొరకు

	సంబంధిత వివరములు	
1.	కార్పొరేట్ డెటార్ పేరు	M/s. సుదలగుంట షుగర్స్ లిమిటెడ్
2.	కార్పొరేట్ డెటార్ నమోదు తేది	12-09-1994
3.	సదరు కార్పొరేట్ డెటార్ నమోదైన / రిజిస్టర్ అయిన అథారిటీ	రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, విజయవాడ
4.	కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ గుర్తింపు సం. / లిమిటెడ్ లయబిలిటీ ఐడెంటిఫికేషన్ నం.	U15424AP1994PLC018279
5.	కార్పొరేట్ డెటార్ నమోదిత కార్యాలయం మరియు ప్రధాన కార్యాలయం (ఏదైనా ఉన్నచో) చిరునామా :	మయూర నగర్, కాటూరు పోస్ట్, బి.యన్.కండ్రిగ మండలం, ఆంధ్రప్రదేశ్-517644, ఇండియా.
6.	కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభ తేది	20-09-2024 (25-09-2024 తేదీనాటికి ఆర్డర్ కాపీ సిద్ధంగా ఉంది మరియు స్వీకరించబడింది)
7.	ఇన్‌సాల్వెన్సీ రెజల్యూషన్ ప్రాసెస్ ముగింపుకు అంచనా తేది	19-03-2025
8.	ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషనల్‌గా వ్యవహరిస్తున్న ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ పేరు మరియు రిజిస్ట్రేషన్ నెంబరు	సిఎ ఇమ్మానేని చైతన్యకిరణ్, Reg No.: IBBI/IPA-002/IP-NO1257/2023-2024/14280
9.	బోర్డ్‌తో నమోదు చేయబడిన విధంగా ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషనల్ చిరునామా మరియు ఇ-మెయిల్	#40-26-22, మొహిద్దీన్ స్ట్రీట్, చంద్రమౌళిపురం, BSNL టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఎదురు, యమ్‌జి రోడ్డు, విజయవాడ, యన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్-520010, cimmaneni@outlook.com
10.	ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషనల్‌తో సంప్రదింపుల కొరకు ఉపయోగించవలసిన చిరునామా మరియు ఇ-మెయిల్	#40-26-22, మొహిద్దీన్ స్ట్రీట్, చంద్రమౌళిపురం, BSNL టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఎదురు, యమ్‌జి రోడ్డు, విజయవాడ, యన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్-520010, Sudalaguntasugars2024@gmail.com
11.	క్లెయిమ్స్ దాఖలుకు చివరి తేది	11-10-2024
12.	ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషన్ ద్వారా నిర్ధారించబడి, సెక్షన్ 21లోని సబ్-సెక్షన్ (6A) యొక్క క్లాజ్ (b) క్రింద రుణదాతలు, ఏదైనా ఉంటే	ఇప్పటి వరకు ఏ తరగతులు గుర్తించబడలేదు
13.	క్లాస్‌లో క్రెడిటార్స్ యొక్క అధికార ప్రతినిధులుగా వ్యవహరించుటకు గుర్తింపు పొందిన ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ పేర్లు (ప్రతి క్లాస్‌లో ముగ్గురు పేర్లు)	ఇప్పటి వరకు ఏ తరగతులు గుర్తించబడలేదు
14.	(a) రిలవెంట్ ఫార్మ్స్ మరియు (b) అధీకృత ప్రతినిధుల వివరాల లభ్యత :	వెబ్‌లింక్: https://ibbi.gov.in/en/home/downloads ఇప్పటి వరకు ఏ తరగతులు గుర్తించబడలేదు

నేషనల్ కంపెనీలా ట్రిబ్యునల్, అమరావతి బెంచ్, M/s.సుదలగుంట షుగర్స్ లిమిటెడ్ యొక్క కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రెజల్యూషన్ ప్రాసెస్‌ను 20-09-2024న (25-09-2024 తేదీనాటికి ఆర్డర్ కాపీ సిద్ధంగా ఉంది మరియు స్వీకరించబడింది) ప్రారంభించుటకు ఆదేశించినదని ఇందుమూలంగా తెలియజేయడమైనది. ఎంట్రీ నెం.10 పై తెలిపిన చిరునామా వద్ద ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషనల్‌కు 11-10-2024న లేదా ఆలోగా రుజువులతో తమ క్లెయిమ్స్ దాఖలు చేయవలసిందిగా M/s.సుదలగుంట షుగర్స్ లిమిటెడ్ యొక్క క్రెడిటార్ల నుంచి కోరబడుచున్నాను. ఫైనాన్షియల్ క్రెడిటార్లు వారి క్లెయిములను ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే, రుజువులతో దాఖలు చేయవలెను. ఇతర క్రెడిటార్లందరూ స్వయంగా లేదా తపాలా ద్వారా లేదా ఎలక్ట్రానిక్ విధానంలో రుజువులతో క్లెయింలు దాఖలు చేసుకోవచ్చును. క్రమ సంఖ్య 12 లో తెలిపిన వివరాల ప్రకారం వర్గీకరించబడిన ఆర్థిక ఋణ దాతలు ఎవరైనా ఉన్నచో వారు క్రమ సంఖ్య 13 లో తెలిపిన వివరాల ప్రకారం ముగ్గురు దివాలా నిపుణుల నుంచి ఒకరిని ఫారం-CA ద్వారా వారి వర్గానికి అధీకృత ప్రతినిధి గా వ్యవహరించుటకు ఎంపిక చేసుకొనవచ్చును. (వర్తించదు). తప్పుడు సమాచారం లేదా అసంబద్ధ సాక్ష్యములు దాఖలు చేసినచో జరిమానాలు విధించబడును.

తేది : 27-09-2024
ప్రదేశం : విజయవాడ

సిఎ ఇమ్మానేని చైతన్యకిరణ్,
ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషనల్, మొబైల్: 9951789558
Reg No.: IBBI/IPA-002/IP-NO1257/2023-2024/14280
AFA:-AA2/14280/02/300625/203354
AFA issued by ICSI IIP is valid up to 30/06/2025

మహారాష్ట్ర ప్రభుత్వంతో మేఘా ఒప్పందం

- రెండు జల విద్యుత్ కేంద్రాల నిర్మాణం



ప్రజాశక్తి - హైదరాబాద్ : మహారాష్ట్రలో 21 వేల కోట్ల పెట్టుబడితో 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు భారీ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి ఆ రాష్ట్ర ప్రభుత్వంతో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో గురువారం జరిగిన ఒప్పంద కార్యక్రమంలో అక్కడి జల వనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి దీపక్ కపూర్, మేఘా సంస్థ తరపున కంపెనీ ప్రెసిడెంట్ ఆర్‌విఆర్ కిషోర్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ మాట్లాడుతూ నీటి వినియోగం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని అన్నారు. కామోడ్ వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌ను ఐదేళ్ళలో, ఘోస్లా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును మూడున్నరేళ్లలో అందుబాటులోకి తేనున్నామన్నారు.

వయాకామ్ బోర్డులోకి నీతా, ఆకాశ్ అంబానీ

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్, వాల్ట్ డిస్నీకి చెందిన మీడియా వ్యాపారాల విలీనాల నేపథ్యంలో వయాకామ్ 18 బోర్డులోకి కొత్తగా నీతా అంబానీ, ఆకాశ్ అంబానీని తీసుకున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఎంటర్‌టైన్‌మెంట్ విభాగం సంస్థ వయాకామ్ 18, వాల్ట్ డిస్నీ స్టార్ ఇండియా విలీనం ప్రక్రియ తుది దశకు చేరుకుంటున్న తరుణంలో ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

రెండు సంస్థల సమగ్రతను పెంపొందించేందుకు వయాకాం 18 డైరెక్టర్ల బోర్డును పునర్వ్యవస్థీకరిస్తున్నారు. విలీన కంపెనీలో రిలయన్స్ ఇండస్ట్రీస్, అనుబంధ సంస్థలకు 63.16 శాతం వాటా ఉంటుంది. మిగతా 36.84 శాతం వాటా వాల్ట్ డిస్నీకి ఉంటుంది. సంయుక్త సంస్థ బాధ్యతలను నీతా అంబానీ చూసుకోనున్నారు.

పెరుగుతున్న క్రెడిట్ కార్డు డిఫాల్టర్లు

- రూ.2.6 లక్షల కోట్లకు బకాయిలు
- తిరిగి చెల్లించడంలో యువత విఫలం

న్యూఢిల్లీ : ఇటీవల క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగిపోయింది. ఇదే క్రమంలో బకాయిలు చెల్లించలేక క్రమంగా డిఫాల్టర్లు పెరిగిపోతున్నారు. ఇది రుణగ్రహీతల బలహీన ఆర్థిక పరిస్థితులకు అద్దం పడుతోంది. ట్రాన్స్‌యూనియన్ సిబిల్ డాటా ప్రకారం.. 2023 మార్చి ముగింపు నాటికి 1.6 శాతంగా ఉన్న డిఫాల్టర్లు.. 2024 జూన్ నాటికి 1.8 శాతానికి పెరిగారు.

మరోవైపు బకాయిల విలువ భారీగా పెరిగిపోతోంది. 2024 మార్చి ముగింపు నాటికి క్రెడిట్ కార్డు బకాయిలు ఏకంగా రూ.2.6 లక్షల కోట్లకు ఎగిశాయి. ఇంతక్రితం ఏడాది మార్చి నాటికి ఈ విలువ రూ.2 లక్షల కోట్లుగా నమోదయ్యింది. కరోనాకు ముందు 2019 మార్చి నాటికి బకాయిలు రూ.87,686 కోట్లుగా ఉన్నాయి. గడిచిన ఐదేళ్లలో ప్రతీ ఏడాది సగటున 24 శాతం చొప్పున పెరుగుతూ రావడం ఆందోళనకర అంశం.

"యువ మిలీనియల్స్ క్రెడిట్ కార్డు మొత్తం పరిమితిని ఉపయోగిస్తున్నారు. అనంతరం నేరుగా డిఫాల్ట్ చేస్తున్నారు. రుణాన్ని కూడా తిప్పికొట్టకుండా డిఫాల్టర్లుగా మారుతున్నారు." మాక్వారీ పరిశోధన విశ్లేషకుడు సురేష్ గణపతి పేర్కొన్నారు. క్రెడిట్ కార్డులలో నికర నష్టాలు 5-6 శాతానికి దగ్గరగా ఉన్నాయన్నారు. గడిచిన త్రైమాసికంలో ఎస్‌బిఐ కార్డు 7.5 శాతం నికర క్రెడిట్ లాస్ (ఎన్‌సిఎల్)ను చవి చూసిందన్నారు.

"రుణగ్రహీత వాయిదాలలో తిరిగి చెల్లిస్తారనే ఆలోచనతో తొలుత పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేయడంతో డిఫాల్ట్ ప్రారంభమవుతుంది. కానీ ఈ బాకీపై కొన్ని సార్లు సంవత్సరానికి 48 శాతం వరకు వడ్డీనీ చెల్లించాల్సి వస్తుంది. కనీస మొత్తాన్ని చెల్లించే వరకు రుణగ్రహీత పరిస్థితి దిగజారుతుంది. ఆ తర్వాత డిఫాల్ట్ అవుతున్నారు." అని డెట్ రిలీఫ్ వేదిక ఫ్రీడ్ సిఇఒ రితేష్ శ్రీవాస్తవా పేర్కొన్నారు.

కొత్తగా 9.2 లక్షల కార్డుల జారీ..

ఈ ఏడాది ఆగస్టులో కొత్తగా 9.2 లక్షలకు పైగా క్రెడిట్ కార్డులు జారీ అయ్యాయని ఆర్‌బిఐ వెల్లడించింది. ఇంతక్రితం జులైలో 7.55 లక్షల కార్డులను అందించాయి. మొత్తం క్రెడిట్ కార్డుల సంఖ్య 10.55 కోట్లకు చేరాయి. ఈ కార్డుల జారీలో ప్రతీ ఏడాది సగటున 15.6 శాతం పెరుగుదల నమోదవుతోంది. గడిచిన ఆగస్టు నెలలో హెచ్‌డిఎఫ్‌సి అత్యధికంగా 2.41 లక్షల కార్డులను జారీ చేసింది. ఐసిఐసిఐ బ్యాంక్ 1.45 లక్షలు, యాక్సిస్ బ్యాంక్ 1.27 లక్షలు, ఎస్‌బిఐ కార్డ్స్ 1.1 లక్షల చొప్పున కొత్త క్రెడిట్ కార్డులను జారీ చేశాయి.

సంపాదకీయం

సంయమనం అవసరం

తిరుపతి లడ్డూ - కల్తీ నెయ్యి అంశంపై వారం రోజులుగా చర్చ సాగుతోంది. నిజానిజాలను నిర్ధారించి, కారకులపై చర్యలు తీసుకోవడంపై చూపాల్సిన శ్రద్ధను- అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకదానిపై ఒకటి తీవ్రమైన నిందారోపణలు చేసుకోవటంపైనే ఎక్కువగా వెచ్చిస్తున్నాయి. భక్తుల మనోభావాలు, క్షేత్ర పవిత్రత అంటూ పైకి చెబుతూనే మత వైషమ్యాలను రెచ్చగొట్టే సంఘ్ పరివార్ శక్తులకు ఊతమిస్తున్నాయి. దేశంలోనే అత్యధిక మంది సందర్శించే తిరుపతి - తిరుమల క్షేత్రంలో ఇచ్చే లడ్డూ ప్రసాదం అనేకమంది భక్తుల మనోభావాలు, నమ్మకాలతో ముడిపడినది. అందులో వాడాల్సిన అన్ని రకాల దినుసులూ నాణ్యంగా ఉండాలి. తిరుమల క్షేత్రంలోనే కాదు; ఎక్కడైనా సరే ప్రసాదంగానో, ఆహారంగానో ఇచ్చే ఏ పదార్థమైనా కల్తీ కాకుండా ఉండాలి. నాణ్యతను ఎప్పటికప్పుడు నిర్ధారించాల్సిన యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలి. ఏ దినుసులో నాణ్యత లోపించినా, కల్తీ కనిపించినా నిబంధనల ప్రకారం వ్యవహరించాలి. ఆయా దినుసులను వాడకంలోకి వెళ్లకుండా నిలిపివేసి, సరఫరా సంస్థలపైనా, నిర్లక్ష్యం వహించిన వ్యక్తుల పైనా తగు చర్యలు తీసుకోవాలి. భక్తుల మనోభావాలను గౌరవించాలన్నా; పౌరుల ఆహార నాణ్యతకు, ఆరోగ్య భద్రతకు రక్షణ కల్పించాలన్నా - ఇదీ, పాటించాల్సిన పద్ధతి!

అధికారులు చెబుతున్న సమాచారం ప్రకారం... తిరుమల క్షేత్రంలో ఇలాంటి తనిఖీ, నియంత్రణ వ్యవస్థలు చాలా ఏళ్లుగా అమలులో ఉన్నాయి. సరఫరా సంస్థలు పంపే దినుసులు నిర్దేశిత ప్రమాణాలకు తగ్గట్టుగా ఉన్నాయా? లేదా? అని తనిఖీ చేసి, సరిగ్గా ఉన్నవాటిని స్వీకరించటం, లేనివాటిని వెనక్కు పంపటం చేస్తున్నాయి. గతంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు, అవి నియమించిన పాలకవర్గాలూ అధికారంలో ఉన్నప్పుడు ఇలా నాణ్యత లేని నెయ్యిని తిప్పి పంపిన ఉదంతాలు ఉన్నాయని చెబుతున్నారు. తనిఖీ వ్యవస్థ ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు నిర్లక్ష్యమూ లేదా ఉద్దేశపూర్వక విస్మరణ ఎక్కడ, ఏ దశలో జరిగినా గుర్తించటం చాలా సులభం. కారకులను గుర్తించి చర్యలు తీసుకోవడం కూడా సులభం. ఈ పనులన్నీ చేయటానికి అధికారిక వ్యవస్థలూ, దొంతరలూ తిరుమలలో నడుస్తూనే ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం వీటి ఆధ్వర్యాన సమస్యను సరిచేయాలి తప్ప వివాదాస్పదం చేయడం తగదు. మనోభావాలను గాయపరిచే, మత వైషమ్యాలను రెచ్చగొట్టే పరిభాషను ఎంచుకోవటం మరీ ప్రమాదకరం. కల్తీని కనుక్కోవటానికి, కారకులను శిక్షించటానికి రాజ్యాంగబద్ధమైన పద్ధతులను అవలంబించాల్సిన ఉప ముఖ్యమంత్రి ఏకంగా మత వైషమ్యాలను రెచ్చగొట్టే మాటలతో లడ్డూ అంశాన్ని మరింత వివాదాస్పదం చేశారు. కొన్ని మతాలను, ఆ మతస్తుల ప్రార్థనా స్థలాలను ప్రస్తావించారు. ఇలా వైషమ్యాలను సృష్టించటం అభ్యంతరకరం. చాలా సాధారణంగా, సరళంగా పరిష్కరించాల్సిన అంశానికి మతపరమైన ఉద్రేకాలను, ఉద్రిక్తలను అంటుగట్టి, రాష్ట్రంలో మతోన్మాద శక్తుల వీరంగానికి అవకాశం ఇవ్వడం చాలా పెద్ద పొరపాటు. అధికార టిడిపి- జనసేన, ప్రతిపక్ష వైసిపి ఈ విధమైన పొరపాట్లతో సామరస్యానికి చేటు తెస్తున్నాయి. ఒక పార్టీ ప్రాయశ్చిత్తమంటే- మరొక పార్టీ దేవాలయాల్లో పూజలు చేస్తామంటూ ప్రకటించింది. రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రజలను పట్టి పీడిస్తున్న జీవనోపాధికి సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలి తప్ప వ్యక్తిగత మత విశ్వాసాలపై కాదు. మతాన్ని స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవటంపై అసలే కాదు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, వరద బాధితులకు కేంద్ర సహాయంలో నిర్లక్ష్యం తదితర అనేక ప్రజా సమస్యలు పక్కకుపోతున్నాయి. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో మతోన్మాదాన్ని ఎగదోసి, రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి - ఆర్ఎస్ఎస్ పొంచి చూస్తున్నాయి. అంతర్వేది, రామతీర్థం తదితర అంశాలను ఎంచుకొని ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశాయి. ఇలాంటి కుయుక్తులపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన తరుణంలో తిరుపతి లడ్డూ అంశాన్ని రాజకీయం చేయడం రాష్ట్ర ప్రయోజనాలకు, సామరస్యానికీ ప్రమాదకరం. సిట్ నివేదిక వచ్చేవరకూ రాజకీయ పార్టీలు లడ్డూ అంశంపై ఎలాంటి ఉద్రేక ప్రకటనలూ చేయకుండా సంయమనం వహించాలి.

మహనీయుల మాట

ఏ మతంలోనైనా సరే
మాయలు, మంత్రాలు
వంటి అద్భుతాలన్నీ కల్పనలే.
- రాజా రామ్మోహన్ రాయ్,
సంఘసంస్కర్త.
జననం : 22.5.1772
మరణం : 27.9.1833

విశ్లేషణ

ఖనిజ సంపద ప్రజలదే!

> కె.జి బేసిన్‌లో లభ్యమయ్యే గ్యాస్, ఆయిల్‌తో సహా, పన్ను విధించే రాజ్యాంగ పరమైన హక్కు మనకున్నదని చెప్పాలి. అందుకు జులై 25 సుప్రీంకోర్టు తీర్పును ఉదహరించాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఇతర ఖనిజాలతో పాటు గ్యాస్, చమురును చేర్చాలని సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రాలలో లభించే ఖనిజ వనరులపై రాష్ట్ర ప్రభుత్వం పన్ను విధించాలి. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పార్టీలకు అతీతంగా అందరూ సమైక్యంగా ముందుకు కదలాల్సిన తరుణం ఆసన్నమైంది.

కొన్ని రాష్ట్రాలలో అపారమైన ఖనిజ సంపద వుంది. అయినప్పటికీ ఆ ప్రాంతంలోని సామాన్య ప్రజలు కడు పేదరికంలో జీవిస్తున్నారు. ఖనిజ సంపద నుంచి వచ్చే ఆదాయం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు, దేశ విదేశాల్లో వున్న పెద్ద కంపెనీలకు చేరుతున్నది. ఒరిస్సాలో ఇనుప ఖనిజాలు ఉన్నాయి. చత్తీస్‌గఢ్‌లో బాక్సైట్ నిక్షేపాలు ఉన్నాయి. కేరళలో థోరియం లభిస్తుంది. ఈ ఖనిజాలను ముడి పదార్థాలుగా జపాన్, చైనా లాంటి దేశాలు ఉపయోగించి తమ సంపదను పెంచుకుంటున్నాయి. ఆంధ్ర లోని గ్యాస్, చమురు నిక్షేపాలు రిలయన్స్ లాంటి కంపెనీలకు లాభాలను ఇస్తున్నాయి. ఈ ఖనిజ సంపద ఉన్నందు వలన స్థానిక ప్రజలకు ఉపయోగం ఏమీ లేకపోగా ఈ ఖనిజాలను వెలికి తీసినందువలన అనేక దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ వత్తాసు వున్న బడా కంపెనీలు, దళారీలు ప్రజల కళ్ళలో దుమ్ము కొట్టి లాభాలు గుంజుకుంటున్నారు. ప్రజలకు కనీస వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. చదువు ఖరీదైంది. నిరుద్యోగం ఎక్కువవటం వలన యువత దారి తప్పుతున్నారు. పైగా ఖనిజ సంపదను కాపాడుతున్న ఆదివాసీలపై దాడుల ఉధృతి మరింత పెరుగుతోంది. పేదరికంలో ఉన్న ఆ రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రంలో ఉన్న ఖనిజ సంపదపై పన్ను విధించడానికి హక్కు లేదన్నారు. అందుకనువైన చట్టాలను చేసుకుంటున్నారు. రాజ్యాంగం లోని ఫెడరల్ స్ఫూర్తిని పక్కన పెట్టారు. రాష్ట్రాలపై పెత్తనం చేస్తూ ఆర్థిక వనరులన్నీ కేంద్ర ప్రభుత్వం చేతిలోకి తీసుకొని బడా కంపెనీలకు ఊడిగం చేస్తూ ప్రజలను పేదరికంలోనే వుంచుతున్నారు. అదేమన్న వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారు. పాలక వర్గాలకు అనుకూలమైన చట్టాలను చేసుకుంటున్నారు.



డా॥ కొల్లా రాజమోహన్

పాలక వర్గ అనుకూల చట్టాలు

1) రాజ్యాంగంలోని 246 ఆర్టికల్‌ను ఉపయోగించి 1957లో మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ (ఎం.ఎం.డి.ఆర్) చట్టాన్ని చేశారు. ఈ చట్టం కింద సెక్షన్9 ద్వారా సంక్రమించిన అధికారాలను అడ్డు పెట్టుకుని, రాయల్టీని కేంద్ర ప్రభుత్వానికే చెల్లించాలన్నారు. ఫలితంగా ఖనిజ సంపద వున్న ప్రజలను, ప్రాంతాలను నిత్య పేదరికంలో వుంచారు. పాలక వర్గం, దళారీలు, దేశ విదేశీ కంపెనీలు లాభపడ్డాయి.

2) లైమ్‌స్టోన్ ఖనిజాన్ని వెలికి తీస్తున్న ఇండియా సిమెంట్స్‌పై తమిళనాడు ప్రభుత్వం... రాజ్యాంగం 7వ షెడ్యూల్ లోని రాష్ట్ర జాబితాలోని 49, 50 ఎంట్రీల ప్రకారం భూమి పన్ను విధించింది. 1957లో చేసిన ఎం.ఎం.డి.ఆర్ చట్టాన్ని అడ్డం పెట్టుకుని రాయల్టీపై సెస్, పన్ను విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని ఏడుగురు సభ్యులున్న సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. రాయల్టీ అంటే పన్ను అన్నారు (ఇండియా సిమెంట్స్ వర్సెస్ తమిళనాడు గవర్నమెంట్ కేసు).

3) మరొక ప్రఖ్యాత కేసులో రాజ్యాంగ బెంచ్ పన్ను విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు వుందన్నారు. రాయల్టీ అంటే పన్ను కాదన్నారు. అంతకు ముందు వున్న తీర్పులన్నిటికీ భిన్నమైన తీర్పు ఇచ్చారు. కేశోరామ్ ఇండస్ట్రీస్ వర్సెస్ వెస్ట్ బెంగాల్ రాష్ట్రం మధ్య నడిచిన కేసులో, రాజ్యాంగ బెంచ్ అందుకు విరుద్ధమైన తీర్పు ఇచ్చింది.

చారిత్రాత్మక తీర్పు

జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం 2024 సంవత్సరం జులై 25న ఒక చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్రాల అధికారాన్ని, ఫెడరలిజం స్ఫూర్తిని నిలబెట్టేదిగా ఉన్నది. ఖనిజాలను వెలికి తీసే భూమిపై పన్నులు, సెస్ వంటి లెవీలు విధించే అధికారం రాష్ట్రాలకే ఉందని, కేంద్రానికి ఆ హక్కు లేదని 8-1 మెజార్టీతో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో 1999 నుండి ఉన్న సివిల్ అప్పీల్ నెంబర్లు 4056...4064 నుండి ఇప్పటి వరకు వున్న అతి పురాతనమైన కేసులన్నీ పరిష్కరింపబడ్డాయి.

తీర్పులో ముఖ్యమైన అంశాలు

ఖనిజ హక్కులపై పన్ను విధించే శాసనాధికారం రాష్ట్ర శాసనసభలకు ఉంటుంది. కేంద్ర జాబితాలోని ఎంట్రీ 54 కింద ఖనిజ హక్కులపై పన్ను విధించే శాసనపరమైన సామర్థ్యం పార్లమెంటుకు లేదు. ఇది జనరల్ ఎంట్రీ. మినరల్ హక్కులపై పన్ను విధించే అధికారం రాష్ట్ర జాబితా2 లోని ఎంట్రీ 50లో పేర్కొనబడినందున, ఆ విషయానికి సంబంధించి పార్లమెంటు తన విశేష అధికారాలను ఉపయోగించజాలదు.

గనులు, క్వారీలతో కూడిన భూములపై పన్ను విధించేందుకు రాష్ట్ర జాబితా2 లోని ఎంట్రీ 49తో పాటు ఆర్టికల్ 246 ప్రకారం రాష్ట్ర శాసనసభలు శాసన సామర్థ్యాలను కలిగి ఉంటాయి. లిస్ట్ 2 లోని ఎంట్రీ 50కి సంబంధించి ఖనిజాభివద్ధికి సంబంధించిన చట్టంలో పార్లమెంటు విధించిన 'పరిమితులు' లిస్ట్ లోని ఎంట్రీ 49పై పని చేయవు. ఎందుకంటే రాజ్యాంగం ప్రకారం ఆ ప్రభావానికి ఎటువంటి నిర్దిష్ట నిబంధన లేదు.

అయితే కోర్టు విచారణలో ఆయిల్ ఫీల్డ్స్, మినరల్ ఆయిల్ రిసోర్సెస్, పెట్రోల్, పెట్రోలియం ఉత్పత్తుల గురించి లేకపోవడం విచారకరం. 438 మంది పిటిషన్‌దారులు గాని, ప్రభుత్వంగానీ పెట్రోలియం ఉత్పత్తుల గురించి అడగనందువలన సుప్రీంకోర్టు విచారణలో లేవని అత్యున్నత ధర్మాసనం తెలియజేసింది. ఇనుప ఖనిజం, బొగ్గు, మైకా, గ్రానైట్, బాక్సైట్, యురేనియం, లాంటివే కాకుండా భూమిలో లభించే శిలాజ ఇంధనాలను (చమురు, సహజ వాయువులను) అన్ని దేశాలలో ఖనిజ సంపదగా పరిగణిస్తారు. ఏ డిక్షనరీ చూసినా, పదవ తరగతి విద్యార్థిని అడిగినా ఖనిజ సంపద అంటే ఏమిటో చెప్తారు.

పెట్రోలియం ఉత్పత్తులు, గనులు లాంటి నిక్షేపాలు వున్న రాష్ట్రాలు ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలుగా తక్కువ ఆదాయంతో ఉన్నాయి. సహజ వనరులు బాగా ఎక్కువగా ఉన్నటువంటి రాష్ట్రాలు చాలా పేద రాష్ట్రాలుగా ఉన్నాయి. ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు అపారంగా ఉన్న రష్యా, అమెరికా, ఇరాన్, సౌదీ దేశాలు సంపద్వంతంగా వున్నాయి. మనకు గ్యాస్, ఆయిల్ దండిగా వున్నా మన రాష్ట్ర సంపద పెరగలేదు. అంబానీ సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నది. రాష్ట్రంలో లభించే ఖనిజ సంపదలన్నిటిపైనా ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గమైన అంబానీ లాంటి వారి ఆధిపత్యం కొనసాగుతున్నది.

స్వర్ణ సింహాసనాలు - రైతుల ఆత్మహత్యలు

సహజ వనరులు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికి ఉత్పత్తిలో 50 శాతం కేటాయించాలని 12వ ఫైనాన్స్ కమిషన్ కూడా చెప్పింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల వాదనలను పెడచెవిన పెట్టింది. 50 శాతం వాటా ఇవ్వలేదు. పన్ను విధించే హక్కు లేదన్నారు. కష్టాలు మనకు సంపద కార్పోరేట్ కంపెనీలకు వెళుతుంది.

భూమి లోపల కొన్ని లక్షల సంవత్సరాల పరిణామాల ఫలితంగా ఖనిజాలు, సహజ వాయువు, చమురు ఏర్పడుతుంది. అటువంటి విలువైన ఖనిజ సంపదను కొద్దిమంది ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గానికి కట్టబెడుతున్నారు. ప్రపంచ ధనవంతుల జాబితాలో ప్రథమ స్థానం కోసం పోటీ పడుతున్నారు. రూ.వేల కోట్లు ఖర్చు పెట్టి పెళ్ళిళ్ళు చేస్తున్నారు. మరోవైపు తాళిబొట్టు తాకట్టు పెట్టి వ్యవసాయం చేస్తున్న రైతుల ఆత్మహత్యల నివారణకు సహజ వనరులను ఉపయోగించాలనే కనీస బాధ్యత పాలకులకు లేనందున ప్రజలు కష్టాలతోనే జీవిస్తున్నారు.

ఖనిజాలు భూమి నుండి వెలికి తీసిన ఫలితంగా భూమిలో, పర్యావరణంలో ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయి. భూగర్భ జలాలు, చెరువులు, బావులు, గాలి కలుషితమై, వాతావరణ దుష్పరిణామాల వలన కిడ్నీ, శ్వాసకోశ వ్యాధులు, గుండెజబ్బులు, క్యాన్సర్ బారిన పడ్డ ప్రజలు కనీస వైద్య సదుపాయాలు లేక నరకం చూస్తున్నారు. అపారమైన సహజ సంపదను బడా కార్పోరేట్ కంపెనీలకు అప్పచెప్పి ఆదివాసీలను గాలికి వదిలేశారు. సహజ సంపదను కాపాడుతున్న ఆదివాసీలకు కనీస జీవన సౌకర్యాలను కలగచేయటంలో విఫలమయ్యారు.

కె.జి బేసిన్‌లో లభ్యమయ్యే గ్యాస్, ఆయిల్‌తో సహా, పన్ను విధించే రాజ్యాంగ పరమైన హక్కు మనకున్నదని చెప్పాలి. అందుకు జులై 25 సుప్రీంకోర్టు తీర్పును ఉదహరించాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఇతర ఖనిజాలతో పాటు గ్యాస్, చమురును చేర్చాలని సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రాలలో లభించే ఖనిజ వనరులపై రాష్ట్ర ప్రభుత్వం పన్ను విధించాలి. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పార్టీలకు అతీతంగా అందరూ సమైక్యంగా ముందుకు కదలాల్సిన తరుణం ఆసన్నమైంది.

/వ్యాసకర్త కె.జి. బేసిన్ గ్యాస్, ఆయిల్ సాధన సమితి కన్వీనర్,
సెల్ : 9000657799 /

కవిత్వం

ప్రపంచ శాంతికి కపోతమై ఎగరాలి

వెలుతురు కిరీటం నెత్తిన మోస్తూ
చీకటిని నిందిస్తూ కూర్చుంటే
మనసులో తాపత్రయం తగ్గుతుందా
ఆత్మగౌరవంతో ఆనందం కలుగుతుందా..

హృదయం నిబ్బరంగా ఉంచుకోకుండా
జాతి మత గీతలను అండగా గీసుకుంటూ
అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తే
గుండెకు గుండె శబ్దం వినపడుతుందా..

గమ్యాన్ని వెతుక్కుంటూ గమనం సాగాలి
విప్లవ వీరత్వాన్ని ప్రదర్శిస్తూ
మానవత్వపు ప్రేమను పంచుతూ
ప్రపంచ శాంతికి కపోతమై ఎగరాలి...

జాతి పౌరుషాన్ని పరావర్తనం చేస్తూ
శూన్యపు జీవితాల్లో వెలుగులు నింపుతూ
నిర్భాగ్యులకు భాగ్యాన్ని ప్రసాదిస్తూ
అలుపెరగని శ్రమజీవిలా సాగించాలి..

కొత్త స్వర్ణ లోకం కోసం తపిస్తూ
యుద్ధాలు లేని స్థలాన్ని స్థాపిస్తూ
దు:ఖపు కన్నీళ్లను తుడిచేందుకు
సహనంతో శాంతి పర్వం నెలకొల్పాలి..

స్వేచ్ఛ కోసమే మనిషి ఆరాటం
పసిపిల్లల పాలమీగడ మనసు కలిగి
స్థిరత్వంతో కొండలా పెరుగుతూనే
నిజాయితీకి నిదర్శనంగా నిలవాలి...

సంకల్ప దీక్షలకు చిరునామాగా ఉంటూ
స్వేచ్ఛా వాయువుల్లో వినోదిస్తూ
సమానత్వపు సౌభ్రాతృత్వాన్ని బోధిస్తూ
ప్రపంచాన్ని ఆనంద నందనవనం
చెయ్యాలి.

- కొప్పుల ప్రసాద్,
నంద్యాల, సెల్ : 9885066235

వ్యాఖ్య

లెబనాన్ ఆక్రమణ బాటలో ఇజ్రాయిల్

లెబనాన్‌పై వైమానిక, క్షిపణి దాడులు జరుపుతున్న ఇజ్రాయిల్ వాటిని మరింత తీవ్రం గావించేందుకు భూతల దాడులకు సిద్ధమౌతున్నట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. మధ్య ప్రాచ్యంలో పరిమిత యుద్ధం కోసం తహతహలాడుతున్న ఈ ఉన్మాది చర్యలను యావత్ ప్రపంచమూ ఖండించాలి. దాని ప్రతికూల ప్రభావం ఆ ప్రాంతానికి మాత్రమే పరిమితం కాదు. ఇటీవల అది జరిపిన పేజర్లు, వాకీటాకీల పేల్చివేత దాడులతో లెబనాన్‌లో ప్రబల శక్తిగా ఉన్న హిజ్బుల్లా సాయుధ సంస్థకు తీవ్ర ఎదురు దెబ్బలతో పాటు కొంత మంది ప్రముఖ నేతలను కూడా అది కోల్పోయింది. దానికి ప్రతీకారంగా శక్తివంతమైన ఖాదర్-1 క్షిపణితో తొలిసారిగా ఇజ్రాయిల్ రాజధాని టెల్‌అవీవ్ నగరం మీద దాడి చేసింది. అది ఖండాంతర క్షిపణి కాకున్నా ఆ లక్షణాలు కలిగిన శక్తివంతమైన ఆయుధంగా చెబుతున్నారు. ప్రమాద ఘంటికలను మోగించటంతో పది లక్షల మంది నగర పౌరులు రక్షణ కోసం కలుగుల్లోకి పరుగులు తీశారని వార్తలు, దాన్ని తిప్పికొట్టామని నెతన్యాహు యంత్రాంగం చెబుతున్నప్పటికీ ఉత్తర ఇజ్రాయిల్ ప్రాంతంలో ఇరవై లక్షల మంది పౌరులు ప్రాణాలు అరచేత పట్టుకొని ఎప్పుడేం జరుగుతుందో అన్న భయంతో ఉన్నారని, స్కూళ్లను మూసివేశారని వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకు హిజ్బుల్లా గరిష్టంగా ఇరవై కిలోమీటర్ల వరకు ప్రయాణించే క్షిపణులతోనే దాడులు జరిపింది. మూడు వందల కిలోమీటర్లు, అంతకు మించి దూరం, భారీ మొత్తాలలో పేలుడు పదార్థాలను మోసుకుపోగల క్షిపణులు దానికి ఇరాన్ సరఫరా చేసిందన్న వార్తలు, వాటిని ప్రయోగిస్తే ఏం జరుగుతుందనేది చర్చగా ఉంది. ఒకవేళ అదే జరిగితే దానికి ఇజ్రాయిల్, గాజా, వెస్ట్‌బాంక్ ప్రాంతాలలో అది జరుపుతున్న మారణకాండకు నిస్సిగ్గుగా మద్దతు ఇస్తున్న దేశాలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇరాన్‌ను రెచ్చగొట్టేందుకు ఇజ్రాయిల్ చేస్తున్న ప్రముఖుల హత్యలు, దాడులు తెలిసిందే. మధ్యధరా, ఎర్ర సముద్రాల్లో అమెరికా, బ్రిటన్ యుద్ధ నౌకలు దానికి కాపుగా సిద్ధంగా ఉన్నాయి. ఎంతగా రెచ్చగొట్టినా పశ్చిమ దేశాలలో వలలో పడకుండా ఇరాన్ నాయకత్వం సంయమనం పాటిస్తోంది. సహనానికి కూడా ఒక హద్దు ఉంటుంది. ఎంతకాలం అలా ఉండగలదనేది ప్రశ్న. అదేమీ మరొక దేశాన్ని ఆక్రమించుకొనేందుకు చూడటం లేదు. ఇజ్రాయిల్ దురాక్రమణలో ఉన్న పాలస్తీనా విముక్తి పొందాలని, అక్కడి పౌరులపై జరుపుతున్న మారణకాండను ఆపాలని మాత్రమే కోరుతోంది. దాని విముక్తి కోసం అన్ని విధాలుగా సాయపడుతోంది.

గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులకు నిరసనగా ఎమెన్ లోని హైతీ సాయుధులు జరుపున్న దాడుల కారణంగా మధ్య ధరా-ఎర్ర సముద్రాలను కలుపుతూ తవ్విన సూయజ్ కాలువ ద్వారా అరేబియా సముద్రంలోకి ప్రవేశించే నౌకల రవాణాకు ఆటంకం కొనసాగుతోంది. నౌకలు ఆఫ్రికాను చుట్టి రావటం ఎంతో ఖర్చుతో కూడుకోవటమే గాక అధిక సమయం కూడా పడుతోంది. దీని వలన పడే భారాలను జనాలు మోయాల్సి వస్తోంది. గాజాలో జరుపుతున్న మారణకాండను ఇంతవరకు పశ్చిమ దేశాలు నివారించలేకపోయాయి. మరోవైపు లెబనాన్‌లోకి చొచ్చుకుపోయేందుకు ఇజ్రాయిల్ పూనుకుంది. అక్కడ ఉన్న హిజ్బుల్లా స్థావరాలన్నింటినీ ధ్వంసం చేస్తానంటోది. ఈ తరుణంలో హిజ్బుల్లాతో 21 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ అంటూ అమెరికా, ఫ్రాన్స్ ఒక ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి. పాలస్తీనాపై శాశ్వత కాల్పుల విరమణ సంగతి తేల్చని ఈ దేశాలు ఇప్పుడు ఎందుకు ఈ విధంగా మాట్లాడుతున్నట్లు? లెబనాన్ ఆక్రమణకు సర్వసన్నద్ధాలు చేసుకొనేందుకు, అవసరమైన ఆయుధాలను సమకూర్చుకొనేందుకు దానికి అవకాశం కల్పించే దుష్ట ఆలోచన కూడా లేదని ఎలా చెప్పగలం.

ఇప్పటికే ఇజ్రాయిల్ అన్ని రకాల నిబంధనలు, సాంప్రదాయాలను తోసిరాజని తెగబడుతోంది. అంతర్జాతీయ కోర్టు తీర్పులను ఖాతరు చేయటం లేదు. దాని మీద ఆంక్షలు విధించేందుకు భద్రతా మండలిలో వచ్చిన తీర్మానాలన్నింటినీ అమెరికా వీటోతో అడ్డుకొని కాపు కాస్తోంది. మరి కొద్ది రోజుల్లో గాజా మారణకాండకు ఏడాది నిండనుంది. కొద్ది రోజుల్లోనే హమాస్ సాయుధులను మట్టుపెడతామని చెప్పిన ఇజ్రాయిల్‌కు అది సాధ్యం కాలేదు. అలాంటిది హమాస్ కంటే ఎన్నో రెట్లు బలం కలిగిన హిజ్బుల్లాను లొంగదీసుకోవటానికి పూనుకోవటం దుస్సాహసానికి పాల్పడటమే అని అనేక మంది విశ్లేషకులు హెచ్చరిస్తున్నప్పటికీ ముందుకు పోతున్నారు. తన రక్షణ కోసం అవసరమంటూ గతంలో దక్షిణ లెబనాన్‌ను ఆక్రమించుకొని విధిలేక వెనక్కు వచ్చిన ఇజ్రాయిల్ పాఠాలు నేర్చుకున్నట్లు లేదు. యూదు దురహంకారులు మధ్య ప్రాచ్యాన్ని మంటల్లోకి నెడుతున్నారు. వారికి అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు వంత పాడటం గర్హనీయం.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

అభిప్రాయం

తమిళనాడు గవర్నర్ జాతి వ్యతిరేక ప్రసంగం

> బిజెపి ప్రభావం లేని రాష్ట్రాల్లో వీలైనంత వరకు సంఘ్ పరివార్ ఆలోచనలను వ్యాప్తి చేయడానికి గవర్నర్లను సాధనాలుగా ఉపయోగించుకుంటోంది. ఇందులో భాగంగానే కేరళలోని యూనివర్సిటీలను కబ్జా చేసేందుకు గవర్నర్‌ను వినియోగించుకుంటున్నారు. ఇప్పుడు తమిళనాడు గవర్నర్ ఏకంగా రాజ్యాంగాన్నే తిరస్కరించారు. అయితే రాజ్యాంగం చెల్లదని రేపు స్వయంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మోడీ పరిపాలన ఆ దిశగానే సాగుతోంది. దీనికి వ్యతిరేకంగా భారత ప్రజలు ఏకతాటిపై నిలవకపోతే మన దేశం పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ తరహాలో మతతత్వ రాజ్యంగా మారిపోతుంది.



రాష్ట్ర గవర్నర్లు రాజ్యాంగాన్ని తిరస్కరించే స్థితికి దేశం చేరుకోవడం అత్యంత తీవ్రమైన విషయం. భారతదేశ లౌకికవాదం యూరోపియన్ భావన అంటూ తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి ఒక బహిరంగ కార్యక్రమంలో చేసిన ప్రసంగం సంఘ్ పరివార్ పాలన దేశాన్ని ఎటువైపు నడిపిస్తున్నదో స్పష్టం చేస్తోంది. రాజ్యాంగానికి కట్టుబడి ఉంటానని ప్రమాణం చేసిన గవర్నర్ రాజ్యాంగాన్ని త్యజించిన తర్వాత ఒక్క క్షణం కూడా ఆ పదవిలో కొనసాగడం తగదు. కన్యాకుమారిలో హిందూ ధర్మ విద్యాపీఠ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జాతి వ్యతిరేక ప్రసంగం చేశారు. రాజ్యాంగ పీఠికలో స్పష్టంగా నిర్వచించిన లౌకికతత్వాన్ని గవర్నర్ బహిరంగంగా ఖండించారు.

"భారతదేశ ప్రజలమైన మేము, ఈ దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, భారత పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలలో స్వాతంత్ర్యాన్ని, అంతస్తుల్లోను, అవకాశాల్లోనూ సమానత్వాన్ని చేకూర్చుటకు, వారందరిలో వ్యక్తి గౌరవాన్ని, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించు కోవడానికి మన రాజ్యాంగ పరిషత్తులో చర్చించి తీర్మానించి, చట్ట రూపంలో మాకు మేము సమర్పించుకుంటున్నాము". ఇది రాజ్యాంగ పీఠికలో స్పష్టంగా పేర్కొనబడింది. ఇది దేశ ప్రజలందరి సమగ్రత, సోదరభావాన్ని పెంపొందించడానికి నిర్ణయించినది. ఆర్.ఎన్.రవి, ఆయన నియమించిన సంఘ్ పరివార్ కనీసం ఈ ఉపోద్ఘాతం చదవాలి. సెక్యులరిజం అనేది ప్రజాస్వామ్యం యొక్క అత్యంత అందమైన భావన. వివిధ మతాలు, కుల సమూహాలు, వివిధ భాషలు మాట్లాడే, విభిన్న ఆచారాలు కలిగిన భారత దేశాన్ని ఇతర దేశాల నుండి వేరుగా ఉంచేది మన లౌకిక సంస్కృతే. 75 ఏళ్లుగా మనం కాపాడుకున్న లౌకికవాదం భారతీయ సంస్కృతి కాదన్న స్పందన గవర్నర్ వ్యక్తిగత అభిప్రాయమని చెప్పలేం. సంఘ్ పరివార్ ఒక పథకం ప్రకారం ముందుకు తెస్తున్న ప్రాజెక్ట్ ఇది. కొన్ని వర్గాలను మభ్యపెట్టడానికే లౌకికవాదాన్ని రాజ్యాంగంలో భాగం చేశారని గవర్నర్ చెప్పడాన్ని బట్టి విషయం మరింత స్పష్టమవుతున్నది. ఇక్కడ పుట్టి పెరిగిన వారందరూ భారతీయులేనని అంగీకరించే నిష్కాపట్యం లౌకికవాదంలోని ప్రధానాంశం. మతంతో సంబంధం లేకుండా మనమంతా మనుషులమనే ఇంగితజ్ఞానంతో ప్రతి భారతీయుడు మార్గనిర్దేశం చేయాలని రాజ్యాంగం నొక్కి చెబుతోంది. అందరికీ న్యాయం, సమానత్వం రావాలి. కానీ ఆర్ఎస్ఎస్ భావజాలంతో నడిచే ఆర్.ఎన్.రవి అలా ఆలోచించలేదు.

అత్యంత క్రూరమైన ఫాసిస్టు అడాల్ఫ్ హిట్లర్ ఆలోచనల నుంచి స్ఫూర్తి పొందిన ఆర్ఎస్ఎస్ కు సెక్యులరిజం అనే మాటను వినడం కష్టంగానే వుంటుంది. హిట్లర్ ఎదుగుదల అంతా కమ్యూనిజం వ్యతిరేకత, యూదు వ్యతిరేకతతోను, జర్మన్ జాతీయవాదంతోనూ నిండిపోయింది. భారతదేశంలో ఆర్ఎస్ఎస్ ఇదేవిధంగా పనిచేస్తుంది. సంఘ్ పరివారీయులు మాత్రమే దేశభక్తులని, హిందువులు కానివారు భారతీయులు కారని వారి ప్రచారం.

బిజెపి పదేళ్లుగా అధికారంలో ఉంది. అంతేగాక ఈ ఆలోచనకు ఆమోదం పొందేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో ముఖ్యమైనది రాజ్యాంగ సంస్థలన్నింటినీ ఆర్ఎస్ఎస్ అధీనంలోకి తీసుకురావడం. ఇందులో భాగంగానే సంఘ్ పరివార్ ప్రయోజనాలకు అనుగుణంగా కొన్ని కోర్టు తీర్పులు వెలువడుతున్నాయి. మొత్తం రాష్ట్రాల గవర్నర్లు ఆర్ఎస్ఎస్ కీలుబొమ్మలు. ప్రస్తుత రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా మనుస్మృతి ఆధారంగా భారత దేశాన్ని మత రాజ్యంగా మార్చడానికి ఆర్.ఎస్.ఎస్ ప్రయత్నిస్తోంది. సంఘ్ కార్యకర్త అయిన నరేంద్ర మోడీని ఉపయోగించి అత్యంత వేగంగా ప్రతి ఎత్తుగడా వేస్తున్నది. బిజెపి ప్రభావం లేని రాష్ట్రాల్లో వీలైనంత వరకు సంఘ్ పరివార్ ఆలోచనలను వ్యాప్తి చేయడానికి గవర్నర్లను సాధనాలుగా ఉపయోగించుకుంటోంది. ఇందులో భాగంగానే కేరళలోని యూనివర్సిటీలను కబ్జా చేసేందుకు గవర్నర్‌ను వినియోగించు కుంటున్నారు. ఇప్పుడు తమిళనాడు గవర్నర్ ఏకంగా రాజ్యాంగాన్నే తిరస్కరించారు. అయితే రాజ్యాంగం చెల్లదని రేపు స్వయంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మోడీ పరిపాలన ఆ దిశగానే సాగుతోంది. దీనికి వ్యతిరేకంగా భారత ప్రజలు ఏకతాటిపై నిలవకపోతే మన దేశం పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ తరహాలో మతతత్వ రాజ్యంగా మారిపోతుంది.

/'దేశాభిమాని' సంపాదకీయం/

FORM NO.14 [See Regulation 33(2)]

GOVERNMENT OF INDIA - MINISTRY OF FINANCE
DEPARTMENT OF FINANCIAL SERVICES (Banking Division)
DEBTS RECOVERY TRIBUNAL
IN THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
31-31-21, Gr. & 1st Floor, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhaptnam - 530020.

R.P. No.159 of 2018 in OA No.06 of 2017

Between:
Indian Overseas Bank, Gandhinagar Branch, Vijayawada, Rep.by it's Senior Manager ... Certificate Holder
Versus
M/s. Amma Khaju House Private Limited, reptd by it's Managing Director : Majety Laxmi Rajasri and others ... Certificate Debtors

DEMAND NOTICE

To:
1) **M/s. Amma Khaju House Private Limited, reptd by it's Managing Director : Majety Laxmi Rajasri,** Flat No.B-1, Pavan Residency, Door No.60-7-6, 4th Lane, Siddardha Nagar, Vijayawada - 520010 **or** D.No.4-122, GT Road, Prasadampadu, Vijayawada - 521108. ... CDR -1
2) **Mrs. Majety Laxmi Rajasri,** D/o. M. Narasimha Rao, Flat No.B-1, Pavan Residency, Door No.60-7-6, 4th Lane, Siddardha Nagar, Vijayawada - 520010. ... CDR -2
3) **Mr. Majety Laxmi Srinivasa Rao,** S/o. M. Venkata Subba Rao, Flat No.B-1, Pavan Residency, Door No.60-7-6, 4th Lane, Siddardha Nagar, Vijayawada - 520010. ... CDR -3
4) **Majety Mohan Suhas,** S/o. Lakshmi Srinivas, Flat No.B-1, Pavan Residency, Door No.60-7-6, 4th Lane, Siddardha Nagar, Vijayawada - 520010. ... CDR -4

In view of the Recovery Certificate **dt.16-11-2018** issued in **O.A. No. 06 of 2017** passed by the Presiding Officer, DRT, Visakhapatnam an **Rs.99,97,048/-** (Rupees Ninety Nine Lakhs Ninety Seven Thousand and Forty Eight Only) due against you together with future interest **@ 12.75%** per annum with monthly rests on the above said amount from **02.01.2017** till the date of payment/realization with costs of **Rs.1,48,500/-.**

You are hereby called upon to deposit the above sum within 15 days of the receipt of the notice, failing which the recovery shall be made as per rules.

In addition to the sum aforesaid you will be liable to pay:
a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.

(Given Under My Hand and The Seal of This Tribunal at Visakhapatnam on this Day 06th July, 2019)

Sd/- (G. Vasudeva Rao) Recovery Officer -1
Debts Recovery Tribunal, Visakhapatnam

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

కానూరు ఎబి బ్రాంచి (14621): 6-102/1, కార్మెల్ చర్చి దగ్గర, కానూరు, కృష్ణా జిల్లా, ఏపి - 520007

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2)/ RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహా ఆబ్లిగెంట్ (లు) : 1) మెస్సర్స్ కార్తికేయ డెయిరీ ఫార్మ్, ప్రొ॥ శ్రీమతి పానుగంటి మాధురి, భర్త : పి. కిరణ్‌బాబు, ఆర్.ఎస్.నెం. 99/2, సూరంపల్లి, గన్నవరం, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఎపి - 521212. **2) శ్రీమతి పానుగంటి మాధురి,** భర్త : పి. కిరణ్‌బాబు, డి.నెం. 15-72, ప్రభు నగర్, మెయిన్ రోడ్డు, పోరంకి, పెనమలూరు మండలం, విజయవాడ, కృష్ణా జిల్లా,ఎపి - 521137. **3) శ్రీ కంటు భీష్మార్జున్,** తండ్రి : కంటు రఘురాం, డి.నెం. 32-15-7, శాతవాహన కాలేజీ ఎదురుగా, చుట్టుగుంట, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఎపి - 520004.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, (యాక్టు 54 యొక్క 2002) ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కానూరు ఎబి బ్రాంచి వారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం. ఇకనుండి SARFAESI చట్టం 8(6) హెచ్చరిక ప్రకటనగా పిలువబడును.

SARFAESI చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 02-05-2024** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 07-08-2024** న అధీకృత అధికారి స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు (పూర్వపు ఆంధ్రాబ్యాంక్) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయబడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. **రిజర్వు ధర రూ. 55,75,000/- (అక్షరాలా యాభై ఐదు లక్షల డెబ్బై ఐదు వేల రూపాయలు మాత్రమే) గా నిర్ణయించడమైనది.**

కాబట్టి, ఆస్తుల లావాదేవీలు చేస్తున్న లేదా ఇతరాత్ర ఇట్టి ఆస్తులు కొనుగోలు పట్ల ఆసక్తి గల వ్యక్తులు నుండి కొటేషన్లు పొందుట లేదా (బి) పబ్లిక్ నుండి టెండర్లు కోరుట ద్వారా లేదా (సి) బహిరంగ వేలం నిర్వహించుట ద్వారా లేదా (డి) ప్రైవేటు ఒప్పందం ద్వారా బ్యాంక్ ఆమోదయోగ్యమైన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి పక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 02-05-2024** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. (SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనేహక్కు ఉంది)
ఒక వేళ విఫలమైతే, పైన సూచించిన విధంగా బ్యాంక్, ఇ-వేలం ద్వారా ఆస్తిని విక్రయించడం జరుగుతుంది.

స్థిరాస్తి వివరములు

శ్రీమతి పానుగంటి మాధురి గారి పేరిట ఎ.పి., కృష్ణా జిల్లా, విజయవాడ రూరల్, నున్న గ్రామం, విజయవాడ నుండి నూజివీడు వెళ్ళు రోడ్డు, అసిస్ట్ నెం. 3202, ఆర్.ఎస్.నెం. 606, డి.నెం. 14-53 వద్ద 145.20 చ॥గ॥ల విస్తీర్ణంలోని భూమి అందలి గ్రౌండ్ ఫ్లోర్‌తో కూడిన ఆర్‌సిసి రెసిడెన్షియల్ బిల్డింగ్. **హద్దులు : తూర్పు :** విజయవాడ - నూజివీడు వెళ్ళు రోడ్డు, **దక్షిణం :** పల్లెపు ఆశీర్వాదం ఇతరులకు విక్రయించిన ఆస్తి, **పడమర :** పానుగంటి ప్రసాద్ గారి ఆస్తి, **ఉత్తరం :** కట్లగుంట నాగ మల్లేశ్వరరావు గారి ద్వారా ఇతరులకు విక్రయించిన ఆస్తి.

తేది : 20-09-2024
స్థలం : కానూరు

సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏపీ - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహా ఆబ్లిగెంట్ (లు) : 1) మెస్సర్స్ త్రీ సీజన్స్ ఆక్వాటెక్ ప్రై.లి., ఫ్లాట్ నెం. 201ఎ, గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్, ఖాజాగూడ, మణికొండ, నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి, హైదరాబాద్ - 500032. **2) శ్రీ సాయి రాజ్ జంపన,** డి.నెం. ఎ-2-293/82/ఎ/594, ఫ్లాట్ నెం. 302, ప్లాట్ నెం. 594, రోడ్డు నెం. 29, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500033. **3) శ్రీమతి ఉషా గాంధీ జంపన,** డి.నెం. ఎ-2-293/82/ఎ/594, ఫ్లాట్ నెం. 302, ప్లాట్ నెం. 594, రోడ్డు నెం. 29, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500033. **4) శ్రీ సాయి రాజ్ జంపన,** మెస్సర్స్ త్రీ సీజన్స్ ఆక్వాటెక్ ప్రై.లి., డి.నెం. 2-62-8, పెద్దిరెడ్డి వారి వీధి, శాంతి నగర్, కాకినాడ - 533003. **5) మెస్సర్స్ కె.వి.ఆర్. అసోసియేట్స్,** ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్ : శ్రీ సాయి రాజ్ జంపన, ఆర్.ఎస్.నెం. 135/2, డి.నెం. 1-414, ప్రజెంట్ డి.నెం. 1-385, దుప్పలపూడి గ్రామం, పీరయి రామచంద్రాపురం పంచాయితీ లిమిట్స్, అనపర్తి మండలం, తూర్పు గోదావరి జిల్లా. **6) శ్రీ సాయి రాజ్ జంపన,** ఎస్.ఎఫ్.నెం. 2/4, 5, 3/1, 2, 3, పోతుకూరు గ్రామం, ఐనవల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533577. **7) శ్రీమతి ఉషా గాంధీ జంపన,** ఎస్.ఎఫ్.నెం. 2/4, 5, 3/1, 2, 3, పోతుకూరు గ్రామం, ఐనవల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533577. **8) శ్రీమతి ఉషా గాంధీ జంపన,** మెస్సర్స్ త్రీ సీజన్స్ ఆక్వాటెక్ ప్రై. లి., డి.నెం. 2-62-8, పెద్దిరెడ్డి వారి వీధి, శాంతి నగర్, కాకినాడ - 533003. **9) మెస్సర్స్ కె.వి.ఆర్. అసోసియేట్స్,** ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్ శ్రీ సాయి రాజ్ జంపన, డి.నెం. 59ఎ-9-7/2, సాయి బాబా గుడి వీధి, ఆర్‌టిసి కాలనీ, విజయవాడ.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి మెస్సర్స్ త్రీ సీజన్స్ ఆక్వాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 06-04-2021** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 07-08-2021** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి పక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 06-04-2021** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తి వివరాలు ఇక్కడ ఇవ్వబడ్డాయి : ఆస్తి నెం. 1 : మెస్సర్స్ కె.వి.ఆర్. అసోసియేట్స్ (రిజిస్టర్ నెం. 5/2010) ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్ శ్రీ జంపన సాయి రాజ్ పేరిట తూర్పు గోదావరి జిల్లా, అనపర్తి మండలం, పీరయి రామచంద్రాపురం గ్రామ పంచాయితీ, దుప్పలపూడి గ్రామం, అసిస్మెంట్ నెం. 412, డి.నెం. 1-414, ఆర్.ఎస్.నెం. 135/2 వద్ద ఎకరా 4.52 సెంట్లు లేదా 21876.80 చ॥గ॥ల విస్తీర్ణంలోని భూమి మరియు అందలి గోడౌన్ బిల్డింగ్స్ మరియు రెండు ఆర్‌సిసి షెడ్స్. **స్థలమునకు హద్దులు : తూర్పు :** అనపర్తి నుండి రాజానగరం వెళ్ళు రోడ్డు, **దక్షిణం :** చిటికెన నాగమణి, మట్టి అనంత లక్ష్మి, కొవ్వూరి రామకృష్ణారెడ్డి మరియు ఇతరులకు చెందిన భూమి, **పడమర :** నల్లమిల్లి వనమారెడ్డి మరియు ఇతరులకు చెందిన భూమి, **ఉత్తరం :** తిరుపతి వెంకటేశ్వర రైస్‌మిల్ కి చెందిన కొంత పార్ట్ వరకు మరియు నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి గారి భూమి మరియు ఇతరుల ఆస్తి కొంత పార్ట్. కో-ఆర్డినేట్స్ : 16.963104, 81.941980

తేది : 21-09-2024
ప్రదేశం : విజయవాడ

చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అన్యమతస్తులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడొద్దు

- తిరుపతి లడ్డూ హిందువుల అంతర్గత వ్యవహారం
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతి లడ్డూ వ్యవహారం హిందువుల అంతర్గత విషయమని, అన్యమతస్తులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడొద్దని కూటమి పక్షాలకు పవన్‌కల్యాణ్ సూచించారు. తిరుమలకు వెళుతున్న జగన్ డిక్లరేషన్ తీసుకోవడం అనేది టిటిడి అధికారుల బాధ్యతని, ఈ విషయంపై కూటమి పక్షాలు ప్రత్యేకంగా మాట్లాడాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. లడ్డూ విషయంలో వైవి సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డి సమాధానం చెప్పాల్సివున్నారు. అలాగే ఆలయ సంప్రదాయాలు, మర్యాదలు జగన్ పాటిస్తారా లేదా అనేది ఆయనకే వదిలేయాలని అన్నారు. అధికారులు బాధ్యత గుర్తెరిగేలా కోరారు. ఈ విషయంలో గొడవలు సృష్టించేందుకు సదరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. గొడవలు సృష్టించాలని వైసిపి వ్యవహారశైలిపై పోలీసుశాఖ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-నందిగామ (ఎన్‌టిఆర్ జిల్లా)

అప్పులబాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమంతుపాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు మేడ వెంకట రవి (45) తనకున్న అర ఎకరం సొంత పొలంతోపాటు మరో మూడు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు పత్తి పంట పూర్తిగా దెబ్బతినడంతో నిరాశ చెందారు. గతేడాది కూడా వ్యవసాయంలో తీవ్రంగా నష్టపోయారు. మొత్తం సాగు నిమిత్తం సుమారు రూ.4 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ ఏడాది కూడా పత్తి పంట పూర్తిగా తుడిచి పెట్టుకుపోవడంతో తీవ్ర మనస్తాపంతో తాను సాగుచేస్తున్న పొలంలోనే పురుగుల మందు తాగారు. కుటుంబీకులు హుటాహుటిన నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భద్రమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న వెంకయ్యనాయుడు

సైనిక్ స్కూల్‌ను సందర్శించిన వెంకయ్య

ప్రజాశక్తి-విజయనగరంకోట

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు విజయనగరం జిల్లాలో గురువారం పర్యటించారు. పర్యటనలో భాగంగా కోరుకొండ సైనిక్ స్కూల్‌ను సందర్శించారు. ఆయనకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్ శాస్త్రి స్వాగతం పలికారు. విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధి లక్ష్యంగా బోధన అందించడం సంతోషకరమని తెలిపారు. భవిష్యత్తులో భారత సైన్యంలో చేరి సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం విజయనగరంలోని రామనారాయణం ప్రాంగణంలో వాల్మీకి రామాయణ రీసెర్చ్ సెంటర్‌ను వెంకయ్య నాయుడు ప్రారంభించి మాట్లాడారు. ఈ పరిశోధన కేంద్రం భావితరాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

ఆందోళన చేస్తున్న జనసేన నాయకులు

అవుకు రిజర్వాయర్‌కు ప్రమాదం లేదు

- ఎస్ఇ వరప్రసాద్

ప్రజాశక్తి - అవుకు

అవుకు రిజర్వాయర్ కట్టకు ఉన్న రివిట్ మెంటుకు ఏర్పడిన రంధ్రం వలన రిజర్వాయర్‌కు ఎటువంటి ప్రమాదం లేదని ఎస్ఆర్‌బిసి డివిజనల్ ఎస్ఇ వరప్రసాద్ అన్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సూచనల మేరకు అవుకు రిజర్వాయర్‌ను ఆయన గురువారం సందర్శించారు. రివిట్మెంటుకు ఏర్పడిన రంధ్రాలను ఎస్ఆర్‌బిసి ఇఇ వెంకట సురేష్ బాబు, డిఇలు వెంకటరెడ్డి, బాబ్జీలతో కలిసి ఆయన క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రిజర్వాయర్ 4.148 టిఎంసిల కెపాసిటీ అని, ప్రస్తుతం 4.1 టిఎంసిలు ఉందన్నారు. దీని వలన నీటి ఉధృతికి రివిట్‌మెంట్ పైన ఉన్న రాళ్ళు తొలగి ఒకటిన్నర అడుగు మేర రంధ్రం ఏర్పడింది తప్ప కట్టకు ఎటువంటి ప్రమాదం లేదని చెప్పారు. రంధ్రం పడిన ప్రాంతంలో రాళ్ల ముక్కలు, మట్టితో కలిపి పూడ్చామని చెప్పారు. రిజర్వాయర్లో నీటి నిల్వను 3.5 టిఎంసిలకు తగ్గించడం కోసం నీటిని జిఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా 12 వేల క్యూసెక్కులు బయటకి వదులుతున్నామని తెలిపారు. రిజర్వాయర్‌లోకి వచ్చే నీటి చేరికను కూడా 6,000 క్యూసెక్కుల వరకు తగ్గించామని, ఇంకా తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ముందు ముందు ఇటువంటి ప్రమాదాలు తలెత్తకుండా రిజర్వాయర్లో నీరు తగ్గిన వెంటనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడతామని తెలిపారు. రిజర్వాయర్ కట్ట కింద భాగంలో వస్తున్న నీరు లీకేజ్ కాదని, సీపేజ్ వాటర్ అని పేర్కొన్నారు.

పేర్ని నాని ఇంటి ముందు ధర్నా

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్

తిరుపతి లడ్డూ కల్తీ విషయంలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌పై మాజీ మంత్రి పేర్ని నాని చేసిన అనుచిత వ్యాఖ్యలపై జనసేన నాయకులు ఆయన ఇంటి ముందు గురువారం ధర్నాకు దిగారు. పవన్ కల్యాణ్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నాని కుమారుడు పేర్ని కిట్టు కూడా తన ఇంటి వద్దే వైసిపి కార్యకర్తలతో నిరసనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువురిని చెదరగొట్టారు. ఈ సందర్భంగా మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పేర్ని నాని క్షమాపణ చెప్పేవరకు నిరసన కొనసాగిస్తామన్నారు. అనంతరం పేర్ని నాని దిష్టి బొమ్మను దహనం చేశారు.

ఉడత ఊపులకు భయపడను : పేర్ని నాని

పవన్.. నీ ఉడత ఊపులకు తాము భయపడబోమని మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజమెత్తారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై పవన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. సినిమాల్లో నాలుగు డైలాగులు చెప్పి రాజకీయాల్లో పప్పు కలాల మధ్య చిచ్చుపెడుతున్నారని, గతంలో ఏమి మాట్లాడావో ఒకసారి చూసుకోవాలని ఎద్దేవా చేశారు.

పెరిగిన ప్రత్యామ్నాయ సాగు

- సబ్సిడీ విత్తనంపై ఆసక్తి కరువు
- ముగియనున్న ఖరీఫ్ సీజన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ఈ ఏడాది ప్రత్యామ్నాయ పంటలే దిక్కయ్యాయి. సకాలంలో వర్షాలు పడకపోవడంతో ప్రధాన పంట వేరుశనగ సాగు నామామాత్రంగానే అయ్యింది. సాధారణ సాగులో 55 శాతంలోపే వేరుశనగ పంట సాగైంది. ప్రత్యామ్నాయ పంటలు కొన్ని 400 శాతానికిపైగా పెరిగాయి. ప్రభుత్వమిచ్చిన సబ్సిడీ ప్రత్యామ్నాయ విత్తనాలపై రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు.

89 శాతం సాగు

ఈ ఏడాది ఖరీఫ్‌లో 3,46,732 హెక్టార్ల సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే ఖరీఫ్ సాగు అత్యధికం వర్షాధారంగా కావడంతోపాటు సాగుకు కీలకమైన జులై నెలలో 61 శాతం వర్షపాతం లోటుగా నమోదైంది. దీంతో ప్రధాన పంట వేరుశనగ ఆశించినంత సాగవలేదు. వేరుశనగ సాధారణ సాగు ఖరీఫ్‌లో 1,97,884 హెక్టార్లు అనుకుంటే విత్తనం పడింది కేవలం 1,08,104 హెక్టార్లలో మాత్రమే. కంది పంట సాధారణ సాగు 37,367 హెక్టార్లు అయితే సాగైంది 1,00,454 హెక్టార్లు. సాధారణం కంటే 269 శాతం అధికంగా అయింది. ఇక కొర్ర పంట రికార్డు స్థాయిలో సాగైంది. సాధారణ సాగు 2001 హెక్టార్లు అయితే 8827 హెక్టార్లు సాగైంది. అంటే సాధారణం కంటే 441 శాతం అధికంగా కొర్ర పంట సాగైంది. సజ్జ పంట సాధారణ సాగు 1610 హెక్టార్లకుగాను 3229 హెక్టార్లు సాగైంది. సాధారణం కంటే 201 శాతం అధికంగా అయింది. ప్రధాన పంటల్లో ఈసారి వరి సాగు బాగా పెరిగింది. సాధారణ సాగు జిల్లాలో 18,299 హెక్టార్లకుగాను 20,789 హెక్టార్లు అయింది. సాధారణం కంటే 114 శాతం అధికమైంది. పత్తి పంట సాధారణం కంటే తక్కువే అయింది. ఇలా ఈసారి ప్రత్యామ్నాయ పంటల సాగు పెరిగింది. సీజన్‌లో వర్షాలు సరిగా లేకపోవడంతో ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తన పంపిణీని ప్రారంభించింది. అనువైన సమయంలో పంపిణీ ప్రారంభం కాలేదు. దీంతో రైతులు బయటే వీటిని కొనుగోలు చేసేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఈ ఏడాది 27,907 క్వింటాళ్ల పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ద్వారా ఇప్పటి వరకు జరిగిన ప్రత్యామ్నాయ విత్తనాల అమ్మకాలు చూస్తే కేవలం 4984 క్వింటాళ్లు మాత్రమే. నాలుగో వంతు మాత్రమే సబ్సిడీ విత్తనాలను రైతులు తీసుకున్నారు. ఇక ఈ వారంలో ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ ప్రారంభం కానుంది. దీంతో ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ కూడా పూర్తవనుంది.

డీజిల్ ట్యాంకు పేలి లారీకి మంటలు

- ఇద్దరు మృతి, ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - బంగారుపాళ్యం

1	రుణగ్రహీతల వివరాలు: ప్రధాన రుణగ్రహీత షమీమ్ భాను, W/o ఖాదర్ భాషా డిమాండ్ నోటీసు తేదీ: 15-12-2023. బకాయి మొత్తం రూ.27,16,085/- ది.30.11.2023 నాటికి తదుపరి వడ్డీతో పాటు. మెయిన్ బ్రాంచ్ నందలి లోన్ నెం. 01-2213-008310లో పూర్తిగా చెల్లించే వరకు. ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: షమీమ్ భాను డోర్ నెం.12-7-7, హయత్ ఖాన్ స్ట్రీట్, అట్కిన్సన్ హైస్కూల్ రోడ్ దగ్గర, తారాపేట, విజయవాడ-1. అసెస్‌మెంట్ నం.65064. డాక్ నెం.2077/2002తో విజయవాడ సబ్ రిజిస్ట్రీ. NTS నెం.162లో మొత్తం 98 చ.గ.ల విస్తీర్ణంలో 24.66 చ.గ.ల UDS మరియు 1వ అంతస్తులో మాత్రమే (%G+3) RCC% భవనంలో ఆస్తి. ఆస్తి సరిహద్దులు: తూర్పు:- మున్సిపల్ రోడ్, సౌత్:- షేక్ జిలానీ, వెస్ట్:- మున్సిపల్ కార్పొరేషన్ ఆస్తి, ఉత్తరం:- మున్సిపల్ రోడ్డు. మొదటి అంతస్తు సరిహద్దులు: తూర్పు:- మునిసిపల్ రోడ్డు వైపు ఓపెన్ టు స్కై, దక్షిణం: షేక్ జిలానీ తో ఉమ్మడి గోడ, పడమర: మెట్లు, ఉత్తరం:- మున్సిపల్ రోడ్డు వైపు ఓపెన్ టు స్కై. స్వాధీనం చేసుకున్న తేదీ: 24-09 -2024.
2	రుణగ్రహీతల వివరాలు: మరణించిన ప్రధాన రుణగ్రహీత స్వర్ణాల నాగ ఆంజనేయులు, S/o పెద్ద నాంచారయ్య 1. తల్లి: స్వర్ణాల ఉషా కన్య. 2. భార్య: స్వర్ణాల లక్ష్మి 3. కొడుకు: స్వర్ణాల వెంకట ప్రవీణ్ 4. కూతురు: తోట కుసుమ, W/o లక్ష్మణరావు. డిమాండ్ నోటీసు తేదీ: 02-04-2024. బకాయి మొత్తం రూ.6,77,193/- ది.31.03.2024 నాటికి తదుపరి వడ్డీతో పాటు. వుయ్యూరు బ్రాంచ్ నందలి లోన్ నెం. 032213001469లో పూర్తిగా చెల్లించే వరకు. ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: లేట్ స్వర్ణాల నాగ ఆంజనేయులు డోర్ నెం.8-7, (పాత డోర్ నెం.8-10) సాయిబాబా దేవాలయం వెనుక వైపు, కుందేరు రోడ్, BC కాలనీ, కాటూరు, కృష్ణా Dt - 521164. సర్వే నెం.202లో 388 చదరపు గజాల స్థలం /1లో RCC భవనం ఉంటుంది. అసెస్‌మెంట్ నెం.524. వుయ్యూరు సబ్ రిజిస్ట్రీ కింద డాక్ నెం.3473/2003 & MD:103/2017. ఆస్తి సరిహద్దులు: తూర్పు:- పంచాయతీ బజార్ (67 లింకులు), దక్షిణం:- బోయిన కోటేశ్వరరావు (120 లింకులు), పశ్చిమం:- దోనేపూడి సుబ్బారావు & పాపినేని సీతా రామయ్య (67 లింకులు), ఉత్తరం:- స్వర్ణాల చిన్న నాంచారయ్య & పేటేటి సుందరరావు (119 లింకులు) స్వాధీనం చేసుకున్న తేదీ: 24-09 -2024.

ది.26-09-2024, స్థలం : విజయవాడ
సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

HDB FINANCIAL SERVICES
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
రిజిష్టర్డు ఆఫీసు : రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్, నవ్‌రంగ్‌పుర, అహ్మదాబాద్-09.
బ్రాంచి : 76-8-10/1, ఫ్లాట్ నం.4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, భవానిపురం, విజయవాడ - 520 012

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(13)తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద ప్రకటన.

మీరు, కింద పేర్కొన్న రుణగ్రహీత / తనఖాదారుకి, కంపెనీ మీకు వ్యతిరేకంగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు రిజిస్టర్డ్ పోస్ట్ యాక్ ద్వారా మీకు చట్టంలోని 13(2) కింద నోటీసు పంపబడిందని మీకు తెలియజేస్తున్నాము. రుణగ్రహీతల బకాయిలు అందచేయబడలేదు. అందువవల్ల మీరు నోటీసు తీసుకుని, ఈ పబ్లికేషన్ తేదీ నుండి 60 రోజులలోపు వడ్డీతోపాటు పేర్కొన్న ఖాతాకు వ్యతిరేకంగా పేర్కొన్న బకాయి రుణ మొత్తాన్ని చెల్లించవలసిందిగా కోరుతున్నారు. లేని పక్షంలో చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (4) కింద కంపెనీ మీ పై చర్య తీసుకుంటుంది. పేర్కొన్న సెక్యూరిటీని వడ్డీలు మరియు ఖర్చులతో దాని బకాయిలను గ్రహించడం ద్వారా కంపెనీకి అందుబాటులో ఉన్న మరే ఇతర నివారణకు పక్షపాతం లేకుండా ఈ నోటీసు మీకు అందించబడిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

క్ర సం.	రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారుల పేర్లు	రుణ ఖాతా నం.లు	ఎన్‌పిఏ తేది & డిమాండ్ నోటీసు తేది	బాకాయి మొత్తం రూ॥ ప్రకారం
1	1) శ్రీ బాలాజీ ఎంటర్‌ప్రైజెస్, షాప్ నం.24, రెండవ అంతస్తు, ఫ్యాన్సీ డిస్ట్రిబ్యూటర్స్ ప్లాజా, ఏటుకూరు రోడ్డు, గుంటూరు-522 003. 2) సముద్రాల గురునాథం, ఫ్లాట్ నం.302, ఎస్ఆర్ హోమ్స్, 3/8వ లేన్, విద్యానగర్, గుంటూరు-522007. 3) సముద్రాల అనురాధ, ఫ్లాట్ నం.302, ఎస్ఆర్ హోమ్స్, 3/8వ లేన్, విద్యానగర్, గుంటూరు-522 007	లోన్ అకౌంట్ నం.: 8560789	ఎన్‌పిఏ తేది : 02.08.2024 డిమాండ్ నోటీసు తేది : 10.09.2024	రూ. 29,77,863.39/- 09-09-2024 నాటికి భవిష్యత్ మరియు ఒప్పంద వడ్డీ వాస్తవికత వరకు కలిసి యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చు మరియు ఛార్జీలు మొదలైనవి.

సెక్యూరిటీలు-1 షెడ్యూల్ : గుంటూరు జిల్లా, గుంటూరు ఉపజిల్లా, రామచంద్రాపుర అగ్రహారం పట్టా నం.1053, పైమయిషి నం.82, మున్సిపల్ పాత వార్డు నం.17, కొత్త వార్డు నం.22, బ్లాక్ నం.18, టి.ఎస్.నం.520 లో ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ స్థలం విస్తీర్ణం ఎ.లు. 1.28 సెంట్లు. డో.నం.25-17-413 ఆ తూర్పు మూల వైపు సైట్ పరిధి 697-2/9 చ.గ.లు.తో ప్లాట్లుగా చేసిన అందులో ప్లాట్ నం.74-78, **హద్దులు : ఉత్తరం :** 30 అ.లు. వెడల్పు రోడ్డు 23-02, **దక్షిణం :** విక్రేతల మిగిలిన సైట్ 22-11, **తూర్పు :** 20 అ.లు. వెడల్పు రోడ్డు 42-11, **పడమర :** కల్వకొల్లు వెంకట సాంబశివరావుకు విక్రేతల ద్వారా అమ్మబడిన సైట్ 42-9.

తేది : 27.09.2024, ప్రదేశం : గుంటూరు
సం/- అధీకృత అధికారి, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
IDFC FIRST Bank
(గతంలో ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది) సిఐఎన్ నం.: L65110TN2014PLC097792
నమోదిత కార్యాలయం : కెఆర్ఎం టవర్స్, 7వ అంతస్తు, హర్రింగ్టన్ రోడ్, చెట్‌పట్, చెన్నై-60 0031. టెలి : +91 44 4564 4000 ఫ్యాక్స్ : +91 44 4564 4022

అనుబంధం-IV-A [రూల్ 8 (6) మరియు 9(1) కు నిబంధన చూచుట] స్థిరాస్తుల విక్రయం కొరకు అమ్మకపు నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1)కు నిబంధనతో చదువుతూ, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సేట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు.

ఇందుమూలంగా సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు నోటీసు ఇవ్వడమేమనగా కాలం (ii) ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తనఖా పెట్టబడిన/చార్జ్ చేయబడిన దిగువ వివరించిన స్థిరాస్తిని కాలం (iii) ప్రకారం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ దీని ఆధీకృత అధికారి ద్వారా స్వాధీనపరచుకొని, కాలం (i) ప్రకారం **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్** (గతంలో బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది) కి బకాయి ఉన్న రుణగ్రహీత(లు) మరియు సహ రుణగ్రహీత(లు) నుండి బకాయి మొత్తం తిరిగి రాబట్టుకునేందుకు **"ఏది ఎక్కడ ఉందో" "ఆ పద్దతి ప్రకారం"** మరియు **"ఏది ఏమైనా ఆ పద్దతి ప్రకారంగా"** విక్రయించడం జరుగుతుంది.
అమ్మకం యొక్క వివరణాత్మక షరతులు మరియు నియమముల కొరకు, దయచేసి ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ అందించిన వెబ్‌సైట్ లింకును www.idfcfirstbank.com చూడగలరు.

క్ర సం.	(i) డిమాండ్ నోటీసు మొత్తం	(ii) ఒప్పందం ఐడి	(iii) రుణగ్రహీత(లు) మరియు సహ రుణగ్రహీత(లు) మరియు హామీదారుల పేరు	(v) రిజర్వు ధర మొత్తం	(vi) ఇఎమ్‌డి మొత్తం	(vii) వేలం తేది మరియు సమయం	(viii) ఇఎమ్‌డి వేలం తేది మరియు సమయం	(ix) తనిఖీ తేది మరియు సమయం	(x) అధీకృత అధికారి పేరు మరియు సంప్రదించాల్సిన నంబరు
1	ఐఎన్ఆర్ 3140001.22/- డిమాండ్ నోటీసు తేది: 11-జూన్-2019	7645116 & 7731820	సిహెచ్ శ్రీనివాసరావు, చెపర్తి రమాదేవి మరియు తనూజ ఎలక్ట్రికల్	INR 2759620.00/-	INR 275962.00/-	29-Oct-2024 11.00 AM to 1.00 PM	28-Oct-2024 10.00 AM to 5.00 PM	23-Oct-2024 10:00 AM To 4:00 PM	పేరు : పొన్నమండ తాతరాజు, సంప్రదించాల్సిన నంబరు-91770 50538, పేరు : ఎన్.రాజేందర్, సంప్రదించాల్సిన నంబరు-8093 772119

తనఖా ఆస్తి చిరునామా : టి.ఎస్.నం.118 బేరింగ్ ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్, డో.నం.16-1-16, మున్సిపల్ వార్డు నం.6, 10 (కొత్త), బ్లాక్ నం.5, కుమ్మరి బజారు, కొత్తపేట, పాత గుంటూరు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522 001.

నిరాకరణ : పేర్కొన్న నోటీసు స్థిరాస్తిని విక్రయించడం కొరకు మాత్రమే జారీ చేయబడిందని మరియు ప్రస్తుత స్థిరాస్తి వద్ద చరాస్తులు ఏవైనా ఉంటే, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌కి విక్రయించే హక్కులు లేదని దయచేసి గమనించగలరు.

తేది : 27.09.2024
సం/- అధీకృత అధికారి, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)

పాలస్తీనాకు సంఘీభావంగా 'నొగుచి' అవార్డును తిరస్కరించిన ఝుంపాలహరి

న్యూయార్క్ : న్యూయార్క్ నగరంలోని నొగుచి మ్యూజియం నుండి అవార్డు తీసుకోవడానికి పులిట్జర్ బహుమతి గ్రహీత, రచయిత్రి ఝుంపా లహిరి తిరస్కరించారు. పాలస్తీనాకు సంఘీభావ చిహ్నమైన కెఫియె తలపాగాను ధరించినందుకు ముగ్గురు ఉద్యోగులను విధుల నుండి తొలగించినందుకు నిరసనగా ఈ చర్య తీసుకున్నారు. సవరించిన తమ డ్రెస్ కోడ్ విధానానికి అనుగుణంగా తాము తీసుకున్న చర్యపై నిరసన వ్యక్తం చేస్తూ 2024 ఇసాము నొగుచి అవార్డును స్వీకరించడానికి ఝుంపా లహిరి తిరస్కరించారని మ్యూజియం ఒక ప్రకటనలో తెలిపింది. ఆమె అభిప్రాయాన్ని గౌరవిస్తున్నామని, తమ ఈ విధానం ప్రతి ఒక్కరి అభిప్రాయాలతో ఏకీభవించకపోవచ్చని ఆ ప్రకటన పేర్కొంది. న్యూయార్క్ టైమ్స్ మొదటగా ఈ వార్తను ఇచ్చింది. పాలస్తీనా స్వయం నిర్ణయాధికారానికి చిహ్నమైన నలుపు తెలుపు రంగులతో కూడిన తలపాగా కెఫియెను ప్రపంచవ్యాప్తంగా నిరసనకారులందరూ ధరిస్తున్నారు.

లౌకిక ఉద్యమాలకు తీరని లోటు

ఏచూరి సంతాప సభలో కేరళ సిఎం పినరయి విజయన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిది ఎల్లలు లేని సోదరభావమని, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాలకు నాయకత్వం వహించిన వారిలో ఆయన ఒకరని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. సిపిఎం కేరళ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన తిరువనంతపురంలో సీతారాం ఏచూరి సంతాప సభ జరిగింది. సిపిఎం సీనియర్ నేత, పొలిట్ బ్యూరో మాజీ సభ్యులు ఎస్ రామచంద్రన్ పిళ్లై అధ్యక్షతన జరిగిన ఈ సభలో పినరయి విజయన్ మాట్లాడుతూ.. ప్రపంచంలోని వివిధ దేశాల కమ్యూనిస్టు నేతలతో ఏచూరికి అత్యంత సన్నిహిత సంబంధాలుండేవని అన్నారు. ప్రధాన కార్యదర్శి కాకముందు కూడా ఇతర దేశాల్లోని సోదర పార్టీలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించారని గుర్తుచేశారు. అనేక దేశాల సమస్యలపైనా ఆయన స్పందించారని అన్నారు. విద్యార్థి రోజుల నుంచే ఏచూరి నాయకత్వ పటిమకు గుర్తింపు వచ్చిందని, వరుసగా మూడుసార్లు జెఎన్‌యు స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులుగా రికార్డు సృష్టించారని తెలిపారు. భారతదేశంలోని మేధావుల్లో ఆయన ప్రముఖుడైనప్పటికీ, ఆయన అలాంటి వైఖరి ప్రదర్శించలేదని పేర్కొన్నారు. తనకు భిన్నాభిప్రాయాలున్న అంశాలపై చర్చించేటప్పుడు చిరాకు పడకుండా ప్రజెంట్ చేయగల నేత సీతారాం ఏచూరి అని అన్నారు. కేరళలో ఏచూరికి నేరుగా తెలిసిన పార్టీ కార్యకర్తలు చాలా మంది ఉన్నారని, కేరళలో సిపిఎం ఎదుగుదలలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఏచూరి మరణం సిపిఎంకే కాకుండా ప్రస్తుత భారతదేశ పరిస్థితిలో అన్ని లౌకిక ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. సీతారాం ఏచూరి మృతి సిపిఎం, వామపక్ష ఉద్యమాలకే కాకుండా లౌకిక ప్రజాతంత్ర ఉద్యమాలకు



తీరని లోటని సిపిఎం సీనియర్ నేత ఎస్ రామచంద్రన్ పిళ్లై అన్నారు. ఏచూరితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏచూరి చాలా సమర్థుడైన రాజకీయ నాయకుడని, వామపక్ష రాజకీయ పార్టీలతోపాటు, లౌకిక, ప్రజాస్వామ్య రాజకీయ పార్టీలతో స్నేహపూర్వకంగా ఉండటానికి, కలిసి ఆందోళనలోకల పాల్గొనడానికి ఆయన సమర్థవంతంగా కృషి చేశారని అన్నారు.

దేశం చూసిన ప్రతిభావంతులైన రాజకీయ నాయకుల్లో ఒకరు : ఎంవి గోవిందన్

విద్యార్థి ఉద్యమంతో వామపక్ష రాజకీయాల్లోకి వచ్చిన ప్రతిభావంతులైన రాజకీయ నాయకుల్లో సీతారాం ఏచూరి ఒకరని సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ మాస్టర్ అన్నారు. ఏచూరి ఒక తెలివైన కమ్యూనిస్టు, తాత్విక, సంస్థాగత, ఆచరణాత్మక విషయాలపై దృష్టి పెట్టారని పేర్కొన్నారు. ఏచూరి జాతీయ రాజకీయాల్లో సరైన దిశానిర్దేశంతో పనిచేశారని, దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించారన్నారు. సిపిఐ నేత పన్నయ్య రవీంద్రన్ మాట్లాడుతూ.. రాజకీయాలు, విద్యారంగంలోనే కాకుండా దేశ చరిత్రలో కూడా అపారమైన జ్ఞానం ఉన్న నాయకుడు ఏచూరి అని అన్నారు. వామపక్ష, లౌకిక ఉద్యమాలతో ఏకీభవించే అన్ని పార్టీలతో నేరుగా చర్చలు జరపగలిగారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, ఎ విజయరాఘవన్, రాష్ట్ర మంత్రి రామచంద్రన్ కదనపల్లి, ఆర్ఎస్‌పి కేంద్ర కమిటీ సభ్యులు కెఎస్ సనల్‌కుమార్, ఎఐసిసి కార్యదర్శి పిసి విష్ణునాథ్, కేరళ కాంగ్రెస్ నాయకులు ఎన్ జయరాజ్, కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే పిసి విష్ణునాథ్, ఐయుఎంఎల్ ప్రధాన కార్యదర్శి పిఎంఎ సలమ్, ఎన్‌సిపి నేత పిసి చాకో, జెడిఎస్ నేత మాథ్యూ టీ థామస్, కేరళ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మోన్స్ జోసెఫ్, ఐఎన్ఎల్ ప్రధాన కార్యదర్శి కాసిం ఇర్క్యూర్, కేరళ కాంగ్రెస్ (స్కారియా థామస్) ఛైర్మన్ బెనోయ్ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రను ముంచెత్తిన భారీ వర్షాలు

- ఐదుగురు మృతి
- ముంబయికి ఐఎండీ ఆరెంజ్ అలర్ట్
- థానే, పాల్ఘర్, రాయ్‌గడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్

ముంబయి : భారీ వర్షాలు మహారాష్ట్రను ముంచెత్తుతున్నాయి. బుధవారం కురిసిన భారీ వర్షాలు పలు నగరాలను అతలాకుతలం చేశాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో ఐదుగురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఒకరు ముంబయి నుంచి, ఒకరు రాయ్‌గఢ్ నుంచి, ముగ్గురు కళ్యాణ్ నుంచి ఉన్నారు. రాష్ట్రంలో వర్షాలు మరింతగా పడే అవకాశమున్నదని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) హెచ్చరించింది. అలాగే, ముంబయికి ఆరెంజ్ అలర్ట్‌ను, థానే, పాల్ఘర్, రాయ్‌గడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. ముంబయిలో ఉరుములు, మెరుపులతో గంటలకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయనిని ఐఎండీ అంచనా వేసింది. గురువారం పూణేలో అత్యధికంగా 133 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందనీ, సెప్టెంబర్‌లో ఇదే అధిక వర్షపాతమని గుర్తించింది. ఇది పూణే చరిత్రలో మూడో అత్యధిక వర్షపాతమని తెలిపింది.భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముంబయి, థానే, పాల్ఘర్, పూణే, పింప్రి-చించ్వాడ్‌తో సహా పలు జిల్లాల్లో పాఠశాలలు, కాలేజీలు మూతపడ్డాయి. భారీ వర్షాల తర్వాత గురువారం ముంబయిలో వాహన రాకపోకలు, రైలు సర్వీసులు కొనసాగాయి. నగరంలో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విమానాలు, లోకల్ ట్రైన్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలకు ముంబయిలోని అంధేరీ ఈస్ట్‌లో ఒక మహిళ ఓపెన్ డ్రెయినేజీలో మునిగి చనిపోయింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపటం కోసం బృహన్‌ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ భూషన్ గగ్రానీ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయటానికి ఆదేశించారు. మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని తెలిపారు. వచ్చేనెల 1 వరకు ముంబయిలో వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షాలకు ముంబయిలోని పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. పలు ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది.

లడ్డూతో ఓటు రాజకీయం

- ఓటు బ్యాంకును కాపాడుకునేందుకే...
- హిందూత్వ వాదాన్ని తలకెత్తుకుంటున్న టిడిపి, జెడియు
- సీతాదేవి కేంద్రంగా నితీశ్ రాజకీయాలు తమ ఓట్లకు ఎసరు పెడతారేమోనని కలవరపడుతూనే, పవన తీరుతో సంబరపడుతున్న బీజేపీ

న్యూఢిల్లీ : ఎన్డీయేలో కీలక భాగస్వాములుగా ఉన్న తెలుగుదేశం, జెడియు పార్టీలు తమ హిందూ ఓటు బ్యాంకును చెక్కుచెదరకుండా చేసుకునే ప్రయత్నాలలో ఉన్నాయని ఇటీవలి పరిణామాలను బట్టి అర్థమవుతోంది. తిరుపతి లడ్డూ వివాదాన్ని తెలుగుదేశం పార్టీ తనకు అనుకూలంగా మలచుకుంటోంది. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ వచ్చిన ఆరోపణలను పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మొదలుకొని కింది స్థాయి కార్యకర్త వరకూ అందిపుచ్చుకుంటున్నారు. రాష్ట్రంలో తన ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న జగన్‌మోహన రెడ్డి పాలనలో తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారని, ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే అవుతుందని కూటమి నేతలు నానా యాగీ చేస్తున్నారు..

దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం...

తిరుపతి లడ్డూ వివాదం ప్రాథమికంగా చూస్తే జగన్‌మోహన రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నట్లు కన్పించినా దీర్ఘకాల ప్రయోజనాల రీత్యా తమ హిందూ ఓటు బ్యాంకును పటిష్టపరచుకునేందుకు చేస్తున్న ప్రయత్నంగా చూడవచ్చునని టీడీపీ వర్గాలు ఆంతరంగికంగా చెబుతున్నాయి. 'జగన్‌ను ఇరుకున పెట్టేందుకు చంద్రబాబు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఆయన కేవలం లడ్డూ వివాదాన్నే లేవనెత్తడం లేదు. తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రవేశించేటప్పుడు క్రైస్తవుడైన జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోవడాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు. ఈ అంశాలను ముందుకు తేవడం ద్వారా జగన్‌ను కోలుకోకుండా చేయాలని చంద్రబాబు చూస్తున్నారు. చంద్రబాబు వ్యూహం వెనుక రాజకీయ ఎత్తుగడలు ఉన్నాయని తాము భావించడం లేదని టిడిపి నేతలు అంటూనే రాజకీయ ప్రయోజనాలు చేకూరుతాయని అంగీకరిస్తున్నారు. హిందువులలో ఇప్పటికే మంచి మద్దతు ఉన్నందున ఇప్పుడు కొత్తగా వచ్చే లబ్ధి ఏమీ ఉండదని, అయితే ప్రత్యర్థులు పైచేయి సాధించకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత తమపై ఉన్నదని వారు చెప్పారు. చంద్రబాబు చర్యలతో పార్టీకి లబ్ధి చేకూరుతుందని ఓ టీడీపీ ఎమ్మెల్యే తెలిపారు. చంద్రబాబు చర్యలు ఆంధ్రప్రదేశ్‌లోని హిందువులకే కాకుండా ప్రపంచంలోని హిందువులందరికీ భరోసా ఇచ్చాయని టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు చెప్పారు.

నేను సైతం అంటున్న జనసేన

బిజెపికి మిత్రపక్షంగా, ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ కూడా సనాతన ధర్మం నినాదాన్ని ఎత్తుకుంది. ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రస్తుతం 11 రోజుల 'ప్రాయశ్చిత్త దీక్ష'లో భాగంగా ప్రసిద్ధ దేవాలయాలను సందర్శిస్తూ తిరుపతిలో జరిగిన తప్పిదానికి క్షమాపణలు కోరుతున్నారు. విజయవాడలోని కనకదుర్గ దేవాలయాన్ని సందర్శించి మెట్లు కడిగారు. దేవాలయాలకు సంబంధించిన వ్యవహారాలను చూడడానికి సనాతన ధర్మ రక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలోని హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను నిరసిస్తూ ధర్మ పరిరక్షణ దీక్ష చేపట్టాలని పవన్, బిజెపి నేతలు 2020లో పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. టిడిపి వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును అనుకరించేందుకు పవన్ చేస్తున్న ప్రయత్నాలను తాము గమనిస్తున్నామని టీడీపీ నాయకులు చెప్పారు. వేషధారణలో కూడా పవన్ ఇటీవల ఎన్టీఆర్‌ను అనుకరించారు.

పవన్ చర్యలపై బిజెపి సంబరం

ఎపిలో పార్టీకి నిర్మాణపరంగా కానీ, నాయకత్వ పరంగా కానీ తగిన బలం లేకపోయినా పవన్ కల్యాణ్ కేంద్ర నాయకత్వంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారని, తాము ఏ భావజాలంతో ఉన్నామో దానికి ఆయన మద్దతుగా నిలుస్తున్నారని బిజెపి సంబరపడుతోంది. 'పార్టీ మద్దతుదారులలో ఆయన అత్యంత విశ్వసనీయ వ్యక్తి. నరేంద్ర మోడీ సహా పార్టీ నాయకత్వం ఆయన పట్ల తమ అభిమానాన్ని, గౌరవాన్ని ఎన్నడూ దాచుకోలేదు' అని ఓ బిజెపి నేత వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన తొలి ఎన్డీఏ సమావేశంలో పవన్‌ను ఉద్దేశించి 'ఆయన పవనం కాదు. తుఫాను' అని మోడీ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు.

నితీష్ అడుగులతో బిజెపి బెంబేలు

రామ మందిరం నిర్మించినందుకు బీహార్ నేత నితీష్ కుమార్ ప్రధానిపై ప్రశంసలు కురిపించారు. సీతామర్హి-అయోధ్య మధ్య నేరుగా రైల్వే లైను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

నితీష్ వైఖరి బీహార్‌లోని బిజెపి వర్గాలలో ఆందోళన కలిగిస్తోంది. లోక్‌సభ ఎన్నికలలో అనూహ్య ఫలితాలు సాధించిన నితీష్ కుమార్, ఇప్పుడు తమ హిందూ ఓటు బ్యాంకుకు ఎక్కడ గండి కొడతారోనని కొందరు బిజెపి నేతలు భయపడుతున్నారు. 'గత ఎనిమిది నెలల కాలంలో ఆయన ఎప్పుడూ ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదు. మా ఓటు బ్యాంకును గండి కొట్టేందుకు ఇది ఓ ప్రయత్నం కావచ్చు శ్రీరాముడు కేంద్రంగా బిజెపి సాగించిన రాజకీయాలకు భిన్నంగా సీతాదేవి కేంద్రంగా నితీష్ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

రేపు వైసిపి పూజలు

లడ్డూ వివాదంలో చంద్రబాబు పైచేయి సాధిస్తున్నారేమోనన్న అనుమానంతో వైసిపి కూడా రంగంలోకి దిగింది. చంద్రబాబు దెబ్బతీసిన తిరుమల పవిత్రతను పునరుద్ధరించేందుకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలలో పూజలు నిర్వహించాలని వైసిపి అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి పిలుపునిచ్చారు. చంద్రబాబు దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు.

మరో 4 జిల్లాలకు వైసిపి అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మరో నాలుగు జిల్లాలకు వైసిపి నూతన జిల్లా అధ్యక్షులను నియమించింది. విశాఖపట్నం జిల్లా అధ్యక్షులుగా మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ నియమితులయ్యారు. అలాగే అనకాపల్లి జిల్లాకు మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులుగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, బాపట్ల జిల్లాకు మాజీ మంత్రి మేరుగ నాగార్జున నియమితులయ్యారు. అలాగే బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులుగా మాజీ ఎంపి నందిగం సురేష్‌బాబు, వైసిపి పిఎసి మెంబర్‌గా ఆదిమూలపు సురేష్, విశాఖపట్నం వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా మళ్లా విజయప్రసాద్, రాష్ట్ర ఎస్‌టి విభాగం అధ్యక్షులు, పార్టీ పిఎసి సభ్యులుగా మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

స్వలింగ సంపర్కుల వివాహానికి థాయిలాండ్‌లో చట్టం

బ్యాంకాక్ : స్వలింగ సంపర్కులు వివాహం చేసుకోవడానికి అనుమతిస్తూ థాయిలాండ్ ఒక చట్టం తీసుకువచ్చింది. 120 రోజుల్లో ఇది అమల్లోకి రానుంది. అంటే వచ్చే ఏడాది జనవరిలో ఎల్‌జిబిటి దంపతులు తమ వివాహాన్ని నమోదు చేసుకోగలుగుతారు. ఆసియాలో ఈ వివాహాలను ఆమోదించిన మూడో దేశంగా థాయిలాండ్ నిలిచింది. ఇప్పటివరకు తైవాన్, నేపాల్‌లు ఆమోదించాయి. స్త్రీ, పురుషుడు లేదా గే ఎవరైనా సరే వివాహ భాగస్వామికి పూర్తి స్థాయిలో చట్టపరమైన, ఆర్థిక, వైద్య హక్కులను ఈ చట్టం కల్పిస్తోంది. వరుసగా ఏప్రిల్, జూన్ మాసాల్లో ప్రతినిధుల సభ, సెనెట్‌ల్లో ఈ బిల్లు ఆమోదం పొందింది. లవ్ విన్స్ అనే హ్యాష్ ట్యాగ్‌తో ప్రతి ఒక్కరి ప్రేమకు అభినందనలు అంటూ ప్రధాని పెటాంగ్టర్న్ షినవత్రా ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అందరినీ కలుపుకుని పోతుంది, అన్ని వివాహాలకు ఆమోదం వుంటుందనే పేరు వున్నప్పటికీ వివాహ సమానత్వపు చట్టాన్ని ఆమోదించడానికి దశాబ్దాలుగా పోరాటం చేయాల్సి వచ్చింది. థాయి సమాజంలో మెజారిటీ ప్రజలు సంప్రదాయ విలువలకు ప్రాధాన్యతనిచ్చే వారు కావడం, ఎల్‌జిబిటి సభ్యులు తాము రోజువారీ జీవితంలో వివక్షకు గురవుతున్నామని వాపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. సివిల్, కమర్షియల్ కోడ్‌ను సవరిస్తూ చట్టాన్ని తీసుకువచ్చారు. స్త్రీ, పురుషుడు అన పదాల స్థానే వ్యక్తి అని పొందుపరిచారు.

57 మంది డిప్యూటీ కలెక్టర్లు బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 57 మంది డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు. వీరిలో ట్రైనింగ్ పూర్తి చేసుకుని కొత్తగా బాధ్యతల్లోకి వచ్చిన వారూ ఉన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ప్రకటన విడుదల చేశారు. వీరందరూ వెంటనే వారి విధుల్లో చేరాలని అందులో సూచించారు.

ఫిలిప్పైన్స్‌లో అమెరికా క్షిపణుల మోహరింపు

మనీలా: చైనా ఆందోళనను బేఖాతరు చేస్తూ ఫిలిప్పైన్స్ ఉత్తర ప్రాంతంలో శాశ్విత సైనిక స్థావరాన్ని నెలకొల్పి ,మధ్యంతర శ్రేణి క్షిపణులను అక్కడ మోహరించేందుకు అమెరికా, ఫిలిప్పైన్స్ అధికారుల మధ్య బుధవారం ఒక అంగీకారం కుదిరింది. తొమ్హాక్, టైఫూన్ వంటి భూతల దాడులకు సంబంధించిన అత్యంత అధునాతనమైన క్షిపణులను ఈ స్థావరంలో ఉంచాలన్నది అమెరికా యోచన. వెయ్యి మైళ్ల దూరంలోని లక్ష్యాలను సైతం తేలికగా ఛేదించే సామర్ధ్యం కలిగిన ఈ క్షిపణుల లక్ష్యం చైనాయేనన్నది అందరికీ తెలిసిందే.

ఎన్నికల్లో వరుస ఎదురుదెబ్బలతో జర్మన్ గ్రీన్స్ నాయకత్వం రాజీనామా

బెర్లిన్: మొన్న యూరోపియన్ పార్లమెంటు, నిన్న రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో జర్మన్ గ్రీన్స్ పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తగలడంతో ఈ పతనానికి నైతిక బాధ్యత వహిస్తూ ఆ పార్టీ నేతలు ఒమిద్ నౌరిపూర్, రికార్డా లాంగ్ నాయకత్వం నుంచి తప్పుకుంటున్నట్లు బుధవారం ప్రకటించారు. గత జూన్‌లో జరిగిన యూరోపియన్ పార్లమెంటు ఎన్నికల్లో గ్రీన్ పార్టీ ఓటమి పాలైంది. తాజాగా ఈ నెలలో జరిగిన జర్మనీ ఫెడరల్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పరిస్థితి మరింతగా దిగాజారింది. తూర్పు రాష్ట్రాలైన తురింజియన్, శాక్సనీ, బ్రాండెన్‌బర్గ్ ఎన్నికల్లో గతంతో పోల్చితే చాలా దారుణంగా దెబ్బతినిపోయింది. రాష్ట్రాల అసెంబ్లీలోకి ప్రవేశించాలంటే కనీసం 5 శాతానికిపైగా ఓట్లు రావాలి. దానిని కూడా సాధించలేక గ్రీన్స్ పార్టీ చతికిలబడింది. రెండు నెలల క్రితం జరిగిన యూరోపియన్ పార్లమెంటు ఎన్నికల్లోనూ గ్రీన్స్ పార్టీ ఓటింగ్ శాతం బాగా పడిపోయింది. గ్రీన్స్ పార్టీ నాయకత్వ రాజీనామా ప్రభావం తన సంకీర్ణ ప్రభుత్వంపై ఉండబోదని జర్మన్ చాన్సలర్ ఒలాఫ్ షుల్జ్ చెప్పారు. గ్రీన్స్ పార్టీ షుల్జ్ సంకీర్ణ కూటమిలో భాగస్వామిగా ఉన్న సంగతి తెలిసిందే.

చెప్పేదొకటి ...చేసేదొకటి!

ఐరాస జనరల్ అసెంబ్లీలో బైడెన్ చివరి ప్రసంగం

న్యూయార్క్ : మనం కలిసికట్టుగా పనిచేస్తే సాధించలేనిదంటూ ఏమీ లేదని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఐరాస జనరల్ అసెంబ్లీ 78వ వార్షిక సమావేశాన్ని ఉద్దేశించి చేసిన తన చివరి ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, సహకారం గురించి ఆయన చిలుక పలుకులు వల్లించారు. దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా ఆయన ప్రసంగం యావత్తూ సాగింది. ఆ ప్రసంగం యావత్తూ కపటత్వంతో సాగింది. ప్రపంచవ్యాప్తంగా పరస్పర సహకారానికి, ప్రజాస్వామ్యానికి పెద్ద అడ్డంకిగా ఏ దేశమైనా ఉన్నదీ అంటే అది అమెరికానే. అగ్ర రాజ్యం అధినేతగా చేసిన ఈ చివరి ప్రసంగంలోనైనా నిజాలు చెబుతారని ఆశించినవారికి బైడెన్ తీవ్ర నిరాశపరిచారు. హిపోక్రసీ, అసత్యాలతో ఆయన ప్రసంగం నిండిపోయింది. అమెరికా విదేశాంగ విధానమే అంత. ఉక్రెయిన్ నుండి సూడాన్, గాజా వరకు ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకున్న పలు ఘర్షణలు, దాడులు, దురాక్రమణల గురించి బైడెన్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఈ ఘర్షణలు, దాడులన్నిటిలోను అమెరికా పాత్ర ఉందనేది జగమెరిగిన సత్యం.

హమాస్ వద్ద ఉన్న బందీలను విడిపించడానికి, ఇజ్రాయిల్‌కు భద్రత కల్పించడానికి, గాజాను హమాస్ పట్టు నుండి విముక్తి చేయడానికి, తద్వారా గాజా ప్రజల ఇబ్బందులను పరిష్కరించడానికి వీలుగా గాజాలో కాల్పుల విరమణ జరగాలని, బందీల విడుదల ఒప్పందం కుదుర్చుకోవాలని బైడెన్ పిలుపిచ్చారు. ఉక్రెయిన్ ప్రజలకు బాసటగా నిలబడాలని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సభ్య దేశాలను కోరారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే

తన హయాంలో కీలకాంశంగా వుందని బైడెన్ సెలవిచ్చారు. . ప్రభుత్వ దేశీయ, విదేశాంగ విధానాలను విమర్శించేవారు ఎదుర్కొనే పోలీసు హింసను, అణచివేతను, మూకుమ్మడి అరెస్టులను ఆయన ఉద్దేశపూర్వకంగానే విస్మరించారు.

ఇజ్రాయిల్‌కు ఆయుధాలు ఎగుమతి చేయకుండా మొత్తంగా ఆంక్షలు విధించాలని పెద్దఎత్తున వస్తున్న డిమాండ్‌ను బైడెన్ ప్రభుత్వం పూర్తిగా పెడచెవిన పెట్టింది. పైగా ఉక్రెయిన్, గాజాల్లో ఘర్షణలను ఎగదోసేలా ఆయుధాలను సరఫరా చేస్తూనే వుంది. అమెరికా కార్మిక వర్గంలో దాదాపు సగ భాగంగా ఉన్న అసంఘటిత రంగ కార్మికులు, ఉద్యోగులు, అమెరికా జనాభాలో 61 శాతంగా ఉన్న వీరంతా ఆయుధాల ఎగుమతులపై ఆంక్షలు విధించాలని ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు. అమెరికా మాత్రం ఇజ్రాయ్‌కు బేషరతుగా మద్దతును కొనసాగిస్తూ వస్తోంది. ఆగస్టులో యూదు దురహంకార ఇజ్రాయిల్‌కు రెండు కోట్ల డాలర్ల ఆయుధ ప్యాకేజికి ఆమోదం తెలిపింది. లెబనాన్‌లో కూడా భూతల దాడులు విస్తరింపజేయాలని చూస్తోంది. . లెబనాన్‌లో ప్రస్తుత ఊచకోతకు బైడెన్ ప్రభుత్వమే కారణమని పాలస్తీనా యువజన ఉద్యమం విమర్శించింది. పైగా గాజాకు ఉద్దేశ్యపూర్వకంగానే ఇజ్రాయిల్ మానవతా సాయం అందకుండా చేస్తోందని అమెరికాకు తెలుసు, అయినా కూడా ఇజ్రాయిల్ మారణహోమానికి అమెరికా మద్దతును కొనసాగిస్తోంది.

ప్రధానంగా సూడాన్‌లో నెలకొన్న దారుణమైన మానవతా పరిస్థితులను విమర్శించడానికి బైడెన్ తన ప్రసంగంలో ఎక్కువ సమయం కేటాయించారు. పైగా సూడాన్‌కు మానవతాసాయం అందించే విషయంలో అమెరికా అగ్ర భాగాన వుందని చెప్పుకున్నారు. అయితే అంతర్జాతీయంగా ఎక్కడ ఘర్షణలు తలెత్తినా వాటిలో అమెరికా జోక్యం ఎలా వుంటుందో సూడాన్ ఒక చక్కటి ఉదాహరణ. దశాబ్దాల తరబడి క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయాలని అంతర్జాతీయ సమాజం విజ్ఞప్తి చేస్తున్నా అమెరికా లెక్కచేయడం లేదు. 60ఏళ్ళకు పైగా కొనసాగుతున్న ఆంక్షల నడుమ ఆ సోషలిస్టు దేశం నలిగిపోతోంది. ఇటీవలే 73దేశాలకు చెందిన 600మందికి పైగా పార్లమెంట్ సభ్యులు క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ సంయుక్తంగా ఒక లేఖ రాశారు. 35మంది మాజీ ప్రభుత్వాధినేతలు బైడెన్‌కు విడిగా మరో లేఖ రాశారు. క్యూబాను ఉగ్రవాద జాబితా నుండి తొలగించాలని కోరారు.

ఈ దేశాలనే కాదు, ఇంకా ఇరాన్, ఉత్తర కొరియా, రష్యా, వెనిజులా, సిరియా వంటి పలు దేశాలపై సమగ్ర ఆంక్షల రూపంలో చర్యలు తీసుకుంటూ ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తున్నారు. చైనా వంటి మరికొన్ని దేశాలపై నిరంతరంగా దాడులకు దిగుతూనే వుంటుంది.

ప్రపంచ నేతలందరి దృష్టి గాజా పైనే!

- ఇజ్రాయిల్‌పై ఆంక్షలు, చర్యలకు పిలుపు

న్యూయార్క్ : ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ వార్షిక సమావేశాల్లో గాజాపైనే ప్రధానంగా ప్రపంచ నేతలంతా దృష్టి సారించారు. ఐరాస జనరల్ అసెంబ్లీ 78వ వార్షిక సమావేశంలో ప్రసంగించిన ప్రతి నేత గాజాలోని పరిస్థితుల పట్ల, అక్కడ నెలకొన్న మానవతా సంక్షోభం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని, సూడాన్‌లో అంతర్యుద్ధాన్ని చాలామంది ప్రముఖంగా ప్రస్తావించారు. అలాగే వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న వైపరీత్యాలు, నిరుపేద దేశాలు పడుతున్న ఇబ్బందులు కూడా ప్రస్తావనకు వచ్చాయి.

ఇంతకన్నా భయంకరమైన సంక్షోభం గతంలో ఎన్నడూ లేదని జోర్డాన్ రాజు అబ్దుల్లా వ్యాఖ్యానించారు. మానవ హక్కులను పరిరక్షించే అంతర్జాతీయ వ్యవస్థను సైతం ఇజ్రాయిల్ దెబ్బ తీస్తోందని ఆయన విమర్శించారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా మాట్లాడుతూ, ఆత్మ రక్షణ హక్కు కాస్తా ప్రతీకార హక్కుగా మారిందని వ్యాఖ్యానించారు. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ మాట్లాడుతూ, ఐక్యరాజ్య సమితి పనిచేయని ఒక సంస్థగా మిగిలిపోయిందని విమర్శించారు. ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించాలని భద్రతా మండలిని ఆయన కోరారు. అవసరమైతే బల ప్రయోగంతోనైనా గాజాలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు జనరల్ అసెంబ్లీ సిఫార్సు చేయాలన్నారు.

ఇజ్రాయిల్ నేరాలకు జవాబుదారీతనం కావాలి

- ఇరాన్ డిమాండ్

టెహరాన్ : పాలస్తీనా, లెబనాన్‌ల్లో ఇజ్రాయిల్ ఊచకోతలకు పాల్పడతున్నా అంతర్జాతీయ సమాజం మౌనంగా చూస్తూ కూర్చోవడం పట్ల ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెషికాన్ ఆందోళన వ్యక్తం చేశారు. యుఎన్ జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఆయన మాట్లాడారు. పశ్చిమ దేశాల వైపు నుండి కార్యాచరణ లోపించినందున దానికి ప్రత్యామ్నాయంగా శాంతి స్థాపనకు, సమిష్టి సంక్షేమానికి ప్రాంతీయ చొరవ తీసుకోవాలని ప్రతిపాదించారు. హింసను తక్షణమే ఆపి, గాజాలో శాశ్వత కాల్పుల విరమణకు అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవడం అవశ్యమని అన్నారు. లెబనాన్‌లో ఇజ్రాయిల్ ఆటవిక చర్యలకు తక్షణమే ఫుల్‌స్టాప్ పెట్టేలా చూడాలన్నారు. ప్రాంతీయంగా చెలరేగిన ఈ ఘర్షణలు ఇతర ప్రాంతాలకు, మొత్తంగా ప్రపంచానికి వ్యాపించకముందే జాగ్రత్త పడాలని సూచించారు. అంతర్జాతీయ సమాజం చేతులు ముడుచుకుని కూర్చోవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. 42వేల మందికి పైగా పాలస్తీనియన్ల హత్యకు జవాబుదారీతనం కావాలని డిమాండ్ చేశారు. పైగా ఇజ్రాయిల్ చర్యలను వ్యతిరేకించడాన్ని యూదు వ్యతిరేకిగా ముద్ర వేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ చట్టాలను, మానవ హక్కులను దారుణంగా ఇజ్రాయిల్ అతిక్రమిస్తోందన్నారు.

కొత్త క్రీడా పాలసీని రూపొందించండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు పాంచజన్య, ప్రాజెక్టు విజయ, డే బోర్డర్స్, స్పోర్ట్స్ నర్సరీస్ కార్యక్రమాలను తిరిగి పునరుద్ధరించాలని ఆదేశించారు. అన్ని స్టేడియాల్లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. 2019కి ముందు టిడిపి ప్రభుత్వంలో క్రీడా అకాడమీల ఏర్పాటుకు స్థలాలు పొందిన వారితో సంప్రదింపులు జరిపి వెంటనే వాటి ఏర్పాటు పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. క్రీడా నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలని అన్నారు. అమరావతిలతో ఇక్కడ అతిపెద్ద స్టేడియంను నిర్మిస్తామన్నారు. రాష్ట్ర సచివాలయంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా చిన్న పాటి స్పోర్ట్స్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. సచివాలయంలో విధుల అనంతరం అధికారులు, ఉద్యోగులు కొంతసేపు ఆటలు ఆడుకునే అవకాశం కల్పించాలని అన్నారు. రాష్ట్రంలో సాధ్యమైనంతమేర కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో స్పోర్ట్స్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలీస్, యూనివర్సిటీ, ప్రైవేట్ విద్యాసంస్థల మైదానాలను సామాన్య ప్రజలకు నిర్దేశిత సమయం వరకు అందుబాటులోకి తేవాలని సూచించారు. తద్వారా ఆయా ప్రాంతాల ప్రజలు వ్యాయామం, ఆటలు ఆడుకునేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో క్రీడల శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, పర్యాటక, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాడ్రేవు వినయ్ చంద్, శాప్ ఎండి గిరిషా పిఎస్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌నార్‌కు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు

(మొదటి పేజీ తరువాయి)

పంపించేసి ప్రైవేట్ వ్యక్తులకు ప్లాంట్‌ను కట్టబెడతారా? అంటూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్ కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నారు. కూటమి పార్టీలు, సిఎం చంద్రబాబు ఇప్పటికైనా కేంద్ర పాలకులపై ఉక్కు రక్షణ కోసం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ సర్కారు ఉక్కుపై విషం కక్కుతూ ఇంకా ఆరు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించాలనే కుట్రకు పాల్పడుతోందన్నారు. రోజుకు 21 వేల టన్నులు హాట్‌మెటల్ బయటకు రావాల్సి ఉన్నా బ్లాస్ట్ ఫర్నేస్‌లు రెండు మూసెయ్యడం, రా మెటీరియల్ లేకపోవడంతో రోజుకు 4500 టన్నులే మెటల్ వస్తుందని ఆందోళన చెందారు. తప్పుడు నివేదికలతో విశాఖ ఉక్కు కార్మికుల పొట్టకొట్టాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.

మద్యం అమ్మకాలు పెంచే విధానం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. అన్ని అనర్థాలకు కారణమైన మద్యాన్ని నిషేధించకపోగా మరింత ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా మద్యం దుకాణాలు పెంచడం, 99 రూపాయలకే క్వార్టర్ సీసా అందించాలని నిర్ణయించటం దారుణమని విమర్శించారు కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ నాణ్యమైన మద్యం ప్రజల ప్రాణాలు తీయదా అని ప్రశ్నించారు. నాసిరకం మద్య తాగి 30 వేల మంది చనిపోయారని, 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని ప్రచారం చేసిన కూటమి నేతలు ఈ వంద రోజుల్లో ఆయా బాధిత కుటుంబాల్లో ఒక్కరికైనా న్యాయం చేశారా అని నిలదీశారు.

ప్రగతిశీల మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి పద్మ మాట్లాడుతూ రాజకీయ పార్టీల మధ్య విభేదాలు ఉన్నా మద్యం పాలసీల్లో అన్ని పార్టీల విధానం ఒకటేనని విమర్శించారు. కొత్త మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి రోజున మహిళా సంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో భూమిక కలెక్టివ్ సంస్థ ప్రతినిధి దారా బిందు, అరసం నాయకులు ఎం అరుణకుమార్, మహిళా సంఘం నాయకులు పంచదార్ల దుర్గాంబ, ఐద్వా నాయకులు జి అమలశ్రీ, కె దుర్గా వెంకటరత్నం, సౌమ్య, పీఓడబ్ల్యూ నాయకులు దుర్గ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మీకోసం

ఆహార పదార్థాలు గోరువెచ్చగా అయ్యాకే నిమ్మరసం చల్లాలి. వేడిగా ఉన్నప్పుడు కలిపితే అందులోని సి విటమిన్, పోషకాలు నశిస్తాయి.

జీవన సౌరభం

ఏమీ లేనప్పుడు ఓపిక, అన్నీ ఉన్నప్పుడు ప్రవర్తన.. మనిషి వ్యక్తిత్వాన్ని పెంచుతాయి.

ఎలుక మామ - చిలుకమ్మ

ఊరి చివర చెరువు చెంత
పాక పక్క గట్టు మీద
ఒకే ఒక్క పండ్ల చెట్టు
కాయలు కాసేను విందుగ.

చెట్టు కింద బొరియ లోన
చిన్ని ఎలుక నివసించే
రాలిన పండ్లను తింటూ
చింత లేక జీవించెను

'ఎంతసేపు రాలినవే
తింటావేం ఎలుక మామ
తాజా పండ్లను కొరికి
రుచి చూడవె చిలుక లాగా'

అంటూ హిత బోధ చేసే
కొమ్మనున్న కోయిలమ్మ
నిజమే అని ఎలుకమ్మ
పండ్ల చెట్టు పైకి ఎక్కే .

దోరకాయ నెంచలేక
అన్ని పండ్లు కొరికింది.

అది, ఇది బాగాలేదు
అంటూ కింద కిసిరింది.

ఒక్క కాయ నచ్చలేదు
మంచి కాయ దొరకలేదు.
చెట్టు పైన కాయలన్నీ
చెట్టు కింద పోసెనాయే!

'నన్నడిగితే దోరకాయ
ఎంచి కోసి ఇచ్చెదనుగ.
పచ్చి కాయలన్నీ కోసి
కిందన పడ వేస్తివిగ

ఈ రోజవి పనికిరావు
రేపుకు కాయలు లేవు
తెలియక చేసిన ఈ పని
చేటు తెచ్చే నందరికి ...

నష్టమెంతో జరిగాక
తప్పు తెలిసి ఏం లాభం?
తొందరపడి పనులు చేస్తే
నిందలు పడడం ఖాయం'

అన్న చిలుక మాటలకు
తలను వంచే ఎలుకమ్మ
మొక్కకు నీరును పోసే
పని చెప్పెను చిలకమ్మ

చిలుక, ఎలుక దోస్తులాయే
సరదాగా కలిసిపోయే
చిలుక ఇచ్చే కాయతింటూ
ఎలుక రోజు మురిసి పోయే!

- కూచిమంచి నాగేంద్ర,
91821 27880.

తేడాలు గుర్తించండి



పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

కోడ. వరం,
8వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్,
ముత్యాలపేట, కవిటి, శ్రీకాకుళం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

డెంగీతో జాగ్రత్త ...

వర్షాకాలంలో సాధారణ జ్వరాలతోపాటుగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాలు కూడా వస్తుండటం సహజం. ఈ కాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందే రోగాల్లో డెంగీ జ్వరం ఒకటి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది డెంగీ భారిన పడుతుంటారని అంచనా. డెంగీ జ్వరం నూటికి 99 శాతం మందికి పెద్దగా ఇబ్బంది పెట్టకుండానే తగ్గిపోతుందనీ, మరికొందరికైతే అసలు వచ్చినా తెలియకుండానే తగ్గిపోతుందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. ఒక్క శాతం మందిలోనే తీవ్రంగా పరిణమిస్తుంది. దోమ కుట్టాక 3-14 రోజుల్లో ఎప్పుడైనా డెంగీ ఇన్‌ఫెక్షన్ రావొచ్చు. ప్లేట్‌లెట్లు తగ్గటం, రక్తం చిక్కపడటం, రక్తస్రావం వంటి సమస్యలకు దారితీస్తుంది. సకాలంలో, సరైన చికిత్స తీసుకుంటే వీటిని కూడా చాలావరకు నివారించుకోవచ్చు. దోమలు కుట్టకుండా చూసుకుంటే అసలు డెంగ్యూ భారినపడకుండానే కాపాడుకోవచ్చు. దీనిపై అవగాహన పెంచుకొని, మసలు కోవటం మంచిది. పిల్లలకు డెంగీ సోకితే మరింత ప్రమాదకరంగా ఉంటుంది. ఆరోగ్యం బాగా దెబ్బతింటుంది. అందుకే, పిల్లలకు డెంగీ సోకకుండా పెద్దలు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.

ప్రస్తుతం డెంగీ రెండో రకం వైరస్ ఎక్కువగా ప్రబలుతోంది. దీంతో త్వరగా ప్లేట్‌లెట్లు పడిపోవటం ఆందోళన కలిగిస్తోంది. అప్రమత్తంగా ఉండాలి. మధుమేహం, అధిక రక్తపోటు, పొట్టలో అల్సర్లు, రక్తహీనత గలవారితో పాటు గర్భిణులు, ఊబకాయులు, ఏడాది లోపు పిల్లలు, వృద్ధులకు డెంగీ ప్రమాదకరంగా పరిణమించొచ్చు. లక్షణాలు అంత స్పష్టంగా లేకపోయినా వీరికి ఆసుపత్రిలో చికిత్స అవసరం.

ఎడిస్ ఈజిప్టి దోమతో వ్యాప్తి

'ఎడిస్ ఈజిప్టి' దోమ కుట్టడం ద్వారానే డెంగీ ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. నిల్వ ఉన్న నీటిలోనే ఎడిస్ దోమలు గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేస్తాయి. నీరు నిల్వ ఉన్న చోట ఈ దోమలు ఎక్కువగా పెరుగుతాయి. అందుకే ఇంటి పరిసరాలు, చుట్టు పక్కల నీరు నిల్వ ఉండే వాటిని గుర్తించి తొలగించాలి. పూలకుండీలు, బక్కెట్లు, పాత వస్తువులు, పక్కన పడేసి టైర్లు, వినియోగించని ఎయిర్ కూలర్లు ఇలాంటి ఏవైనా ఉంటే వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలి. దోమలు కుట్టకుండా నివారించేందుకు చర్మానికి రాసుకునేందుకు రిపెలెంట్స్ (క్రీమ్స్, స్ప్రేలు) అందుబాటులో ఉన్నాయి. అయితే, ఈ రిపెలెంట్లను పిల్లల కళ్లు, నోరు, అరచేతులకు రాయకూడదు. వాటికి తగలకుండా చూసుకోవాలి.

వైరస్‌ల ప్రభావంతోనే...

డెంగీ వైరస్‌లలో నాలుగు రకాలున్నాయి. ఒక రకం వైరస్‌తో ఒకసారే డెంగీ వస్తుంది. అయితే ఇతర రకాల వైరస్‌లతో రావొచ్చు. అంటే ఒకరికి జీవితంలో గరిష్ఠంగా నాలుగుసార్లు డెంగీ వచ్చే అవకాశముంటుందని అనుకోవచ్చు. రెండోసారి, మూడోసారి మరో రకం వైరస్‌తో జ్వరం వస్తే మాత్రం చాలా తీవ్రంగా ఉంటుంది. డెంగీ జ్వరంలో అందరికీ ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం లేదు. ప్లేట్‌లెట్ల సంఖ్య లక్ష కన్నా తగ్గినప్పుడు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలి. 50వేల కన్నా పడిపోతే ఆసుపత్రిలో చేర్చాలి. వీరిని నిశితంగా పరిశీలిస్తుండాలి. ఒకవేళ ప్లేట్‌లెట్లు 20 వేల కన్నా తగ్గి, రక్తస్రావ లక్షణాలు కనిపిస్తుంటే బయటి నుంచి ఎక్కించాల్సి వస్తుంది. అదే 10 వేలకు పడిపోతే.. రక్తస్రావం ఉన్నా లేకున్నా ప్లేట్‌లెట్లు ఎక్కించాలి.

ఏం చేయాలి?

ఒక మాదిరి డెంగీ జ్వరానికి పారాసిట్మాల్ మాత్రలు ఇస్తే సరిపోతుంది. వాంతులు లేకపోతే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. అవుతుంటే వాటిని తగ్గించే మందులతో పాటు ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఇవ్వాలి. అప్పటికీ తగ్గకపోతే ముఖ్యంగా పిల్లలను ఆసుపత్రిలో చేర్చి, చికిత్స చేయాలి. ప్లేట్‌లెట్లు బాగా తగ్గటం, రక్తం చిక్కబడటం వంటివి గలవారికి తరచూ రక్తం చిక్కదనాన్ని తెలిపే హిమటోక్రిట్, ప్యాక్డ్ సెల్ వాల్యూమ్, ప్లేట్‌లెట్ల సంఖ్య తెలుసుకోవటానికి రక్తపరీక్షల వంటివి చేస్తూ జాగ్రత్తగా కనిపెట్టుకోవాలి.

డెంగీ లక్షణాలు

- తీవ్రమైన జ్వరం
- శరీరంపై దద్దుర్లు
- శర్మం ద్వారా రక్తస్రావం
- తీవ్రమైన తలనొప్పి
- కండరాలు, కీళ్ళనొప్పులు
- ఆకలి మందగించడం
- ఒంట్లో రక్తస్రావం జరిగి ప్రాణాపాయ ప్రమాదం
- వాంతులు, వికారంగా ఉండటం
- ఆకలి మందగించటం

పిల్లల్లో ... : పిల్లల్లో అకస్మాత్తుగా జ్వరం, కండరాలు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, శరీరంపై దద్దుర్లు ఉంటే వారికి డెంగీగా భావించొచ్చు. కొన్నిసార్లు పొత్తికడుపు నొప్పి, విరేచనాలు, వికారం లేదా వాంతులు అవుతాయి. పిల్లలకు జ్వరం తగ్గిన తర్వాత మొదటి ఒకటి రెండు రోజుల్లో డెంగీ జ్వరం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

- అతి నిద్ర
- వాంతులు లేదా నోటి ద్రవాలను స్వీకరించడానికి నిరాకరించడం
- పొత్తి కడుపు నొప్పి
- ముక్కు, చిగుళ్ల రక్తస్రావం
- గత 6 గంటల్లో మూత్రం లేకపోవడం.
- చలితోపాటు చెమటలు పట్టడం
- చేతులు, కాళ్లు చల్లబడటం
- చర్మం మసకబారడం

ఎలిసా టెస్ట్‌తో నిర్ధారణ

డెంగీ లక్షణాలు ఉంటే సమీపంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోగానీ పరీక్షచేయించుకోవాలి. ఈ పరీక్షలో పాజిటివ్ వచ్చినా గానీ దానిని డెంగీగా నిర్ధారించరాదు. 'ఎలిసా' పరీక్ష చేసిన తర్వాత పాజిటివ్‌గా వస్తే నిర్ధారిస్తారు. ఈ టెస్ట్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రులన్నింటిలోనూ చేస్తున్నారు.

ఇవి పాటిస్తే ఎంతోమేలు



- ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూడాలి.
- ఆరోగ్య సిబ్బంది సలహాలు పాటించాలి.
- డాక్టరు ద్వారా వైద్య పరీక్షలు చేయించుకుని తగిన మందులను తీసుకోవాలి.
- దోమల మందు పిచికారీ చేయాలి
- దోమలు రాకుండా ఉండటానికి ఇంటి కిటికీలు, తలుపులకు మెష్‌ను వాడాలి.
- ఇంటి చుట్టుపక్కన నీరు నిల్వ లేకుండా చూడాలి.
- ఎసిలు, పూలకుండీలు, వాడని పాత సామాను (పాతటైర్లు, కొబ్బరిబొండాలు, డ్రమ్ములు)లో నీరు ఎప్పటికప్పుడు పారపోయాలి.
- వాటిని ఎండనివ్వాలి. మురుగుగుంతల్లో ఆయిల్‌బాల్స్ వేయాలి. అప్పుడు దోమలగుడ్లు వృద్ధి చెందకుండా ఉంటాయి.

రేపు 'గేమ్‌ఛేంజర్' సాంగ్ ప్రోమో

రామ్‌చరణ్ హీరోగా, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'గేమ్‌ఛేంజర్'. కియారా అద్వానీ హీరోయిన్. ఇప్పటికే ఈ సినిమా నుంచి 'జరగండి జరగండి..' పాటను మేకర్లు విడుదల చేశారు. సెకండ్ సాంగ్ 'రా మచ్చా మచ్చా' ప్రోమో విడుదల ఈనెల 28న చేయబోతున్నామని పేర్కొన్నారు. సంగీతం తమన్. ఈ పాటను అనంత శ్రీరామ్ రాశారు. అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్లపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా ఈ సినిమాను విడుదల చేయబోతున్నారు.

'స్త్రీ 2' సినిమా స్ట్రీమింగ్

శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు, పంకజ్ త్రిపాఠి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'స్త్రీ 2'. ఓటీటీలోకి వచ్చిన ఈ చిత్రం ట్రెండింగ్‌తో మంచి ఆదరణ చూరగొంటోంది. ఆగస్టు 15న విడుదలైన ఈ సినిమా బాలీవుడ్‌లో హిట్‌టాక్ అందుకుంది. 2018లో విడుదలైన 'స్త్రీ' సినిమాకు సీక్వెల్‌గా ఈ మూవీ వచ్చింది. అమర్ కౌశిక్ దర్శకత్వం వహించారు. ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఎలాంటి ప్రకటన లేకుండా ఈ చిత్రాన్ని ఓటీటీలో విడుదల చేశారు. ప్రస్తుతానికి అద్దె ప్రాతిపదికన (రూ.349) చూసే అవకాశం ఉంది. ఓ ప్రత్యేక పాటలో తమన్నా స్టెప్పులేశారు. అక్షయ్ కుమార్ అతిథి పాత్రలో కనిపించటం ఈ సినిమాకు మరో స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది.

అలియా 'జిగ్రా' ట్రైలర్ విడుదల

అలియా భట్ నటిస్తున్న తాజా చిత్రం 'జిగ్రా'. ఈ సినిమాను ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కరణ్ జోహార్, అపూర్వ మెహతా, అలియా భట్, షాహీన్ భట్ అండ్ సోమెన్ మిశ్రా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'మౌనిక ఓ మై డార్లింగ్' సినిమా ఫేం వసన్ బాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 11న విడుదల కానుంది. ప్రమోషన్లలో భాగంగా తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌ని బట్టి, బ్రదర్, సిస్టర్ సెంటిమెంట్‌తో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తోంది. 'ఆర్చీస్' చిత్రంలో కీలక పాత్ర పోషించిన వేదాంగ్ రైనా అలియా భట్ తమ్ముడిగా నటిస్తుండగా.. టాలీవుడ్ నటుడు రాహుల్ రవీంద్రన్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

'దేవర' పోస్టర్లపై స్టీల్‌ప్లాంటు నినాదాలు

జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదలవుతున్న వేళ సినిమా ప్రచార పోస్టర్ల వ్యవహారం కీలక పరిణామం చోటుచేసుకుంది. విశాఖపట్నం రామా టాకీస్ థియేటర్ వద్ద సేవ్ వైజాగ్ స్టీల్ ప్లాంట్.. విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అనే నినాదాల పోస్టర్లను జన జాగరణ సమితి నాయకులు దేవర సినిమా పోస్టర్లపై అతికించారు. విశాఖ ఉక్కు ఉద్యమానికి జూనియర్ ఎన్టీఆర్ మద్దతునివ్వాలని కోరుతూ ఈ ప్రచారం చేపట్టారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని మరింతగా జనంలోకి తీసుకెళ్ళేందుకు ఈ ప్రచార పోస్టర్లు అతికించినట్లుగా సభ్యులు వెల్లడించారు.

ఓటీటీలో అక్షయ్ కుమార్ 'సర్ఫిరా'

బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ నటించిన చిత్రం 'సర్ఫిరా' త్వరలో ఓటీటీలో విడుదల కానుంది. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుధా కొంగర తెరకెక్కించిన ఈ చిత్రం జులై 12న విడుదలైంది. సూర్య ప్రధాన పాత్రలో నటించిన ఆకాశమే నీ హద్దురా' చిత్రానికి రీమేక్‌గా 'సర్ఫిరా' బాలీవుడ్‌లో విడుదలైంది. ఇందులో రాధిక మదన్, పరేష్ రావల్ కీలకపాత్రల్లో నటించారు. అబండెన్షియా ఎంటర్‌టైన్‌మెంట్, సూర్య హోం బ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్, కేప్ ఆఫ్ గుడ్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మించాయి. డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో అక్టోబర్ 11 నుంచి 'సర్ఫిరా' స్ట్రీమింగ్ అవుతుందని అక్షయ్‌కుమార్ ప్రకటించారు.

27 నుంచి ఐఫా 2024

సినీరంగంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఐఫా అవార్డుల వేడుక అబుదాబి వేదికగా సెప్టెంబర్ 27 నుంచి 29 వరకు జరగనుంది. ఈ సినీ పండగ (ఐఫా 2024) కోసం ఇప్పటికే సెలబ్రిటీలు అక్కడికి చేరుకున్నారు. ఈ ఈవెంట్‌లో బాలీవుడ్ సీనియర్ నటి రేఖ నృత్య ప్రదర్శన చేయనున్నారు. ప్రతి ఏడాది తన డ్యాన్స్‌తో ఆకట్టుకునే రేఖ ఈ ఏడాది 150 మంది డ్యాన్సర్లతో 22 నిమిషాల పాటు వేదికపై డ్యాన్స్ చేయడం ప్రత్యేకంగా నిలవనుంది. ఈ విషయంపై ఆమె ఆనందం వ్యక్తంచేశారు. ఈ ప్రదర్శనకు ఆమె మనీష్ మల్హోత్రా ప్రత్యేకంగా డిజైన్ చేసిన కాస్ట్యూమ్‌ను ధరించనున్నారు. ఈ ఏడాది జరగనున్న ఐఫా వేడుకలకు బాలీవుడ్ స్టార్స్ హోస్ట్‌లుగా వ్యవహరించనున్నారు. షారుక్ ఖాన్, కరణ్ జోహర్, విక్కీ కౌశల్ ఈ ఈవెంట్‌లో యాంకర్లుగా సందడి చేయనున్నారు. షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో పాటు మరికొందరు అగ్రతారలు ఈ వేడుకలో పాల్గొననున్నారు.

క్లీన్‌స్వీప్‌పై టీమిండియా గురి

- బంగ్లాదేశ్‌తో రెండో, చివరి టెస్ట్ నేటినుంచే..
- ఉదయం 9.30గం॥ల నుంచి

కాన్పూర్: తొలిటెస్ట్‌లో ఘన విజయం సాధించిన టీమిండియా... ఇక క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టింది. కాన్పూర్ వేదికగా గ్రీన్‌పార్క్ స్టేడియంలో జరిగే రెండో, చివరి టెస్ట్‌లోనూ గెలిచి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌కు మరింత చేరువ కావాలని టీమిండియా భావిస్తోంది. తొలి రెండు డబ్ల్యుటిసి ఫైనల్‌కు చేరి ఇప్పటికే రికార్డు నెలకొల్పిన భారత్.. వరుసగా మూడోసారి ఫైనల్ బెర్త్ లక్ష్యంగా టెస్టుల్లో సత్తా చాటుతోంది. చెన్నై వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియా 268పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ స్వదేశంలో తొలి అంతర్జాతీయ టెస్ట్ ఆడేందుకు ఎదురుచూస్తున్నాడు. అతడికి టీమిండియా తుది జట్టులో చోటు దక్కితే ఏడేళ్ల తర్వాత అతడు స్వదేశంలో ఓ టెస్ట్ మ్యాచ్ ఆడనున్నాడు. గ్రీన్‌పార్క్ మైదానం క్యూరేటర్ మాట్లాడుతూ.. ఈ టెస్ట్‌లో ఫలితం రావడం ఖాయమని పేర్కొన్నాడు. మూడోరోజునుంచి పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుందని, ఇరుజట్లకు గెలుపు అవకాశాలున్నాయని పేర్కొన్నాడు. మరోవైపు బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్, ఆల్‌రౌండర్ షకీబ్ ఈ టెస్ట్ తర్వాత టి20 ఫార్మాట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించడంతో బంగ్లా ఆటగాళ్లంతా షాక్‌కు గురయ్యారు. ఈ క్రమంలో గ్రీన్ పార్క్‌లో షకీబ్ టెస్ట్ కెరీర్‌కు ముగింపు పలుకుతాడా? స్వదేశంలో మరో టెస్ట్ ఆడేవరకు వేచిచూస్తాడా? అనే సందేహం అందరిలోనూ నెలకొంది.

జట్లు(అంచనా)..

భారత్ : రోహిత్(కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్, కోహ్లి, పంత్(వికెట్ కీపర్), కెఎల్ రాహుల్, జడేజా, అశ్విన్, కుల్దీప్, ఆకాశ్ దీప్, సిరాజ్/బుమ్రా.

బంగ్లాదేశ్: నజ్ముల్(కెప్టెన్), షాద్మన్, జాకిర్ హసన్, మోమినుల్, ముష్ఫికర్, షకీబ్, లింటన్ దాస్(వికెట్ కీపర్), మెహిదీ హసన్, హసన్ మహ్మద్, తస్కిన్/నహిద్ రాణా, తైజుల్ ఇస్లామ్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68